# శ్రీ బుద్ధగీత

## ( బుద్ధ - ధర్మ )

Acc no 21960



గ్రంథకర్త:

టి. ఓబుళ నారాయణరెడ్డి

# కీర్తిశేషులు శ్రీ చల్లా సుబ్బరాయుడు గారితో నా స్మృతులు

నేను 1948 లో S. S. L. C. తాడిపత్రి హైస్కూలునందు చదువుచుంటిని. తాడిపత్రి విద్యార్థి కాంగ్రెస్ ప్రెశిడెంటు గాను మరియు అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుని గాను ఆకాలమందుంటిని. 1948 జనవరి 31, తేదీలలో జిల్లా రాష్ట్ర విద్యార్థి మహాసభలు తాడిపత్రిలో జరుప జిల్లా సంఘము నిర్ణయించెను. అందుకు తాడిపత్రి వాహినీ కళామందిరంలో ఆ సభలు జరుప తగు యేర్పాట్లు చేయబడెను. అనగా అందుకు తగు ఖర్చులకుగాను సుమారు ఆరు వేల రూపాయలకు పైబడి వసూలు చేసితిమి. ఆ మహాసభకు 30 వ తేదీ సాయంత్రానికి స్వాతంత్ర్య సమరయోధుడు మరియు గ్రంథాలయోద్యమ స్థాపకుడైన కీర్తిశేషులు శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారు మరియు ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరు ప్రకాశం పంతులుగారు వచ్చియుండిరి. ఇంకా చాలమంది పెద్దలు వక్తలుగా రావలసియుండిరి.

1948 జనవరి 30 వ తేది సాయంత్రం 5 గంటల పైబడిన సమయంలో పూజ్య గాంధీజీ హత్య జరిగిందని రేడియో విషాదాలు వినబడెను. అపుడు మా కార్యకర్త లందరు; బయటినుండి వచ్చిన నాయకులు మరియు ఇతర కార్యకర్త లా విషాధ వార్తలతో దిక్కుతోచని దుఃఖముతో నిర్విణ్ణులైపోతిమి. ఇక సభ ప్రస్తాపన ఆలోచనే మాకు లేదయ్యెను. ఎవరికివారు వెళ్ళిపోయిరి.

ఆ సభకుగాను తెచ్చిన బియ్యం, చక్కెర. బేడలు తదితర వంట సామగ్రి యంతయు ఖర్చుగాక యుండెను కదా! శ్రీ చల్లా సుబ్బరాయుడు హరిజన హాస్టలు అప్పటికే నడుపుచుండెను. మా విద్యార్థి కాంగ్రెస్ కార్యకర్తలు అనంతపురం శ్రీ డి. అశ్వర్థప్ప మరియు కల్యాణదుర్గం జి. నరసింహారెడ్డి గారు మరియు తాడిపత్రిలోని కొన్నగుంటపల్లె లక్ష్మిరెడ్డి కొండేపల్లె జి. నారాయణప్ప నిచ్చెనమెట్ల కృష్ణమూర్తి (తాడిపత్రి) నేను కలసి ఆ వంట సామాగ్రి అంతయు శ్రీ చల్లా సుబ్బరాయుడు గారికి అప్పుడెప్పుటకు హరిజన హాస్టలుకు ఉపయోగించుటకు తీర్మానించి యిచ్చితిమి. శ్రీ సుబ్బరాయుడుగారు ఆ సరుకు లన్నిటిని తీసికొని హరిజన విద్యార్థులకు హాస్టలునందు భోజన వసతికి ఉపయోగించెను.

అట్లు నాకు శ్రీ సుబ్బరాయుడు గారితో పరిచయ సన్నిహిత మేర్పడెను. ఆయన నిస్వార్థంగా ప్రజాసేవ చేయవలయుననెడి కాంక్షయే నిరంతరం ఆయనలో నిండియుండెను. క్రమంగా రైతుల, మరియు పేద జనులకు ప్రభుత్వంతో సహాయము చేయుటకై కృషిచేయుచుండెను. అందులో నేను పాల్గొనుచుంటిని. తాడిపత్రి తాలూకాకు విద్యుత్తు కావలయునన్న మా ఆందోళనతో పవర్ హౌసు నిర్మించబడి, టౌనుకు మరియు కొన్ని పల్లెలకు (బోడాయపల్లె) బావుల మోటార్లు వేసికొనుటకు ఉపయోగపడెను. క్రమంగా కరువులు వచ్చిన శిస్తు రిమిషన్‌లు కరువుపనులు చేయించుటకు ఆయన నాయకత్వాన అందోళనాది కార్యక్రమాలు సాగించితిమి. 1952 లో M. L. A. గా ఆయన యెన్నుకొనబడెను. ఆ కాలమందు తుంగభద్ర యెగువకాల్వకై మెకంజీ వేసిన స్కీము ఉన్నదని ఆయన తెలిసికొనెను. 1957 లో తిరిగి ఆయన M. L. A. గా యెన్నుకొనబడెను. ఆ స్కీము అందోళనను జిల్లా వ్యాప్తంగా ఆయన కృషి చేసెను. 1962 లో ఆయన శ్రీ కులశేఖర్‌రెడ్డితో పోటీచేసి ఓడిపోయెను. మరియు 1967 నుండి M. L. A. గా మరియు రాష్ట్ర ప్రభుత్వ మంత్రిగా యుండి మిక్కిలి పేరు ప్రతిష్ఠలతో నిస్వార్థ ప్రజా సేవకుడని ప్రసిద్ధి జెందెను. సివిల్ సప్లై మంత్రిగా యున్నపుడు కొందరు కొన్ని లక్షల రూపాయలు తెచ్చి తాము కోరిన యెగుమతులు బియ్యం చేసికొనుటకై కోరిరి. కాని ఆయన అందుకు పాల్పడక యొప్పుకొనలేదు.

ఆయన M. L. A. కాకమునుపుకూడ యెట్టి అన్యాయ అక్రమ స్వార్థములకు పాల్పడక కాంగ్రెస్ నిర్మాణ కార్యకర్తగా ప్రజాసేవచేయ అంకితమైయుండి పస్తులున్న రోజులు నేను చూచియున్నాను. మంత్రి కాబడినా యేవిధంగాను ఉన్నత జీవితయాశలు లేక సాధారణంగానే జీవించెను. అవినీతి అక్రమ సంపాదనల నిరసించెను. జిల్లాలో కాంగ్రెస్‌లోయున్న వారితో మంచి పేరు ప్రజల్లోను ప్రభుత్వంలోను సంపాదించెను. కాని తన సంతతికిగూడ ఏమియు సంపాదించి యిచ్చినది లేదు.

ఆయన 1952 యెన్నికలలో ఆయన ప్రజాపార్టీ పరంగా M.L.A. గా తాడిపత్రి నియోజక వర్గంలో పోటీచేసెను. ఎన్నికల ఖర్చుకు యతనివద్ద డబ్బు యేమియులేదు. చందాలు వసూలు చేసితిమి. ఒక జీపుకొనియుంటిమి.

ఎన్నికల తర్వాత దానిని యమ్మివేయగా రూ 4500 డబ్బు వచ్చెను. ఆ డబ్బుతోనే తర్వాత కొంత భూమి కొనెను. ఆ భూమిని ఆయన మరణానికి ముందువున్న యింటిస్థలము అమ్మివేసెను. అదియే ఆయన పిల్లలకిచ్చిన ఆస్తి.

ఆయన పెద్దకూతురు బాల్యమందే మనోవైకల్యముతో బాధకలుగగా మందుల నిప్పించి చికిత్సలు చేయించక తను భార్యా సమేతంగా ఘట్కాచలమాది దేవాళయాలందు దైవారాధనలు చేసి తన భక్తి పరతత్వాన్ని తెలుపుకొనెను.

అందుకే మంత్రిగా యున్నకాలమందునుండి పుట్టపర్తి శ్రీ సాయిబాబాపై భక్తి శ్రద్ధలు పెంచుకొనియుండెను. సరిపడని రాజకీయ ప్రత్యర్థులు అయన సంపాదన (అక్రమ) నంతా శ్రీ సాయిబాబావద్ద నిల్వచేసి యున్నాడని పెద్ద ప్రచారము జరిగినది. దురదృష్టవశాత్తు యొకింత ఆ మాటలు నేను కూడ బుద్ధిహీనంగా నమ్మితిని. అయితే మరి తెప్పరిల్లుకొని ఆయన నిజాయితీని తెలుసుకొని విచారించితిని. చెప్పంగ చెప్పంగ బ్రహ్మకైనా రిమ్మపుడుతుందన్న సామెత నాయందు సార్థకమయ్యెను. లేకున్న ప్రతికక్షులాయనపై దుష్ప్రచారము చేసిన ఆయన జీవితమంతయు తెలిసిన నేను యా యసత్యాలు నమ్మి తప్పుచేసితిని. తిరిగి నా తప్పు తెలిసికొని ఆయనను ప్రేమించి చివరివరకు అచంచల భక్తి విశ్వాసాలాయనపై కలిగియున్నాను.

శ్రీ చల్లా సుబ్బరాయుడు గారు తాను నమ్ముకొనియున్న శ్రీ సత్యసాయిబాబా (పుట్టపర్తి) ఆశ్రమంలోనే చివరికాలం అనగా అంత్యకాలం గడపనెంచి యచటనే యుండి తన జీవనం చివరివరకు గడపెను. కాని తన కుమారుల వద్దగాని కూతురువద్దగాని యుండ నిష్టపడకనే పై ఆశ్రమాన్ని ఆశ్రయించి చివరి నిమిషమువరకు జీవించి శ్రీసత్యసాయిబాబా ఆశీస్సులంది పరమపదించి ధన్యుడయ్యెను.

గౌ॥ శ్రీ చల్లా సుబ్బరాయుడు గారిని 1985–86లో నేటి ముఖ్యమంత్రి శ్రీ యన్.టి. రామారావుగారు రాష్ట్ర ఇరిగేషన్ కమిటీ మెంబరుగా నియమించుకొనియుండెను. నేటి శ్రీ శివరామక్రిష్ణయ్యగారు (ప్రఖ్యాత ఇంజనీరు) మరియు శ్రీ చల్లాసుబ్బరాయుడుగారు కలిసి రాయలసీమను శాశ్వతంగా కరువునుండి విముక్తి చేయనెంచి ఆనాడే గాలేరు–నగరి మరియు హంద్రీ–నీవా నీటిపారుదల పథకాలు సృష్టించినవేనని నేను సర్వులకు మనవి చేయుచున్నాను.

కీర్తిశేషులు శ్రీయుత గౌ॥ చల్లా సుబ్బారాయుడుగారు రాయలసీమ నీటి వనరుల గురించి సిద్ధాంతరీకరించిన సూత్రమేమంటే "కృష్ణా జలాలు పారని ప్రాంతానికే తుంగభద్రానది నీరు పారించవలయును.

అందుకే తాడిపత్రి తాలూకాలో ఆయన సేవలకు గుర్తుగా సుబ్బారాయ సాగర్ యను నిర్మాణము ఒక చెరువు పేరు స్థాపన జరిగి యందుండి తుంగభద్ర యెగువకాల్వ నీరు ప్రవహిస్తూ తాడిపత్రి సస్యశ్యామలమై యున్నదని వేరుగా తెల్ప పనిలేదు. ఆయనతోపాటు ఆయన మార్గంలో నేనును జీవయాత్ర చేసితిని. ఆయన జ్ఞాపకార్థం నా చిరకాల మైత్రీబంధముతో ఆయన మంచి తనాన్ని చాటేందుకే నేను యీ మంచి మనిషికి చేదోడువాదోడుగా నుండి పలు కష్టనష్టాలనుభవించినా నేనాయన మంచితనం చాటేందుకే కృతజ్ఞత బావముతో యీ శ్రీ బుద్ధగీత కావ్యమును మనసార అంకితమిచ్చి యాయనకు నా ప్రేమ పూర్వక ధన్యవాదము లర్పించుకొనుచున్నాను.

ఐతే కీర్తిశేషులు శ్రీ చల్లా సుబ్బారాయుడుగారు మంత్రిగా 8 ఏండ్లు M.L.A. గా 15 ఏండ్లు నుండెను. ఏ మాత్రం సంపాదనకై ప్రయత్నించలేదు. అట్టి అలోచనా విధానమే లేని మనిషి. జనులందరికి సహాయపడాలనువాడు. పేదలను ప్రేమించువాడు, అంతేగాదు, తన సంతానం కొడుకులు కూతు రుండినా వారికేమాత్రం అర్థిక సంపాదన మార్గాలను చూపలేదు. తెలుపలేదు. పిల్లలు స్వయంగా వారికాళ్ళమీద వారు నిలబడాలనువాడు. కష్టములనోర్చి స్వయంగా కృషిచేసి ధన సంపాదన చేసుకోవాలనేవాడు. అహింసా సిద్ధాంతి. గాంధీజి భక్తుడు ఉన్నదానితో తృప్తి పడాలనేవాడు. అ విధంగానే నేనుకూడ నడుచుకున్నాను ఆయననే ఆదర్శంగా నేను యెదిగితిని. చివరగా త్యాగమూర్తి అమరుడు శ్రీ తరిమెల నాగిరెడ్డి గారి మార్గం అనుసరించ తలచితిని. ఐనా శ్రీ సుబ్బారాయుడుగారు అసూయ చెందలేదు. నాపై ద్వేషంలేదు. ఇతరులతో "వాడు చెపితే వినేవాడు కాదు. వానికివాడే మంచి చెడ్డలను తెలిసికొని కలుగును" అవి నన్ను గురించి అనేవాడు. మా అనుబంధానికనుగుణ్యంగా నేను నా ప్రేమ భక్తిపూర్వకంగా యీ గ్రంధాన్ని ఆయన సేవకు గుర్తింపుగా ఆయన కంకితంగా సమర్పించుకొంటున్నానని మనవి చేయుచు ఆయనకు జోహార్లు అర్పించుచున్నాను.

టి. ఓబుళ నారాయణరెడ్డి
గ్రంథకర్త

# ముందుమాట

శ్రీ బుద్ధదేవుని జీవిత చరిత్రతోపాటు ఆయన తత్వోపదేశాలు నాకు తెలియుటకు సహాయపడిన గ్రంథాలు, పత్రికలు 1. *Light of Asia* 2. బుద్ధ పురాణం 3. *The Maha Bodhi Society of India Reproduction of Reports Published hundred years ago on Anagarika Dharmapala's Participation in the Parliament of the world's Religions in Chicago in 1893.* (మహాబోధి సొసైటి నూరేండ్ల క్రిందట చికాగోలో 1893 లో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనం గురించి వెలువరించిన పత్రికాసంచికలు. ఆ సభలో అనగారిక ధర్మపాలుడు పాల్గొన్న విషయమందున్నది.) 4. *The World's Debt to Buddha* 5. జనశక్తిప్రచురణ 15-2-94

శ్రీ బుద్ధ పురాణ గ్రంథాన్ని నాకు ప్రేమతో చదువమని యిచ్చిన కీర్తి శేషులు, స్వాతంత్ర్య సమరయోధుడు(పాతతరం)శ్రీమాన్ కలచవీడు వెంకట రమణాచార్యులు (తాడిపత్రి) గారికి నా జోహార్లు. ఆయన ఆత్మ శాంతి నొందుగాకయని దేవుని ప్రార్థించుచున్నాను.

*Light of Asia* ఆంగ్ల గ్రంథాన్ని చదివి అందున్న జ్ఞానాన్ని తెలిసికొన దారిచూపిన *Sir Edwin Arnold* అను ఆ గ్రంథ రచయితకు హృదయపూర్వక జోహార్లు. ఇక పై తెల్పిన 3, 4, 5 గ్రంథాలు పత్రికలు నాకు ప్రేమతో నా శ్రద్ధ గమనించి యిచ్చి నాకు సహాయపడిన ప్రముఖ జర్నలిస్టు, స్వాతంత్ర్య సమరయోధుడు, నా స్నేహితుడు శ్రీ జి. రామకృష్ణ (అనంతపురం) అను ఆయనకు నా కృతజ్ఞతాభివందనములు.

ఈ శ్రీ బుద్ధగీత రచనకు స్ఫూర్తి కలిగించిన కృష్ణదేవరాయ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ శ్రీ కొలికలూరు ఇనాక్ గారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

శ్రీ బుద్ధగీతను అచ్చు వేయించుటకు నేను అడిగినదే తడవుగా కీర్తిశేషులు గా॥ మాజీమంత్రివర్యులు శ్రీ చల్లా సుబ్బారాయుడు గారి కుమారులు చిరంజీవి ధృవకుమార్ మరియు చిరంజీవి కోదండరాం గార్లు అంగీకరించి తగు ధన సహాయం చేసినందులకు సర్వదా వారు ఆయు రారోగ్యములతో వారి పుత్ర పౌత్రాదిగా సిరిసంపదలతో, సుఖసంతోషా నందాలతో తులతూగవలయునని విశ్వేశ్వరుని శ్రీ బుద్ధదేవుని ప్రార్థించు చున్నాను.

చిన్నపాలమడ
8-5-95

ఇట్లు
గ్రంథకర్త

---

డా॥ సి. నారాయణరెడ్డి

13-4-95

*Office of the Adviser to Government*
*Culture and Language*
*Kala Bhavan, Hyderabad - 500 004*

శ్రీ ఓబుళ నారాయణరెడ్డి గారికి
నమస్కారం

"శ్రీ బుద్ధగీత" చదివాను. దుగ్గిరాల వారి "బుద్ధ పురాణం" ను ఆధారంగా చేసుకుని వచన రూపంలో బుద్ధుని సూక్తులను పుస్తక రూపంలో అందించినందుకు అభినందనలు.

మీ
సి. నారాయణరెడ్డి

మిత్రుడు శ్రీ టి. ఓబుళ నారాయణరెడ్డి జీవితములో అనేక ప్రజా సమస్యల కోసరం పోరాడినవాడు. ముఖ్యంగా రైతు ఉద్యమ నాయకుడు. ఉన్నట్లుండి ఒకనాడు ఎడ్విన్ అర్నాల్డు బుద్ధుని గురించి వ్రాసిన ఇంగ్లీషు కావ్యం లైట్ ఆఫ్ ఆసియా ను చదివినాడు. ఆవేదన పడినాడు. తపనపడి "శాంతి చక్రవర్తి" అను బుద్ధ చరిత్రను రచించాడు. ఆ పుస్తకం వెలువడింది.

ఆంధ్ర దేశానికి మొట్టమొదటగా బుద్ధ చరిత్రతోపాటు ఆయన బోధనలను రచించిన బౌద్ధ వాఙ్మయ కవిబ్రహ్మ కీర్తిశేషులు శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య వ్రాసిన 'బుద్ధ పురాణం' చదివినాడు. అందున్న శ్రీ బుద్ధగీతను సంగ్రహించి యీ 'శ్రీ బుద్ధగీత' ను వ్రాసినాడు.

దశావతారములలోని ఒక బుద్ధుడు తప్ప తక్కిన అవతారములన్నీ చరిత్ర కందనివే. బుద్ధుడు ఒకడే చారిత్రక పురుషుడు. బుద్ధుడు ఈ దేశంలో జన్మించినాడు, గౌతముడుగా పెరిగి గయలోని బోధి వృక్షము క్రింద తపస్సుచేసి బుద్ధుడైనాడు. ఆయన బోధించినదే శ్రీ బుద్ధగీత యైనది.

మిత్రుడు ఓబుళ నారాయణరెడ్డి బుద్ధుడు చూపిన ధర్మబాటలో నడచుచూ యెల్లరినీ ఆయన బోధనల పాటించి నడచిననే మనుజులలో న్యాయం, ధర్మం యేర్పడగలదని తెలుపుచున్నాడు. ఈ శ్రీ బుద్ధగీత చూపిన మార్గంలో మరెందరో నడచుట కీ గ్రంథం తోడ్పడాలని ఆయన ఆకాంక్షించినట్లు యెల్లరు గ్రహించుటే చదువరుల కర్తవ్యమని నమ్ము చున్నాను.

అనంతపురం
12_5_95

జి. రామకృష్ణ
జర్నలిస్టు
స్వాతంత్ర్య సమరయోధుడు

From,

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం
తిరుమలగిరి, నల్గొండ జిల్లా.

ప్రియమైన శ్రీయుత టి. ఓబుళ నారాయణరెడ్డి గారికి,

మీరు వ్రాసిన శ్రీ బుద్ధగీత చదివితిని. నేటి యీ అల్లకల్లోల అన్యాయ సమాజ దుస్థితి విముక్తి కెంతైనా సహాయపడుతుందనుటలో సందేహంలేదు. ఐతే చదువరులు శ్రద్ధగా ఆ గ్రంథాన్ని చదివి శ్రీ బుద్ధ దేవుని బోధనలు కొంతకు కొంతైనా యాచరించుటవసరమని వేరుగా తెల్పనవసరంలేదు. అసూయ, ద్వేషం, స్వార్థం వీరవిహారం చేయుచున్న యీ తరుణకాలంలో మీ యీ గ్రంథం పాపపరిహారార్థం సహాయ పడుతుందని నమ్ముచున్నాను. మీ రెంతయో ధన్యులని నమ్ముచున్నాను.

తిరుమలగిరి
3-5-95

ఇట్లు
శ్రీశ్రీ కృష్ణస్వామి యోగీశ్వర్లు

---

మిత్రులు ఓబుళ నారాయణరెడ్డి గారు వ్రాసిన ఈ బుద్ధగీతను చూచితిని. నేటి సమాజమున మానవుని వ్యవహార మెట్లున్నదో మన కందరకును తెలియును. ఇటువంటి సమాజమును చైతన్యవంత మొనర్చుటకు, వికాస భాసురముగ చేయుటకు ఈ గ్రంథముద్వారా వీరుచేసిన కృషి అభినందనీయము.

బుద్ధుడు ఆయన శిష్యులు చేసిన బోధనలను అత్యంత క్లిష్టమైన తాత్విక విషయాలను 26 వర్గములుగా విభజించి (వీరు) తమ ప్రజ్ఞా పాటవాలతో సంగ్రహించి అందరికి అర్థమగునట్లు విశదీకరించినారు. అనేక ఇతర తాత్విక గ్రంథాలలోని విషయాలను, బుద్ధుడు తెలియజేసిన విషయాలను తులనాత్మకముగ పరిశీలించి మనముందు ఉంచినారు.

మానవుడు తన మేధా సంపత్తితో ప్రకృతి శక్తులను వశపరచు కొంటున్నాడు. భౌతికసంపన్నతపై మమకారము పెరిగి ఆత్మసంపన్నతపై తగ్గినది. ఈ పరిస్థితులలో సత్యాన్ని గూర్చి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మనిషి ఆకాశంపై స్వేచ్ఛగా విహరిస్తున్నాడు. సముద్రపు లోలోతుల వరకు వెళ్ళుచున్నాడు. కాని భూమిమీద మాత్రం సరిగా ఉండటం అంటే తోటివారితో, సాటివారితో సరిగా మెలగటం ఇలాంటి ఎన్నో మానసిక వ్యాధులతో అధఃపాతాళానికి వెళ్తున్నాడు. అట్లాంటివారికి ఈ పుస్తకం దివ్యౌషధంలాగా పని చేస్తుందని భావిస్తున్నాను.

పాఠకలోకము ఈ గ్రంథమును చదివి యథార్థము తెలుసుకొన వలెనని విశ్వసించుచున్నాడు.

నీటివనరుల నిపుణుడు, సాగునీటి పథకాలకు నిరంతరం అవిరళకృషి సల్పిన మేధావి, నిస్వార్థ రాజకీయవేత్త, తత్వవేత్త కరువుపీడిత ప్రాంతాలకు ఎనలేనికృషి సల్పిన మహనీయుడు కీ॥ శే॥ చల్లా సుబ్బరాయుడు గారికి ఈ గ్రంథం అంకితమివ్వటం సంతోషం.

మానవ ప్రపంచములోని మానవులంతా పరస్పర సహకారముతో, గౌరవాదరాభిమానములతో వసుధైక కుటుంబముగ విరాజిల్లవలెనను ఆకాంక్షతో వీరు ఈ గ్రంథమును రచించుట వీరి మానవతా దృక్పథ మునకు తార్కాణము. వీరి ఈ పవిత్రాశయమునకు ఈ గ్రంథము తోడ్పడ గలదని నా నమ్మిక.

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి.

సర్వేజనా: సుఖినో భవంతు

కె. శ్రీరామ క్రిష్ణయ్య
ఛైర్మెన్, KGO PDD Board
& అడ్వయిజర్ టు గవర్నమెంటు ఆన్ ఇర్రిగేషన్

## ఓం నమో భగవతే బుద్ధాయ

మిత్రులు శ్రీ టి. ఓబుల నారాయణరెడ్డి గారు ఎంతో ఆప్యాయంగా ఇచ్చిన " శ్రీ బుద్ధగీత " చదివాను. ఇందలి విషయాన్ని బౌద్ధవాఙ్మయబ్రహ్మ శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్య గారి " బుద్ధ పురాణం " నుండి సంగ్రహించినట్లు శ్రీ రెడ్డిగారు తెలిపారు. వీరికి బుద్ధభగవానునిపట్ల శ్రద్ధాభక్తులు బాల్యంలోనే అంకురించాయి. ఇప్పటికి సుమారు ఐదు దశాబ్దాల క్రితమే (1948) " ఎడ్విన్ అర్నాల్డు " కవి ఆంగ్లంలో రచించిన **'The Light of Asia'** అనే బుద్ధ జీవిత కావ్యాన్ని మరికొన్ని బౌద్ధ గ్రంథాలను చదివి బుద్ధుని పట్లా, ఆయన ప్రబోధించిన ధర్మంపట్లా, పరమభక్తిని పెంపొందించు కున్నారు.

"బుద్ధగీత" - అనే ఈ గ్రంథం బుద్ధోపదిష్టమైన "ధమ్మపదం" లోని గాథలను వివరిస్తుంది. ఇందలి వచనాలు పాళీగాథల సారార్థాన్ని గ్రహించి జనరంజకమైన సరళశైలిలో వివరించడానికి గ్రంథకర్త యొక్క చిత్తశుద్ధితోడి ప్రయత్నం ప్రశంసనీయం.

సామాన్య రైతుకుటుంబంలో పుట్టి, రైతుల శ్రేయస్సుకోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్న శ్రీ రెడ్డి గారు బాల్యం నుండి బుద్ధ భగవానునీ, ఆయన "సంబోధి"నీ తనకు మార్గదర్శకంగా గ్రహించి ధర్మపదంలో చరించడం నాకు ముదావహంగా ఉంది. ధర్మజిజ్ఞాస శ్రేయస్కరం అది, క్రమంగా వ్యక్తికి జ్ఞానభూమికలను ఆరోహించ డానికి తగు శ్రద్ధనూ, శక్తినీ, అనుగ్రహిస్తుంది.

బుద్ధ వచనాలను ఉపనిషద్గీతా భారతాదుల్లోని పద్యాలతో శ్లోకాలతో పోల్చి, ధర్మ సమన్వయం సాధించడంలో వీరి విశేషకృషి విశదమౌతున్నది. సరళశైలిలో సర్వజన సుబోధకంగా శాశ్వతమైన బుద్ధధర్మాన్ని వివరించే లక్ష్యంతో రచింపబడిన ఈ " బుద్ధగీత" ను ఆంధ్రజనత ఆదరించి ప్రోత్సహిస్తుందని విశ్వసిస్తున్నాను.

**బుద్ధం శరణం గచ్ఛామి; ధర్మం శరణం గచ్ఛామి. సంఘం శరణం గచ్ఛామి॥**

అనంతపురం — రత్నాకరం బాలరాజు

27-4-95 — M. A; Ph. D.



మత్స్యః కూర్మ వరాహశ్చ నారసింహశ్చ వామనః
రామో రామశ్చ రామశ్చ బౌద్ధః కల్కిరేవచః

# శ్రీ బుద్ధదేవుని జన్మ కారణం

శ్రీ బుద్ధ మహాత్ముని బోధలు భారతీయులకు రెండువేల ఆరు నూర్ల అరవై యేండ్లనుండి ప్రకటింపబడి బోధింపబడియున్నవి. అయితే ఆయన బోధలు తెల్పు మార్గములను స్వార్థపర యాకాలంనాటి బ్రాహ్మణవర్గం తమ అన్యాయ అక్రమ, అశ్లీల మార్గములను కప్పిపుచుకొనుటకై, వారివారి మతములు నశించునని భయపడి శ్రీ బుద్ధ దేవుని బోధనలు మఱుగుపడ జేసిరి. వారి స్వార్థ కపట జీవనముల కాబోధలు వ్యతిరేకించి, వారిని నశింపజేయునన్న భయముతో, ఆ బోధనలను, బోధకులను లేకుండ జేసిరి.

ఆర్యసత్య ధర్మాలనే శ్రీబుద్ధదేవుడు తిరిగి మానవాళికి తెలియ జేసేందుకే జన్మించినాడు వేదాలు వేదాంగాలు తెల్పిన ధర్మాలు రానురాను మానవులలో ముఖ్యంగా భారతదేశంలో యడుగంటి పోయెను. తద్వారా మనుజులు అధర్మ ప్రవర్తనులై హింసాపరులై నీతి న్యాయ ధర్మాలులేని సమాజ మేర్పడెను. అన్యాయ ప్రవర్తనులదే శాసనమై నీతి, న్యాయ సత్యధర్మాలతో యున్న జనావళికి మిక్కిలి బాధలతో దుఃఖములే యెదురయ్యెను. స్త్రీల మాన మర్యాదలు యంతమై జార చోర, రోగ భయజీవన సంఘమేర్పడి యుండెను.

ఆర్యమతము పోయి, బ్రహ్మజ్ఞానము నశించి దోపిడీ, దురహంకార దుర్మార్గ, అన్యాయ విధానాల తమ కుటిల జ్ఞానముతో శైవ, వైష్ణవ, మొదలు గాగల బ్రాహ్మణ తెగలేర్పడి మిగత ప్రజలను తక్కువ వారని వారే అందరికన్న మించినవారమని పలువిధాల దుశ్చర్యలతో మిగతా వారిని పీడించిరి. దోచు కొనుచుండిరి. పలుమతాల పెద్దలను వారే గాక పలుకులాలు, జాతుల నేర్పఱిచి ఒకరినొకరు దోచుకొనుచుండిరి. ఒకరిని మరొకరు హింసించుచుండిరి. యజ్ఞ యాగాది క్రతువులను బ్రాహ్మణులు చేయుచూ జంతువుల బలిచేయుచూ మధు మాంసాల యారగించుచూ దేవతల కర్పించెదమని పలుహింసా ప్రవర్తనులైరి.

---

(నాచే రచింపబడిన శాంతిచక్రవర్తియను కావ్యమును చదివిన శ్రీ దేవుని చరిత్ర పూర్ణంగా తెలియును.)

అట్టి రాజరిక పాలకు లేప్పడి ప్రజలను దోచుచుండిరి. మతపెద్దలమని బోధకులమని పలువిధాల దోపిడీలు చేయుచు మరియు పాలకులు దుర్మార్గాలు చేయుచుండిరి. ప్రజలలో అశాంతి యరాజికాలు యన్ని ప్రాంతాలందు యేర్పడెను. సాధుజీవనం కరవయ్యేను. సజ్జనుల బ్రతుకులు సమసిపోయెను. స్త్రీల గోడు వినువారు కరవైయ్యను.

అంతెందుకు జన జీవన మంతయు అల్లకల్లోల, అరాజకము లయ్యేను. కరవు కాటకాలు వ్యాపించెను. బలవంతులదే కాలమయ్యేను. అనగా దౌర్జన్య దుర్మార్గులదే చెల్లుబాటు కాలమయ్యేను. అన్యాయ, అక్రమ దుర్మార్గులదే రాజ్యమయ్యేను. అగ్నిలో యాజ్యం పోసినట్లు ఒక రాజు మరో రాజ్యములో దోచుకొనుట సహజ మయ్యేను. రాజులలో యుద్ధాలు ప్రబలెను. ఎవరికి ఏది యిష్టమైనదాని ననుభవించ సిగ్గుయొగ్గులు లేకుండెను.

జీవనమే యనేకబంధనల బంధనములయ్యేను. ఏమిటీ కాల ప్రభావమని దీనికంత్యము లేదాయని పలుసుజనులు దీనులై కన్నీరు మున్నీరుగా నరనారీ మణులు రోదించుచూ నింగివైపు యెలుగెత్తి వేడిరి. దేవుడున్నాడందురు! ఉన్నాడా! ఉంటే తండ్రీ మా ఈ యాతనల నుండి మమ్ము కాపాడుము దేవా! నీవేదిక్కు! నీవే శరణు దేవా రావా! వేగమే వచ్చి మమ్ము కాపాడుమని వేడిరి. ఆ యేడ్పుల అగ్నిగాడ్పులు దేవలోకం వ్యాపించ దేవతలు దేవదేవుని వేగమేచేరి భూమండల దీనారావాల గూర్చి విన్నవించిరి. కరుణామయుడైన సృష్టిస్థితి లయకర్తయా దేవదేవుడే భూలోకంలో అవతరించెద ననియు శాక్య వంశములో జన్మించి యీ భూమండలంలో దుష్టశిక్షణకై శిష్టరక్షణకై యవతరించెదనని యట్లు శ్రీ బుద్ధ దేవుడై యవతరించెను.

# శ్రీ బుద్ధగీత - ప్రారంభము

## ప్రథమ చరణాలు

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

నవయువకుడగు శ్రమణుడు (భిక్షువు) శ్రీ బుద్ధ దేవునిచేరి యొక ఉదయాన యిట్లు ప్రశ్నించెను.

ఓ గురుదేవా! మానస మననేమి? సుఖదుఃఖములు ఏర్పడుటకు గడచిన కాలమెట్లు కారణ మగును? కర్మ సిద్ధాంత మెట్టిది? భిక్షు ధర్మమన నేదియో తెలుపుమని చేతులు జోడించి ప్రార్థించెను. అందుకు బుద్ధు డిట్లనియె:

1. కుమారా! ప్రకృతమున్న మన స్థితి, మన మానసిక స్థితిగతులు, మన భావనలు పరిణామ స్వరూపమే. మనమెట్టి ఆలోచనలలో యుందుమో అట్టి చర్యలనే మనము చేయుచున్నాము. బండినిలాగు వృషభముల వెంట బండి దొర్లిపోవుచున్నట్లు చెడ్డ ఆలోచనలచే చెడ్డపనులు, మంచి భావములచే మంచి పనులు చేయుచుందుము. అటులనే సుఖదుఃఖములు వెంటనే వచ్చును.

2. ఇంటి పునాదిమీద ఆధారపడియున్న యింటివలెనే మన ఆలోచనా భావములపై మన చర్యలు ఆధారపడి యుండును. మానవుడు ధర్మయుక్తమైన పనులను చేయుచుండిన సుఖశాంతులు ప్రతిఫలముగా కల్గును.

3. వాడు నను తిట్టినాడు, వీడు నన్నుకొట్టినాడు మరియు వాడు నను దోచినాడు అని మూఢంగా మనసునందు అసూయ ద్వేషముల సంకుచితముగా తలంచిన తన వెంటనే మత్సరము పుట్టి ద్వేషము రగిలి వాని హృదయమందు ఘోరముగా పీడించుట జరుగును. వాడు ఆ ద్వేషాగ్నిలో కాలిపోవును.

4. కాన అట్టి ద్వేషాగ్ని కలుగకుండ సహనంతో ఎవరు ఓర్పుగానుందురో వారు వైరమునకు దూరముగా నుండెదరు.

5. *ఎందులకనగా ఆర్యజన సిద్ధాంతానుసారము ద్వేషము ద్వేషముతో శాంతిని చేకూర్చదు. ద్వేషమును తలంచకుండుటే శాంతి చేకూరును. మరియు ప్రేమచేతనే ద్వేషాగ్ని చల్లారబడును.

*అందుకే ఏసుక్రీస్తు ఈ చెంపకొట్టిన మరో చెంప చూపమన్నాడు.

6. ఏ మానవుడు విషయ వాసనలతోమారు సంసార క్షేత్రమున విహరించునో, ఏ మానవుడు తన ఇంద్రియములపై అధిపత్యము వహించునో, ఎవరు అన్నపానీయము భోగాలను కోరక సంయమనం పాటించి సంసారిగా నుండునో, ఎవరు ఆరోగ్యమను ధనముపై శ్రద్ధతో యుందురో అట్టి ఘనుడు కామోద్రేకాలకు లోనుగాక గంభీర శాశ్వితానందముతో జీవించును.

7. తన్నుతాను విషయ వాసనల పాశాబంధముల నుండి విముక్తికాడో అట్టివాడు కాషాయాంబరధారియైనా కపట సన్యాసి యగును.

8. ఎవరు అశాశ్వితమైన భోగవిలాసముల యందు విరక్తుడై యుండునో, అతడు సకల సద్గుణ సంపన్నుడై యుండును. అట్టివాడు నిరంతరముగా విలాసముల (నభిలషింపక) కోరక యట్టి ఆచరణలో యుండును. అట్టి దానినే ఆత్మ సన్యాస మందురు.

9. సత్యాసత్య పరిజ్ఞాన శూన్యుడైనవాడు కర్మ బంధముల జిక్కి నిరంతరం మూఢుడై వాపోవుచుండును సుమా!

10. శాస్త్రీయముగా అనగా తగురీతిలో ఇంటిని నిర్మించుకున్న వర్షముపడి నీరు కారదో అటులనే వివేకము లేకున్న విషయ వాసనలతో మునిగి యుండును. అయితే సంపూర్ణ వివేక సంపన్నుడగు మానవుని చిత్తమున విషయ వాసనలు ప్రవేశింప జాలవు. అట్లు కానివాడు విషయ కోరికల రోగియై పీడించబడును.

11. దుష్క్రియానురక్తుడైన మానవుడు ఈ లోకమునగాకున్న పరలోకమందైన పశ్చాత్తాపముపడక తప్పదు. అట్లు కానివాడు చెడ్డపనులు చేయుచూ చెడునే అనుభవించుచూ నిరంతరం కష్టపడుచూ దుఃఖభాజనుడు గాకతప్పదు.

12. ఏ భిక్షువు మానవధర్మానుశాసన విశిష్ట సిద్ధాంతములెన్ని కంఠస్థముచేసి పారాయణం చేసినా ధర్మపథ కార్యముల విడనాడి జీవించునో అట్టివాడు కామక్రోధాది షడ్వర్గముచే బంధనంబున జిక్కి శాంతిలేక సుఖములేక దుఃఖముచే క్రుంగి భిక్షువు కాజాలడు.

13. సత్యమునందు సత్యమును, అసత్యమునందు అసత్యమునుచూచువాడు సమర్థుండై ధన్యుడగును. సత్యాసత్య పరిజ్ఞాన శూన్యుడు మూఢుడై కర్మబంధములజిక్కి నిరంతరం వాపోవు చుండును.

14. ఓ భిక్షువులారా చెడు పనులు చేయువాడు ఈ లోకమునందును, పరలోకమందును భ్రష్టుడై ఎల్లప్పుడును విషాదచిత్తుండై అత్యంత కష్టముల ననుభవించును.

## 2. పరిశుద్ధ భక్తి వర్గము (అప్రమాద వర్గము)

ఒక దినమందు శ్రీ బుద్ధదేవుడు ఒక భిక్షువుల గుంపునుచూచి అందున్న సోమరులగాంచి కరుణాంతరంగుడై వారికిట్లు బోధించెను.

1. నాయనలారా, సద్భక్తియే అమరత్వ పదప్రాప్తికి మూలసాధన మగును. మంచి భక్తియుక్తుడగు శ్రేష్ఠ మానవుడు ఈ లోక తత్త్వజ్ఞానము తెలియనిదే త్వరగా మరణించబోడు. సద్భక్తి లేనివాడు ప్రమాదావస్థకు వశుడై మూర్ఖుడై బ్రతికియున్నా మరణించినట్లే యగును. అట్టివాడు జీవుడైనా జీవము లేనివాడుగనే ఎంచనగును.

2. ప్రమాదము లేనిమార్గమున జీవించువాడు అగ్రేసరుడై నిరంతరం సంసారమందుండినా సద్భక్తియందే నిమగ్నుడై యుండును. అట్టి ఉత్తమ పురుషుడే పూర్వపు ఆర్యజన సంపాదిత జ్ఞానము కలిగి సౌఖ్యము పొందును.

3. పై తెల్పబడినట్టి చింతాశీలుడును, సుస్థిరచిత్తుడును మరియు సర్వదా మహత్తర ధీమంతుడై శ్రేష్ఠంబైన నిర్వాణపదవి నొందును.

4. ఎవరు శాశ్వతంగా స్వప్నమందైనా తప్పులు చేయని జాగ్రదవస్థలో యుండునో యుక్తాయుక్త విచక్షణా జ్ఞానానుకూలముగ పరిశుద్ధ కార్యతత్పరుడై యుండునో ధర్మానుకూలంబగు ఋజువర్తనము గల్గి వ్యవహరించునో అట్టి మంచి భక్తుల కీర్తి జగంబు నిండి ఆనందింతురు.

5. అట్టి జాగ్రదావస్థ యందెవరుండి ఇంద్రియ నిగ్రహంతో సంయమనమును పాటించు బుద్ధి వికాసము కల్గియుండుట వలన, అట్టివానిచుట్టు దుఃఖమనెడి వరద ప్రవాహమునయున్న దీవిని చేరియుండునట్లు నిశ్చింతగా వుండును.

6. వివేకశూన్యునికి ఎల్లప్పుడు అశాశ్వతంబగు వానినే చిత్తమాకర్షించును. అట్లు సుందరవస్తు సమూహమునే హృదయంబులో ప్రేమ కల్గియుండును. కాని వివేకవంతుడు అప్రమాదమును గ్రహించి వానిని కోరడు.

7. అశాశ్వతమైన ఆడంబర పదార్థముల గాంచి మనుజుడు ఆశపడకూడదు. అట్టి చింతనాశీలుడును అప్రమత్తుడుగను ఎవరుందురో అట్టివాడు శాశ్వతానందముతో వుండును. ఇద్దానినే సిద్ధియందురు. ఆ సిద్ధివలన సుస్థిరానందమోహలౌకికానందము నుండి భిన్నముగా నుండును.

8. బుద్ధిమంతుడైన వ్యక్తి సద్భక్తివలనను వివేక ప్రభావంబునను స్వకీయ ఆత్మాభిమానమునువీడి శోకరహితుడై జ్ఞానమనెడి మహోన్నత పర్వతశిఖరంబు నెక్కి క్రిందనున్న మూర్ఖులను చూడగలుగును.

9 సచ్చింతనా ప్రభావంబువనే ఇంద్రునకు దేవతలలో సర్వ శ్రేష్ఠ పదవి ప్రాప్తించినది. కాన ప్రమాదావస్థను నిరంతరం దరికి రానివ్వకూడదు. కాన సద్వర్తనమే నిరంతరం మానవోన్నతికి మూలమని గుర్తించి మెలగుట శ్రేయం.

10. ఏ భిక్షువు ప్రమాదములేని అవస్థయందు అపార సౌఖ్యంబనుభవించు చుండునో ఆ స్థితిని భయకంపిత దృష్టితో చూచుచుండునో అట్టివాడు సంపూర్ణంగా శ్రేష్ఠుడనబడును. అట్టివాడు త్వరగా నిర్వాణపథమును సమీపించును.

11. ప్రమత్తులలో అప్రమత్తుడును, నిద్రించువారలో మేల్కాంచియున్నవాడును, పందెమునకై పరుగిడు బలహీనమైన గుఱ్ఱమును మరొకటి వేగంతో దాటిపోవునో అటులనే కడుజాగ్రత్తతోనిర్వాణ మార్గమును చేరును.

## 3. చిత్తవర్గం ( భావ సంయమ వర్గము )

పరమ శాంతచిత్తుడై తదేక నిష్ఠాగరిష్ఠుడైయున్న శ్రీ బుద్ధదేవునిచేరి ఒక గృహస్థుడిట్లు ప్రశ్నించెను. మహాత్మా! చంచలమగు చిత్తమును వశీభూతము గావించుకొను విషయమై ఒక పవిత్ర సదుపదేశము ప్రసాదింపు మనెను.

1. కుమారా! బాణము ఎక్కుబెట్టుటకై శరము సంధింప ఆ బాణమును కావలసినంతగా వంపుగా ఒకడెంత వంచగలుగునో అటులనే ధీమంతులు చంచలము అశాశ్వితమైన భావాభిలాషలనట్లు వశపరచుకొనవలయును.

2 జలాశయము నుండి వియోగము చెంది నేలపైబడిన చేపవలె వ్యాకులంగా (బాధగా) గిలగిల తనకలాడు చందాన కామము నుండి విముక్తి చెంద నిరంతరం ఆ అలోచనాధీరుడై యుండవలెను సుమా!

3. మనస్సును స్వాధీనపరచుకొనుటయే మానవుని విధ్యుక్త ధర్మం. మానసమును స్వతంత్రముగా విడచిన నిరంకుశంగా తన యిష్టము వచ్చినట్లు చరించును. కాన అట్లు వర్తింపక బుద్ధి శక్తికనుకూలంగా నడచినపుడే ఆత్మ తత్త్వము తెలియబడును. చిత్తము చంచలమై అది నిరంతరం కష్టములందు తగుల్కొనును. అట్టి సమయంబులో సాధారణముగా మనస్సు వశము కాదు.

4. మనస్సు నిరంతరం కోర్కెల కనుకూలంగా విహరించు చుండును. మనస్సు ఏకాకిగా మసలుచుండును. దీనికి శరీరముగాని, స్వరూపముగాని లేదు. హృదయంలో అది రహస్యముగా వసించుచుండును. అట్టి మనస్సును వశము చేసకొనుటయే కామానికి లొంగక విముక్తి బడయ వచ్చును.

5, సుస్థిర భావములు కలిగి మనోవ్యాకులతను విడిచి సత్కార్య దుష్కార్య పరిణామముల కొరక సావధానచిత్తుడై నడచు వ్యక్తికి కొంచమైనను భయముండ నేరదు.

6. పంచభూతాత్మకంబగు నీ శరీరము మట్టితో నిర్మితమైన దానివలె క్షణభంగురమై యున్నది. ఈ రహస్యమును తెలిసిన మనుజుడు భేదములేని భావముతో దుర్గమును నిర్మించుకొనును. అంతటితోనే ఆగక ఆ దుర్గమునందు బురుజులపై జ్ఞానమనెడు శతఘ్ని నమర్చుకొని మనోదుర్గ మాత్రమణలేని విధంగా మెలగును. ఆ విధంగా ధూర్తుడైన కాముని దాడిని అడ్డుకొనును. అట్లు కాముని సైనికుల గుండెలదురునట్లు జ్ఞాన శతఘ్నిని పేల్చి వాని దుర్భావములు వ్యాపించక నివారించుకొనును.

7. ద్వేషి ప్రతిద్వేషికి శత్రువు యెదుటి శత్రువునకు చేయు మహాపకారము కంటె చెడు మార్గములో నడచు అభిలాష గలవాడు తన్ను తానధికముగా చెరచుకొనును. అనగా నిరంకుశముగా నడచుకొను చిత్తమే మనుజు నధోగతికి బాల్పడచేయును.

8. సన్మార్గానురక్తయగు చిత్తమువలన మానవ ప్రపంచమునకు లభించునట్టి పరమ శ్రేయము తల్లి దండ్రుల వలనగాని తదితర బంధు మిత్రాదుల వలనగాని శ్రేయస్సు ప్రాప్తించుట కడు దుర్లభం.

9. బ్రహ్మ స్వరూపంబగు కాలమును వృథా పుచ్చుట యెంత అవివేకము! అల్పకాలమునందే యీ మనోహరమగు దేహము జడమగు ఆరిపోవు కాష్ఠము విధముగ భూమిలో పూడ్చబడి నిరుపయోగమగును. అట్లు యీ శరీరము సర్వ జనులకు వదలుబడునదై యున్నది. కాన త్వరగా మంచి భావముల తెలిసికొని ప్రయత్నించుటయే శ్రేయస్కరము.

## 4. పుష్పవర్గము

ఒక వసంతకాలమున బింబిసారుని యుద్యానమున శ్రీ బుద్ధదేవుడు శిష్య బృందముతో విడిది చేసియుండెను. ఆ వుద్యానవనమునందు పలురకాల పూలు గుబాళించుచుండ జ్ఞాన భాస్కరుడైన బుద్ధ దేవుడు యచట చేరిన భిక్షువుల నుద్దేశించి సూర్యోదయ సమయాన సూర్యునికి ప్రణమిల్లి యిట్లు సంబోధించి పలికెను.

1. బిడ్డలారా! లోకత్రయ విజయలక్ష్మిని వరింప గలవాడెవ్వడు? చతురుడును, సచ్ఛీలుండును నగు వ్యక్తి యేవిధముగా సహృదయాకాంక్షిత కుసుమమును లోకత్రయ పుష్పోద్యానవనంబు నుండి వెదకి సంపాదింప శక్తిగలవాడై యున్నాడో అతడే కీర్తివంతుడగును. అట్టి మానవజాతి ప్రియమగు సత్యము నెవడన్వేషింప నేర్చు?

2. మూడు లోకములందును పరోపకారము చేయు మంచి మార్గములో నుండువాడు విజయుడగును. అట్టి మనో వాంఛిత పుష్పమును, పొందబడయు యత్నించుట మిగతా చెడు పుష్పములను వదలుట తెలిసిన వాడే శ్రేష్ఠు డనబడును.

3. ఎవ్వాడు పంచ భౌతికంబగు శరీరము నీటి బుడగవంటిదై క్షణ కాలముండు రీతిగనే యున్నది, అట్టి విజ్ఞాన దృష్టితో చూచి తెలియగలడో, ఏ మానవోత్తముడు కోర్కె మృగము (జింక) వలె యుండనిదే యని గ్రహించ గలుగునో అట్టి కామదేవుని వొత్తిడికి లొంగక సమర్థుడై యెవరుందురో యట్టి వారు యమ దర్శనముకాదు, అనగా వారు నరకము జెందరు.

4. జీవితంలో మంచి తనమునే యెన్నుకొని స్థిరచిత్తుడైయున్న మానవుడు నిద్రావస్థయందు చైతన్యము లేనివాడైయున్న సందర్భాన, వరద పొర్లి పారు కోర్కెలు కూడ వానిని ముంచి వేయజాలవు.

5. ప్రపంచ భోగములందు తేలియాడవలె నను అభిలాషి గలవాడును, విషయ భోగానురక్తుడై యుండు ఉన్మత్తుండును తన హృదయాభిలాషలు తీరకముందె మరణమనే వరదలో పడి మునిగిపోవును సుమా!

6. మందార మకరంద మధువు గ్రోలెడి తుమ్మెదగాని, పక్షిగాని ఆ పుష్పములందలి సోయగము (అందం) మధురము నశించకనే వెదకుచూ పోవునట్లే, సచ్ఛీలుడు, సత్యపథానురక్తుడు మూలమూల గ్రామాలు తిరుగు భిక్షువుగాని ఇతరులకు కష్టము కలుగజేయకుండనే జీవన యాత్రను సాగించును.

7. ఏ వ్యక్తి చెప్పునది యొకటి చేయునది మరొకటిగా నడచుకొనునో అనగా అట్టి కర్తవ్యము లేనివాడుగా నుండునో మంచి ఫలితములు పొందక వాడు మంచి గంధములేని సుందర పుష్పముల వెదకినట్లుండును. అటులనే ఇతరులుగూడ ఆ వ్యక్తిపై వర్తించెదరు.

8. అత్యంత పరిశుద్ధ మనసుతో మాటలాడి అట్లు నడచుకొనువాడు సువాసనల గులాబింపు పుష్పమువలె విరాజిల్లును.

9 మంచి వాసనల పుష్పములను వెదకుకొను మానవుని వలెనే మంచి సార్థక జీవన విధానములనే నొకడు ఎన్నుకొన గలడు.

10. పుష్పసుగంధ పరిమళాలై వీచు గాలికి వ్యతిరేక దిశకు ప్రాకదు. కాని సచ్ఛీల కీర్తి జీవిత సౌరభాలు (కీర్తిప్రతిష్టలు) నలుదిశలకు ఏ గాలికైనా అన్ని దిశలకూ వ్యాపించును సుమా!

11. చందన కర్పూరాది సుగంధ పరిమళాలుకన్న సత్పురుషుని మంచి తనము, కీర్తులు వేయింతలు ఎక్కువగా వ్యాపించును.

12. పుష్పాది పరిమళముకన్న సజ్జన పురుషుని సత్కీర్తి స్థాన భేదము దిశల భేదము లేనివిధంగా సర్వత్రా వ్యాపించును.

13. సదాచార సంపన్నుడు, విచార శీలుండును జ్ఞానాధారమైన బంధ విముక్తి పొంద గలడు. అట్టివానిపై మన్మధుడు లేక మరేదుష్టశక్తి ఎంత గొప్ప దైనా వాని చేరజూచి పారిపోవును.

14. ఎంతటి ఘోరాతిఘోర నీచుల దుర్గంధ పాలిత ప్రాంతమైనా నిజ శీల వర్తనుని సౌరభ కాంతులు చుట్టును విరజిమ్ముచునే యుండును. ఆ సౌరభశీలము మాసిపోదు సుమా! అతత సత్య ధర్మజ్ఞాన మా భిక్షువునిగాని, మరెవరినిగాని తాకజాలడు. అతడు సర్వదా ప్రకాశించు చుండును.

## 5 బాలకవర్గము (మూఢవర్గము)

శ్రీ బుద్ధ భగవానుని ముఖ్యశిష్యుడైన ఆనందుడు ఒకనాడు యిట్లు ప్రశ్నించెను. 'మహాత్మా మూఢులన నెవరు? తెల్పినది చేయకున్న వారిని మూఢులని సామాన్యంగా జనావళి అంటున్నది అది ఎట్లు స్వామీ' అనెను.

1. బిడ్డా! రాత్రి జాగరణ చేయువానికి నిమిష కాలమైనా లెక్కించుకొను చుండును. అట్టివానికా రాత్రి గడపుటయే గగన మగును. కఠిన శ్రమ చేసిన వానికి ముందుకు అడుగు వేయుటకే నిద్రచే సాధ్యపడదు గదా! అటులనే ధర్మతత్త్వజ్ఞాన శూన్యునికి జీవితం ప్రతిదినము ఒక యుగముగా గడచును.

2. మూర్ఖులతోడ మైత్రిగాని ప్రయాణముగాని ప్రమాదములకు మూల మగును సుమా! మూఢజన సాంగత్యము కోరుట కంటె మంచివారి సాంగత్యమే శ్రేయస్కరము.

3. వీరు నావారు ఇది నా ధనము, ధాన్యము, సంపత్తియని మూర్ఖ మానవులు (స్వార్థపరులు) తలంచు చుందురు. నాది యీ శరీరమని అభిమానము కల్గియుండు మానవుడు మహామూఢుడే! వాస్తవ మాలోచించిన దేహముపై మానవుని కెంతమాత్రము అధికారము లేదు. అట్టి స్థితియందు పుత్ర, మిత్ర, కళత్ర బంధువర్గమును ధనధాన్య యైశ్వర్యము లెట్లు మానవునికి సంబంధించును? శరీరమే బూటకమైనపుడు సంసారమందలి సర్వము భ్రమయే కదా! ప్రాపంచకులు సత్యమని నమ్మినదే అసత్యము సుమీ! అట్లు నమ్మువారే మూఢులు!

4. మూఢ మానవుడు తన అవివేకమును గ్రహింప గల్గుచో అది ఒక విధమున మంచిదే. మూఢుడైవుండి తన్నుతానే వివేకవంతుడనని భావించుకొను మూర్ఖుడే నిశ్చయముగా భ్రష్టుడు. మొదటి మూర్ఖునికన్న ఆ రెండవవాడే నిజ మూర్ఖు డనబడును.

5. షడ్రసోపేతమైన శాకపాకము లందు ఎన్నిదినము లందు గరిటె యుండినా అది రసస్వాదన (రుచి చూడనట్లు) ఎట్లు చేయజాలదో అదే విధముగ అవివేకి (మూఢుడు) జీవితపర్యంతం తాను వివేకులతో కలిసిమెలిసి యుండినా ధర్మతత్త్వము పొందజాలడు.

6. అల్ప వివేకముగల మానవుడు తనకుతానే బద్ధశత్రువుగా వుండును. కారణమేమన అట్టివాడెల్లప్పుడు చెడుపనులనే చేయుచుండును.

7. దుఃఖము కలిగించు ధర్మమే యవస్థయందును ఎల్లప్పుడును శ్రేయంబుగా వుండ వీలగునని తలంచ వీలులేదు సుమా! తాత్పర్య మేమనగా పరిణామప్రాప్తి కాలమున కన్నీటి ధారల ప్రవహింపజేయు ధర్మము అతినీచము సుమీ!

8. కార్యానంతరము అనగా పరిణామ కాలమున పశ్చాత్తాపము కలుగ జేయక పరమహర్షము కల్గుటయే నీచము. పశ్చాత్తాపము కలిగిననే ధర్మాచరణమునకు మానవుడు ఉన్నతచిత్తుండగును. అట్టి ధర్మము దుఃఖకన్నీళ్ళకు మారుగా ఆనందబాష్పధార లొలికించును.

9. దుష్కార్యమువలన దుష్పరిణామము కలుగువరకు ఆనందించుచూ వాడు చెడుకార్యములనే చేయుచుండును. కాని చెడుకర్మకు ఫలితంగా చెడు ఫలితం కలుగగనే మూఢుడు నెత్తిని బాదుకొనుచూ కడు దుఃఖించును సుమా!

10. మూఢు డెవడైనా మహాత్యాగవంతునివలె అల్పమయ భోజనమునే స్వీకరించి జీవించుచుండును.

11. అప్పుడే పితికినపాలు అపరిశుభ్రము గాకుండునట్లే అపుడే ఆ పాలు పెరుగుగా ఎట్లు మారకుండునో అదే విధముగనే చెడు కార్యములు చేసినపుడే చెడు ఫలితములివ్వజాలవు. కాని ఆ చెడుప్రభావము అతనిని వెంటాడుచునే యుండుట వాస్తవం.

12, వివేక శూన్యుడు నిరంతరం అధర్మముగనే కీర్తిని పొందగోరుచుండును. అందరిపై అధినాథుడు (అందరికి మిన్నయైన) కావలయునన్న తృష్ణ (కోరిక) పీడించు చుండును. అట్టి మూఢవ్యక్తి కెపుడునూ పరజనాకర్షణకై అఱ్రులు చాచుచుండును. చివరకు అనగా అందని పండ్లకర్రులు చాచినట్లగును.

13. ఒక మార్గము కామినీ కాంచనాదుల వైపునకు, వేరొక మార్గము పవిత్ర నిర్వాణ మార్గము వైపునకు గొనిపోవును. బుద్ధుడగువాడు ఈ మర్మం గుర్తెఱిగినవాడై అతడు కల్పిత ప్రతిష్ఠకై కృషి చేయక కేవలం సత్వర సంసార సాగరము దాటుటకై నిరంతరం కృషిచేయ నుద్యుక్తుండగుచుండును.

## 6. పండిత వర్గము

ఒకదినము ప్రబోధమును విన నొక విప్రశ్రేష్ఠుడు శ్రీబుద్ధదేవుని సమీపించి పండితుల గూర్చియు, సంపన్న శ్రేష్ఠుల గురించి తెలుపుము మాకు ఓ పాప భంజకా అని మ్రొక్కి వేడుకొనెను.

1. కుమారా! సత్యధర్మముయొక్క భండారము యథార్థమగు స్వరూపము, ప్రత్యక్ష మొనరింప శక్తుండగు నొకానొక వివేక సంపన్నుండగు, పండితునితో పరిచయము నీకు తటస్థించిన, నీవేమి సేయవలయునో తెలియునా?

త్యాగనీయములగు విషయముల నిషేధింప వలసినదిగా నీకతడు బోధించిన గాని లేక నిన్ను ధిక్కరించిన గాని క్రోధాంధుడవుగాక వాని ననుసరించి పోవుటయే శ్రేయస్కరము. ఎప్పటికైనా యట్టి వివేకవంతుని యనుసరించుటచే నీకు భావాతీతమగు మంచియే సంప్రాప్తమగును కాని స్వప్నమందైనా నీతికి భిన్నముగా హాని జరుగదు. అట్టి వివేక సంపన్నునికి సేవా శుశ్రూషలు చేయుటయే నీ విద్యుక్త ధర్మము సుమీ!

2. నీయందు వేరు నాటిన దుర్భావములను విని యా పండితుడు తెల్పినట్లు అత్యంత శాంతభావముతో శ్రద్ధగా వినుము. సత్పురుషుడైన ప్రతి మనుజుడు వివేకవంతుని సాంగత్యమున లాభమును గ్రహించి నతనిని పూజింపుము. కాని దుర్జనుడా మర్మము తెలియక పండితుని తిట్టుచూపోయిన మంచికి నతడు దూరమై భ్రష్టుడగును.

3. దుష్టుని (చరిత్ర భ్రష్టుని) తోడి సాంగత్యము దుఃఖకారణమగును. పొరబాటునగాని నీచ ప్రకృతిగల మానవ స్నేహం చేయరాదు సుమా! అభివృద్ధికి సజ్జన సాంగత్యమే పరమావశ్యకం. మానవు డెల్లవేళల సర్వోత్తమాచరణముగల పండితునే సహృదయముతో చేరవలయును. అశాశ్వత సౌఖ్యముల కొఱకై దుష్టసాంగత్యముగల వారికి దూరముగా తొలగిపొమ్ము.

4. జ్ఞాన సాగరమున నీదులాడు వ్యక్తియే స్థిర సంకల్ప చిత్తుడై సుఖంబుగ జీవితం సాగింప గలడు. ఆర్యజనులు తెల్పిన ధర్మోపదేశానుకూల మంచి మార్గ స్వీకారమే మానవున కమితానందము చేకూర్చును.

5. కాలువ త్రవ్వు వాడెటుల యిష్టమొచ్చిన రీతిగా నీటిని యుపయోగించ కల్గుచున్నాడో బాణమును నిర్మించుట కెట్లు యున్న రీతిలో కొయ్యనువంపుగా చేయుచు వడ్రంగి వలె కోరిన ఆకారంలో తయారు యెట్లు చేయుచున్నాడో అదే విధముగనే బుద్ధి శీలి తను కోరిన మంచి జీవనా విధానాన్ని నిర్మించ కలుగు శక్తితో యుండగలడు.

6. ఎత్తైనకొండ శాశ్వితంగా యెంత పెద్ద హోరుగాలి నైనా భరించ గలదు. అదే విధముగా ధీమంతుడు తన ధీర హృదయాన్ని మూఢజన నిందా రోపణలు పీడించజాలవు. పండితునకు లౌకిక దూషణ భూషణములతో నిమిత్తం లేదు.

7. విషయ భోగ తృష్ణ్యభిలాషచే పరిస్థితులెట్లు పరివర్తనము చెందినను పండితుడు సత్పురుషుడు స్వకార్య నిర్వహణార్థము యనుదినము నూత నోత్సాహముతో ముందంజయే వేయుచుండును. వితండవాద వివాదము సేయ నభిలషింపడు, సుఖ దుఃఖములకు, వ్యక్తిత్వ గర్వవిషాదములకు, పండితు డగు వాడు తావివ్వడు. సుఖ దుఃఖముల రెంటిని జనన మరణాలను సహజ ముగ ప్రాణికోటికి చేకూరు సౌభాగ్యములనియే నతడు తలంచును.

8. ప్రాపంచిక యున్నతమునకై అధర్మాచరణచేసి స్త్రీని మరియు ధనార్జన చేసి సంతానము బడయ యిచ్ఛలేని వ్యక్తియే మహాపండితుడు. అతడే సాధువు. లేక ధర్మాత్ముడు.

9. సంసారసాగరంబునయుండి పరిశుద్ధ సంపూర్ణ జ్ఞాన పదవి నలంకరించిన సత్పురుషుల సంఖ్య యీ భువిపైయుండుట బహుతక్కువ. ప్రపంచములో పెక్కుమంది యీ సంసార పారావారమునుండి తరింప శక్తిలేని వారేసుమా!

10. ధర్మ రహస్యమును గ్రహించి తదనుకూలంబుగ నడచు వ్యక్తి కాల మనే దుర్గమునుండి దాటి విశాల ధర్మ సామ్రాజ్యము సహితము దాటిపోగల సమర్థుండగుట వాస్తవము.

11. వివేక సంపన్నుండగు వ్యక్తి గృహస్థాశ్రమము నుండి బంధుమిత్ర, పుత్రకళత్రాది వ్యామోహ బంధనము నుండి విముక్తుడైన పిదప ధర్మానుష్ఠాన రాగ పరిపూర్ణ హృదయు డగుటకు మంచిది. అంతటితో తృప్తి జెందక నిర్జన ప్రదేశమందున గూరుచుండి మంచిభావముల పరిపూర్ణానుభవ అనందములతో

నుండవలయును. నాది, నా సంపత్తియను యహంకారాది భ్రమల విడనాడి త్రికరణ శుద్ధిగా సమస్త విధ మానసిక పరితాపాదుల విడనాడి భువిపై జీవించుట పండిత పుంగవుని ధర్మము. అదియే సాధువుయొక్క మంచి ధర్మము.

## 7. అర్హత వర్గము పూజ్య వర్గము

శ్రీ బుద్ధదేవుడు నొకనాడు గ్రామాలు, తిరుగుచూ, బోధ చేయుచూ సాయం సమయాన నొక గ్రామము చేరెను. బుద్ధచంద్రు డొచ్చినాడన్న వార్త యా గ్రామ మందంతట వేగిరమే వ్యాపించ అబాల గోపాలము ఆయన చెంత చేరిరి. విరామములేని సంచార ప్రబోధములో యుండ అచటికి చేరి నలసటగా యుండియు శ్రమ యనక ముఖారవిందమును కాలుసేతుల నీటితో కడుగుకొని వచ్చినవారికి ప్రబోధించ నిట్లు ప్రారంభించెను.

1. ఎవరీ లోకయాత్రను పరిపూర్ణము గావించి మించెనో, యెవరు భయ విషాదముల, సంపూర్ణముగ విడనాడియున్నాడో, యెవరు సమస్త యింద్రియంబుల యోర్పుగా వశమునందుంచుకుండునో, ఏ మానవుడు సంసార సర్వబంధముల త్రెంచుకొని, స్వేచ్ఛాను సారముగా యున్నాడో నట్టి పురుషోత్తమునకు స్వప్న మందైనా హాని వాటిల్లుట కల్ల,

2. ధనం సంపాదించ నభిలషింపక పరోపకార పారీణులొసగు సాధారణా హారమునే స్వీకరించి తన జీవితమును సాగించు నుత్తమ పురుషుడాత్మను వశము చేసికొని నిర్వాణమును యనతి కాలమందే బడయును,

3. సద్గుణ గణ విరాజితుండగు కర్తవ్య పరాయణోత్తమ వ్యక్తి భూదేవి చందమున సమానంబగు సహన శీలతను గల్గియుండి బురదలేని తటాకము వలె నిర్మలముగను, శాంతముగను నుండునట్టివాడు పునర్జన్మకై నిరీక్షించ వలసిన యావశ్యకతయే వాటిల్లదు. ఆ వుత్తముడు పునర్జన్మ బంధనంనుండి విముక్తుడై భువియందే ముక్తిపదవి లభించును.

4. అట్టివాని వచనములు, కర్మలు క్షోభా రహితంబులై అనగా శాంత మయం బగుట జేసి యవ్వాని భావములు సహితము పరిశుద్ధములై సుస్థి రత్వమును దహించివేయును. అట్టి శాంత చిత్తుడు సత్యజ్ఞానముతో యకుంఠిత ధారాప్రవాహంబుగ నున్న మాయా సంసార బంధనముల నెల్ల ఖండించివేసి మౌని యను పవిత్ర పదవిని ధరించి ప్రకాశించును.

5. గ్రుడ్డిగా విశ్వాసము లేనివాడు, అస్పష్ట మరియు తెలియరానిదగు మోక్షము తెలియు సామర్థ్యము గలవాడును, సమస్తబంధన విముక్తుండును, సర్వకామ దూరుండును, నగువ్యక్తి సృష్టిలోని ఉన్నత ప్రాణికోటియందు సర్వోత్తముడుగ పరిగణింపబడుట జరుగును. అట్టివానిచేతనే సృష్టి ప్రకాశింప బడుచుండును.

6. పైన జెప్పబడిన పురుషుడు పర్ణశాలయందు నివసించినను, భయంకర పర్వతారణ్య, సాగరముల తీరములందు నివసించినను యెట్టి జనశూన్య ప్రదేశంబున నివసించినను నిత్యమచ్చోట బ్రహ్మానంద మయుడై యనుభ వించుచు జీవించును. ఆ ప్రదేశమెల్లెడల బ్రహ్మానందమునకది స్థానమై విలసిల్లును.

7. విషయ వాసనలను యగ్నిని నశింపజేసి కున్నట్టియు, విషయ భోగాభిలాష లేకుండ జీవించునట్టియు, సంపూర్ణ స్వేచ్ఛతోగాని పరతంత్రుడై గాని యుండక నుండు నుత్తమ పురుషుని వ్యాపారము (పని) గాలిలో యెగురు చున్న పక్షులవలె నుండి యూహింప నలవికాదు.

8. మదించిన గుఱ్ఱమును మచ్చిక జేసుకొను రీతిగా నిలకడ స్థితిలేని యింద్రియములను (స్థిరంబుగ)నుండునట్లును, అభిమాన శూన్యతయందే ఆత్మా నందము బడయునట్టియు, విషయ వాసనా బీజముల హృదయ భూమినుండి పూర్ణముగా నాశనము (లేకుండా) చేసికొను శక్తిగల నుత్తమ పురుషుడు మహో న్నత పదవిని చూచి దేవతలుకూడ ఆశ్చర్య పడెదరు. కాని తమ శక్తిని మించిన లోకాతీతంబగు సామర్థ్యమును గల్గియుండుటజేసి యతనికి సాటి దేవతలుకూడ కాజాలరు.

9. సంసారిక వ్యక్తికి అనగా విషయ భోగానురక్తునకు స్వప్నమందైన, మచ్చునకైన హర్షము (సంతోషం) లభింపని భయంకర పర్వతారణ్యముల యందే నిర్వికార పురుషునికి లోకాతీత యానందము కలుగుచుండును. కాని యాతనికి అలౌకిక సుఖాన్వేషణపైకూడ యాసక్తి కలుగబోదు. అట్టివానికి బండయే బంగారమగును.

## 8. సహస్ర వర్గము

రాజగృహ నగరంబున దయాసాగరుండును, అంధకారము పటాపంచలు చేయు సూర్యునివోలె శ్రీ బుద్ధ దేవుడుండ దూరదూర ప్రాంతాలనుండి పలు రకాల జనులు అనగా దుష్టులు, మంచివారు, దొంగలు, వ్యభిచారులు(జారులు) మహాగుంపులు గుంపులుగావచ్చి తథాగతుని యుపదేశసుధలు త్రాగ చేరియున్న వారిని చూచి యిట్లు బోధించెను.

1. నాయనలారా! ఉపదేశమనునది నూర్ల వేల మాటలతో మధురాతి మధుర పదజాలముతో యున్నను, గంభీరోపన్యాసముగా యుండినను, నిరుప యోగ పదములతో కూడియున్న దానికేమాత్రం విలువ నివ్వరాదు సుమీ! సార్థక భావ పరిపూర్ణమైన భావ మొక్కటి యుండినను చాలును. మానవుని అశాశ్వతంబగు జన్మ తరించ అనవసర వేయి పదములకన్న సార్థకంబగు నొక్క పదమే చాలును.

2. ఒక కథగాని నొక కవితగాని అర్థములేని పదములు వేయి వున్నను నిరుపయోగమగును. చంచల చిత్తమును శాంతింపజేయు శక్తిగల జ్ఞానముగల మాట యొకటి విన్నను చాలును. ధీశక్తికి నూతన వికాసము నివ్వజాలని వేయి కవితలైనా యుపయోగముండదు. నీతిమయ పద మొక్కటియే శాంతింప చేయగలదు.

3. వేయి సంవత్సరములు జ్ఞాన శూన్యుడై, ధర్మహీనుడై, నీతిలేనివాడుగా జీవించుటకన్న, ధర్మాత్ముడై స్థితప్రజ్ఞుడై అచంచలుడై యొక్కదినం జీవించుటే యుత్తమం సుమా!

4. నూర్లకొలది యుద్ధములుజేసి, నూర్లకొలది యోధుల జయించిన వీరయోధు డనిపించుకున్న వానికన్న చంచల ప్రవృత్తులతో అధోగతిపాల్జేయు తనలోయున్న యింద్రియ ప్రవృత్తులను జయించు ఓర్పుగల శక్తిగలవాడే వీరాధి వీరుడగును సుమా!

5. అజ్ఞానమందున్న సోదర మానవుల జయించుటకన్న తన్నుతాను జయించుటయే యుత్తమం. మానవుని భ్రష్టుని గావించునట్టి తనలోయున్న శత్రువులను జయించుటే నిజధర్మమగును.

6. మందబుద్ధిగలవాడై, నిర్బలుడై నూరేండ్లు జీవించుటకన్న ప్రమాదము లేని ఆరోగ్యసంపన్నుడై వీరపటుత్వంతో జీవించు వ్యక్తి యొకదినం జీవించినా చాలు. అదియే పరమానంద పదము.

7. జీవితాంతం, వివేకశూన్యుడై జననమరణ దుఃఖకారణంబుల నుండి విముక్తి (స్వేచ్ఛ) పొందు వివేచనా రహితుడై చాలా కాలము జీవించుటకన్న జననమరణాది సమస్యల గురించి తెలిసి ఒక్కదినము బ్రతికినా చాలును సుమీ! చివరకు ఒక ఘడియ బ్రతికినా చాలునని తెలియుము.

8. నిర్వాణపథ మార్గము తెలిసిన మనుజుడు ఒక నూరు సంవత్సరములు జీవించు వివేకశూన్యునికన్న మిన్నయే సుమా! ఎన్ని రాజ్య ధనాగారాలు వశమైయున్నా పై మొదటి ఉత్తమునికి సాటిరాడు.

9. బౌద్ధధర్మము స్వీకరించక వేయి సంవత్సరాలు జీవించినా నిరర్థకంబే యగును. చివరకు మరణకాలమ్మందైనా బౌద్ధధర్మము స్వీకరించినా (విశ్వసించి ఆచరించిన) ఉత్తమమే.

## 9. పాప వర్గము

శ్రీ బుద్ధ దేవుడు బౌద్ధధర్మము ప్రచారము సేయ నారంభించు నప్పటికి ఆ దేవుని ప్రియ ఏకైక కుమారుడు చిరంజీవి రాహులుని వయసు కేవలం పండ్రెండు వత్సరములు మాత్రమే. సామాన్య బుద్ధిచే ఆ బాలుడు చేయు దుశ్చేష్టలను జూచి మహాత్ము డిట్లుపదేశించెను.

1. కుమారా! మనుజునకు మంచిని చేయవలయు ననెడి గాఢాభిలాషయేయున్న మొట్టమొదటి జ్ఞానమెట్టు అనదగును. దుష్టభావములన్ను మనసు నుండి పారద్రోల వలయును. శుభకార్యములను ఉత్సాహముగా చేయుచుండవలయును. అయితే సహజముగా చెడుపనులు చేయుటకే ఉత్సాహము కల్గుచుండును. అది తెలిసికొని త్రికరణశుద్ధిగా మంచి పనులు చేయుటకే సిద్ధమైయుండుటే క్షేమం సుమీ!

2. మానవుడు ఒకసారి పాపకార్యము చేసియున్నచో అంతమాత్రము చేతనే నిరంతరం పాపముచేయుటే మంచిదని తలంచ రాదు. దుఃఖము చేడు

కర్మల ఫలమేయని గ్రహించి చెడుపనులను చేయుట మానుటకు తీవ్ర ప్రయత్నం చేయుటే కర్తవ్యం.

3. పాపాత్ముడు తాను గావించిన పాప కార్యములకు చెడు ఫలితములిచ్చుదాక యందే చేయుచుండి అందే మునిగి ఆనందించు చుండును. అయితే తాను చేసిన చెడు పనులకు చెడ్డ ఫలములు వచ్చు సమయాన పాపాత్ముడు స్వయం కృతాపరాధముల దుష్ఫలితముల గ్రహించి భయదుఃఖితు డగును.

4. సాధువు తా నాచరించు మంచి పనులు ఫలించి శుభ పరిణామ ఫలంబులు వచ్చు వరకు యోపికతోవచ్చు కష్ట పరంపర సహింప సంసిద్ధుడై యుండును. ఫలించుదాక కష్టములను అనుభవించు చుండినను తర్వాత శుభంబు కలిగి సాధువునకు లోకాతీతసౌఖ్యము కల్గును.

5. హాస్యానికైనా చెడుకార్య మొకటిగాని చేయరాదు. చెడుమాటలుగాని మాట్లాడరాదు సుమా! ఒక్కొక్క బిందువే కడవలో పడిన నీరు నిండునట్లు ఇది ఒకటేగదాచేసినది మరియు ఇదొక్కటేకదా చెప్పినది అని కాలగమనము చేయురాదు సుమా! అదే దుర్భావ పాపచింతనకు కారణమై అతని జీవితము చివరకు చెడుపరిణామముజెంది దుఃఖహేతువగును.

6. మూర్ఖుని సాంగత్యము వలన కొంచమైనా లాభ ముండకపోతుందా అని భ్రమ పడకుము. అతని దుశ్చింతను కొంచమైన దానినైనా ఖండించు చుండుము. బిందువు, బిందువు మంచి చల్లని నీరుతోనే పాత్ర నిండునట్లే గతించినకొలది దుష్టుని కార్యములు మంచివిగా మారవచ్చును.

7. విశేష ధనముతో నొక వర్తకుడు యేకాకిగా ఘోరారణ్య మార్గమున రాచబాటనందు యెట్లు భయపడక ప్రయాణించునో, ఏరీతి మరణ మార్గము వినినంతనె భయకంపితుడై రక్షించుకొనుట కెట్లు తహతహ లాడునో అటులనే నిజాభ్యుదయమునకై పాపకార్యాచరణను మాని స్వ త ఆత్మకు వచ్చు యుపద్రవమును గుర్తించి దూరమగుట శ్రేయస్కరము.

8. నిర్దోషిని సదాచార సాధువును నిష్కారణంగా బాధించిన మనుజుడు ఘోర యన్యాయ ఫలంబతనికి కల్గి హింసింపబడుట సత్యము. ఎదురు గాలికి ధూళిరేపిన తిరిగి యా ధూళి తన కనుల వైపునకే వచ్చిపడి బాధించునట్లు జరుగును!

9. మానవులు కొందరు జనన మరణ దుఃఖములకు బాధపడుచుందురు. పాపులు నరక మనుభవించుట నిశ్చయము. ధర్మాత్ములు స్వర్గపదవి నొందెదరు. సంసార విషయ వాసనలు లేనివారు నిర్వాణము బడయుట నిస్సంశయముగా యదార్థము.

10. భూమ్యాకాశ, సాగర పర్వతారణ్యముల యందెచట దాగియున్నను చావుముఖంబున పడక తప్పదు. పుట్టిన దాదిగా సహజముగా మరణమున్నదని తెలిసి, యెల్లపుడును తెలిసి యెదురు చూచుచుండుట శ్రేయస్కరము.

## 10. దండన వర్గము

భిక్షువుల ఆరామము (నివాసముండు యిల్లు) నకు యొకనాడు యొక రాజకీయ యుద్యోగి యున్నత ఠీవితో వచ్చెను. అపుడా భిక్షువు లాతని సాదరంబుగా పిలిచి ప్రేమతో ఆహ్వానించిరి. అతడచటికి బోధలు వినుటకు వచ్చినవారిలో కొందరు గొప్పవారిని చూడ మరియు మాటలాడ కోరెను. ఆ వున్నతోద్యోగికి యా భిక్షువులు అహింసా విధానమును గూర్చి వివరించిరి. ఆ రాజకీయ యుద్యోగి యందుకు సంతోషించెను. అతడు దండనా విధాన మెట్లని ప్రశ్నించెను. అందుకు వారు దానిని వివరించుటకు మాకు శక్తియున్నది. కాని శ్రీ బుద్ధదేవుడే యిటనుండ మేము తెల్పుట యుక్తము కాదనియు యా మహాత్మునే యడిగి తన సంధేహములు తీర్చుకొను మనిరి.

ఆ భిక్షువు లాతని తోడ్కొని దేవునికడకు పోయి సమీపించిరి. అప్పుడు అతడు ప్రణమిల్లి తన సందేహములను తెల్పెను. అపుడా దేవుడిట్లు తెల్పెను.

1. మరణ మన్నంతనే మానవుడు మదిలో క్షోభపడి బిత్తరపోయి భయభ్రాంతు డగునట్లే దండనమన్న ప్రతివానికి భయము కలుగుచున్నది కదా! స్వప్రాణమన్న యెల్లరికి మధురమే (తీపు). మనుజుడెట్లు స్వప్రాణమును సంరక్షించుకొన సర్వదా ఆకాంక్షించునో యట్లే అన్నిప్రాణులు కోరుచునేయుండును.

హింసించు నరుడు హింసింపబడును సుమా! పదిరెట్లు యెక్కువే నతడు హింసింపబడును. హింసించుట మానవ ధర్మమునకు విరుద్ధమైన రాక్షసచర్య యగును సుమీ!

2. ఎల్ల ప్రాణులు తన ప్రాణముతో సమానముగా చూడవలసియున్నది. మానవుడు మరచిగాని ప్రాణి హింసకు కారణభూతుడు కాదాదు.

3. నిజసుఖము నపేక్షించి సన్మార్గము విడనాడి ప్రాణికోటిని వధించుట గాని దండించుట కానీ హితము గాదు. హింస మానవునకు మేలు చేయలేదు. హింసయందే సుఖమున్నదను పాపహృదయమునకు మరణానంతరము కొంచమైనా సుఖములేక మిక్కిలి దుఃఖమే వచ్చును.

4. స్వసుఖమును కోరి ఇతర ప్రాణుల నిర్దయుడై వధించుట గాని హింసించుటగాని మనసులో చేయకూడదన్న నిర్ణయము గలవాడే ధర్మజుడు. అట్టివాడు మరణానంతరము అపార సౌఖ్య పారావారమున తేలియాడును. అహింసనే ముక్తకంఠముతో ఆ ధర్మాత్ముడు దివ్యతరంగా కీర్తించును.

5. ప్రేమ భావములేని కఠిన వచనములతో ఏ విధంగా గాని ఎవరినిగాని పలుకరాదు. అట్లు కఠిన పదములను ఒకనిపై వాడిన వాడు తిరిగి కఠిన పదములను వుపయోగించ ఇద్దరు అట్టి మానసిక క్షోభనే అనుభవించెదరు కదా? అదియే దుఃఖోత్పత్తికి, క్రోధావేశాలకు కారణమగుచుండ లేదా?

ఒక చెంప గొట్టిన మరియొక చెంప జూపి ఆ కొట్టినవాడు సిగ్గుపడునట్లు చేయుట ధర్మము. ఇది దండన గుర్తెఱిగిన ధీరుని విధి సుమా!*

6. కాలిక్రిందపడి పగిలిపోయిన ఘంట మెట్లు గణగణ మ్రోగజాలదో అటులనే ద్వేషపు మాటలాడినా భయపడక తిరిగి నొకడు బదులుగా కఠినపు ద్వేషపూరిత పదజాలమును పలుకక హితవచనములతో శాంతచిత్తుడై పలుకు పవిత్రుడే నిర్వాణమునకు సమీపించును.

7. గోపాలుడే విధంబున చేతిలో కట్టెను పట్టుకొని దాని సహాయంబున పశువుల నదిలించుచూ దొడ్డికి తోలుకొని పోవుచున్నాడో అటులనే రోగమనెడు దండముతో (కాలుడు) కాలం మానవ జీవితముల మర్దించు చున్నది.

---

* ఏసుక్రీస్తు బోధలో ఇట్లే వున్నది. ఈ ధర్మమును క్రీస్తు బుద్ధుని నుండి గ్రహించినట్లే కదా!

8 నిర్దోషులును నిరపరాధులు అహింసాత్మక కార్యవిధాన మందున్న వారును, శాంతచిత్తులును నగు మంచివారి కోమల హృదయములకు దుఃఖము కల్గించు దురాత్ముడీ క్రిందివిధ పది విధంబులలో నొక్క దానికైనా బలి యగుట తప్పదు సుమా! (1) దారుణదుఃఖము (2) మహాఅనర్థము (3) శరీర క్షయము (4) మహావేదన (5) మానసిక విషాదము (6) రాజ దండన (7) భయంకరదోషారోపణ (8) బంధుమిత్రాదుల వియోగము (9) ధనాగార మునకు తీవ్రహానితో కష్టనష్టాలు కల్గుట (10) భయంకర ప్రమాదము జరిగి స్వంతమునునదెల్ల దగ్ధమగుట. వానికి గురియగుటయేగాక సాధువుల హింసించు లేక దూషించు పాపాత్ముడు నరకమున ప్రవేశించి తగిన విష ఫలములను అనుభవించును.

9. స్వంత మచ్చికగావున్న గుఱ్ఱము వేగముగా పరుగు తీయుటకు కొరడా అనావశ్యము సుమీ! అటులనే ఇంద్రియముల జయించినవాడు నిందలకు గురికాడు. కాన దండనకు గురియగుట జరుగదు.

10. సమస్త విధముల సాధనలు చేయించబడిన గుఱ్ఱమునకు కొరడా యెట్లు అవసరము లేకనే యవస విధంబున వేగముగా పరుగు కావలసిన రీతిగా చేయును. అటులనే శ్రద్ధ, సత్ప్రవర్తనము, ఉత్సాహము, ధ్యానము మరియు ధర్మజ్ఞానము మొదలగు పవిత్ర సాధనంబుల నాధారముగ సత్కార్య ములు చేయుచూ దుఃఖకారణములులేక స్వప్నమందైనా దండనా విధానమును చూడడు. అనగా అట్టివాడు ధర్మమును విడనాడలేడు సుమా!

## 11. జరా వర్గము

ఒక దినమందు శ్రీ బుద్ధదేవుడు ఆత్మీయ శిష్యుడు ఆనందునితో ఏకాంత ప్రదేశంబున కూర్చుండి వివిధములైన ఆధ్యాత్మికముల గూర్చి తెలుపుచుండ నొక యుక్తవయస్కుడు ఒక వృద్ధుని చేయిబట్టుకొని తోలుకొని వచ్చెను. దేవు డతనినిజూచి నతనిని శాంతింపజేయుటకై యిట్లు ప్రబోధించెను.

1. అయ్యో! ఈ సంసారము మండుచున్న అగ్నివంటిది. నలుదిశల మహోపద్రవ కరంబులగు పరిస్థితులే నెలకొని యున్నవి. ఈ లోకమున ఆమోద ప్రమోదములకు కొంచమైనను స్థానములేదు. ఓ సంసారీ! నీ జీవితము నలు

దిశలనుండి యంధకార మయమైయున్నది. నీకు దిక్కుతోచకున్నది. ఏ దిశ నుండి సుజ్ఞానజ్యోతి వచ్చునాయని వెదకుచున్నావు అదియే నీ ధర్మము.

2. మానవుడా! అంతులేని గాయములతోను, భయంకర వ్యాధులతోను, యెండిపోయిన కట్టెవలె శక్తి హీనంబై కళాహీనమై యున్నవాడా! నీ శరీరమును జూచుకొనుము. ఎముకల గూడువలెయున్నా మీద వస్త్రముండుటవలన వికార ముగా నుండుటలేదు. శరీరముపై మాంసములేక నశించిపోయిన దానిని గమనింపుడు. వస్త్రమును తొలగించి నీ శరీరమును జూచుకొనుము.

3. ఓయీ! నీ దేహము క్షణభంగురము. దీర్ఘకాలము నుండి దుష్క ర్మల నాచరించి చివరకు వృద్ధాప్య దశలో జిక్కియున్నావు. శరీరము దుర్గంధ పూరితమై కుళ్ళిపోవును. చావునోటిలో నీ వికపడక తప్పదు సుమా!

4. నీదగు యీ దేహము ఎముకలచే నిర్మించబడిన మందిరము (ఇల్లు) వంటిది, మాంసము, రక్తము యముకలకు పూయబడిన పూతయే. ఈ మందిరము ముసలి తనముచేత రోగమరణములందు నివసించుచున్నది. ఈ ఇంటి నుండియే సమస్త కర్మలు చేయబడుచున్నవి. వేయేల సమస్త దుర్గుణ ములకు యీ దేహమే నివాసమై యున్నది.

5. తేజస్సంపన్నమగు రథమైనను, క్రమక్రమంగా యెట్లు యరిగిపోయి శిథిలము కాబడునో యటులనే యీ మానవదేహము పలు యవస్థల మారుచు నశించును. కాని సజ్జనుల సద్ధర్మము వలన కీర్తి వృద్ధి చెందును. దేహమే నశించును.

6. మానవుడు శరీర గృహమును యన్వేషించుటకై అనేక పర్యా యములు జన్మ చక్రమున బడక తప్పదు. సంపూర్ణజ్ఞానము కలుగువరకు జన్మలు, మరణాలు తప్పవు సుమీ!

7. జీవితంలో ధర్మకార్యములు చేయక సత్యజ్ఞానమును తెలియక మరణించువాడు చేపలులేని చెరువును నమ్ముకొని నివసించి నశించి మర ణించిన కొంగవలె విషాదము లనుభవించి మరణించును.

8. పవిత్రంబగు యాత్మ సమస్తంబులగు సంసారిక విషయ వాసనల నుండి సంపూర్ణముగా విముక్తిపొంది నిర్వాణదశకు సమీపించిననే సచ్చిదా నంద స్వరూపమగును సుమా!

## 12. ఆత్మ వర్గము

ఒక నాడొక నవయువకుడు వినువారలతో "దేవా నేనితర మానవుల సన్మార్గములందు నడచుకొనుటకు ముందే ఆత్మ సంస్కరణము గావించుకొన తలంచితిని. ఆత్మ సంస్కారంబు కానిదే యితరులను సంస్కరించు శక్తి యుండదు కదా! మహాత్మా! ఆత్మ వశీకరణ వ్రతానుమార్గముగురించి మీనుండి వినగోరుచున్నాను. అట్లు నాకుతెల్పుము దేవా!' అన, యపుడా దేవుడు-

1. కుమారా! తన్ను దానుద్ధరించు కొనుటకు వాంఛ కల్గియున్నచో సర్వదా జాగరూకుడవై యుండవలయు. స్వీయ సంస్కరణోద్దేశము గల వివేక సంపన్నుడు యవస్థాత్రయమందు (బాల్య యవ్వన, వార్ధక్యములు) జాగరూకుడవై మెలగుట శ్రేయంబు.

2. ప్రప్రథమున యితరులకెట్లుపదేశించు నటులనే తాను నడచుకొనుటయే ప్రథమ కర్తవ్యము. అట్లు తాను యాచరించి యితరుల నాచరింప చేయుట సాధుజన లక్ష్యము. ఆచరణలేని మాటకారి వృథావ్యథకు జిక్కుట నిజము. నిజములో తానాచరించి హితోపదేశము చేయువానిని సమస్తజనులు సన్మానింతురు. సమస్త విజయములలోకెల్ల స్వాత్మవిజయమే గొప్ప విజయమగును. అట్టివాడె తన్నుతాను వశం చేసికొనగలడు.

3. ఆత్మ విజయమును బడసినవాడు త్వరలో మహాదుర్లభంబగు మహాస్వామి సందర్శన మగును.

4. తాను చేసిన దుష్కర్మలే తనను అణచివేయును. అపుడు నరుడు తను చేసిన చెడ్డపనులే తనకు శత్రువులని గ్రహించ నేర్చును.

5. దుష్కర్మల చేయుట మహాసులభము. కాని మంచి కర్మలుచేయుట మహాకష్టసాధ్యము. దుష్కార్యములే లాభకరములై సత్కార్యములు నష్టకరములగును. పర్వతముపై నుండి క్రిందికి పడుట సులభము. కాని ఎక్కుట బహు కష్టము కదా! కాని అటు పడుటవలన గాయాలై, బాధలతో జీవించ వచ్చును. లేదా మరణముకూడ రావచ్చును. కాని కొండను ఎక్కుట శ్రమమైనా అపాయము లేనిదగును.

6. మానవుడే మూఢత్వముచే తన హృదయంలో చెడ్డ కర్మలచేయు తలంపులకు అధిక ప్రాధాన్యత నిచ్చును. అందుకు తానే చెడ్డకర్మలచేసి చెడ్డ ఫలముల పొందును. అనగా చెడ్డపనులు చేయుటకును, మరియు మంచి పనులు చేయుటకును తానే కారకుడగును. ప్రయత్నమువలన తానే దుష్టత్వమునకును, సాధుత్వమునకును తానే కారకుడగు చున్నాడు. ప్రబోధం కేవలం నిమిత్తమాత్రమే. ఒకరొకరిని సంస్కరింప జాలరు. నేను మాత్రం నిమిత్త మాత్రుడనే సుమా!

7. ఇతరములైన ఎన్ని కార్యములు చేయతలంచి యున్నను మానవుడు ఆత్మీయ కర్తవ్యమును నిర్వహించుటకే ముందంజవేయు లాభకర మగును. పర ధర్మాచరణ కంటె స్వధర్మాచరణమే మానవుని ఉత్తమోత్తమ విధియై యున్నది.

8. ఏ మూఢమానవుడు సత్యమార్గములో నడచువారియొక్కయు, ధర్మ పరాయణ ఆర్యులైన సచ్చరితులు, జ్ఞానసపుణ గలవారును సజ్జనుల యొక్క ఉపదేశములను తిరస్కార భావమున పెడచెవిన బెట్టువాడు వెదురుచెట్టువలె తనకుతానే క్షయమగుటకు కారణమగునని తెలియవలయు.

9. మానవుడే మూర్ఖత్వముచే తన హృదయమందు దుష్కర్మల బీజముల నాటుకొనుచుండును. ఆ బీజము లొసగు దుష్ఫలములనే వాడు పొందును. చెడ్డకర్మలు (పనులు) చేయుటకు కారణం తానేయని గ్రహించవలయును. పరిశుద్ధ హృదయుడగుటకు తానే కారణ మగును. ప్రయత్నము వలన సాధుత్వము, దుష్టత్వములను పొందవచ్చును. ఒకరొకరిని సంస్కరింప జాలరు. ప్రబోధము కేవలం నిమిత్త మాత్రమే! (నామమాత్రమే) నేను మాత్రం నిమిత్తమాత్రుడినే.

10. ఇతరుల కర్తవ్యమెంత గొప్పదైనను మానవుడు నిజ కర్తవ్యమును విడనాడి కార్యము చేయబూనుట శ్రేయస్కరము కాజాలదు. సమస్తకార్యముల నాచరింప నభిలషించుటకు మునుపే మనుజుడు ఆత్మీయ కర్తవ్యనిర్వహణ మునకై ముందంజ వేయుట లాభదాయకము. పరధర్మాచరణంబుకంటె స్వధర్మాచరణమే మానవుని ఉత్తమోత్తమ విధి.

## 13. లోక వర్గము

గొప్ప ధనవంతుడైన వ్యాపారి ఒకడు శ్రీ బుద్ధదేవుని మహత్మ్యము వారి నుండి, వీరినుండి విని వివేక సంపాదన మహావరమని, ఒకనాడు ఆ దేవుని సమీపించెను. తనకు సుజ్ఞాన ప్రబోధము చేయుమని వేడుకొనెను. అపుడా మహాత్ముడు ఆ వ్యాపారి ఇంటికిపోయి అతడిచ్చు అథిద్యమును స్వీకరించి ఇట్లు బోధింప మొదలిడెను.

1. కుమారా! దుష్కార్యముల చేయకుము. వివేక మార్గమున నడచుకొనుము. చెడ్డతనముతో నిరంకుశముగా నడువకుము. యదార్థ నియమానుకూలముగా నడచుకొనుము. అశాశ్వతమైన ఈ జగత్తును ప్రేమించి నడచుకొనవలదు.

2. అయాస పడవలదు. మంచి జ్ఞానము పొంద ప్రయత్నించుము. మంచితనమునకై కృషిచేయుము. మంచి భావముల యనుసరింపుము. మంచి గుణసంపన్నుడవై స్థిర చిత్తుండవై నడచుకొనుము.

ఈ లోకమునను పరలోకమునను పరమ సౌఖ్య జనుడవు కమ్ము. సత్యమునే శాశ్వత సౌఖ్యము వరించును.

3. సత్యానుకూల నియమావళిని పాటింపుము. పాపమార్గమున నడువకుము. సాధు పురుషుడు ఇహపరంబుల సౌఖ్యము నొందగలడు,

4. సంసారము నీటిమీద బుడగవంటిదని తెలియుము. ప్రపంచ మెల్లపుడు పశుతుల్య కోరికలు గలదియై యుండును. విశాలమగు విశ్వంబున వింతవింత రీతులలో యుండు సర్వ పదార్థములు యశాశ్వతములే యని తెలియుము. అటు తెలిసిన వానిని యమరాజుకూడ చూచి పారిపోవును. అట్టి ధీరునియెదుట చావు గడ్డిపరకలాంటి యల్పవస్తువే యని తెలియుము.

5. మొట్టమొదట జ్ఞాన భ్రష్టుడై సంచరించిన వ్యక్తి కొద్దికాలము తర్వాత మొదటి అజ్ఞాన దశవీడి అజ్ఞానాంధకారమును వీడి ప్రకాశ వెలుగులో నడచును.

6. వేటకాని వలనుండి విముక్తిచెంది యెగిరిపోవు పక్షివలె సత్యమార్గము తెలిసి జ్ఞానసంపన్నుండగు మనుజుడుకూడ సంసారాంధకారమునుండి విడిపోయి అన్నిబంధనములనుండి విముక్తి చెంది సంపూర్ణ స్వేచ్ఛానందముల మునిగి సుఖించును.

7. కామదేవుని సత్యజ్ఞాన స్వరూపతేజముతో యెదిరించి ధర్మ యుద్ధమున జయించి స్వేచ్ఛా స్వతంత్ర జ్ఞాన సింహాసనమున ఆసీనుడవు కమ్ము.

8. మూఢవ్యక్తి మానవ సత్య ధర్మముల పాటింపకయు, అసత్యములు పలుకుటయును, కాముకుడై నీచ ప్రకృతిచే జీవించ యిష్టపడును. ఎట్టి పాప చర్యలు చేయుటకైనా వెనుకాడడు. అట్టివాడు యభ్యుదయ స్థాన మందుండినను భ్రష్టుడై పోయి జ్ఞానము తెలియక హీనదశయందే యంతమగును.

9. ఉదారభావము లేనివాడును కరుణలేని దుష్ట మానవుడు శాశ్వితంగా యెందును ప్రకాశింపడు. దానశీలుడు కీర్తి చంద్రికా ప్రకాశితుడై సర్వవేళల కొనియాడబడును. కేవలం మూఢజనులచేత కూడ అట్టివాడు కీర్తింపబడును. దానమే మానవజాతికి అత్యున్నత ప్రకాశము గలది. దీని ప్రభావమున పర లోకమున గూడ దాతకు యపార సౌఖ్యముండును.

## 14. బుద్ధవర్గము - సిద్ధవర్గము

ఒకానొక దినమున వినుటకుగాను వచ్చిన వారనేకులు బౌద్ధవిహారము నిండిపోయిరి. బుద్ధిత పదప్రాప్తి విషయమై యొకరికొకరు వాద ప్రతివాదముల సేయ ప్రారంభించిరి. తర్కవితర్కముల చేసిరి. అందు సత్యాసత్యముల నిర్ణయము చేయజాలక ద్వేషభావాలు ప్రకటించుకొను సందర్భమున శ్రీ బుద్ధ దేవుడు వచ్చిననే యావాద ప్రతివాదాలు తొలగునని యెల్లరు యెదురు చూచిరి. ఆ సమయమందే దేవుడు రానే వచ్చెను.

అపుడు ప్రియశిష్యుడైన యానందుడు యెల్లరని చూచి వీరికి బుద్ధత్వము యేమిటో తెలియక వాదోపవాదాలు చేయుచున్నారు. వీరికి జ్ఞాన ప్రబోధము చేయ మిమ్ము కోరుచున్నానని చేతులు జోడించి మ్రొక్కి నొక్కి చెప్పెను. అచటి వారెల్లరు లేచి మ్రొక్కి అట్లు ప్రార్థించిరి.

1. పరివ్రాజకులారా! సత్యా సత్య నిర్ణయమును చేయ కల్గునట్టియు, పరిపూర్ణజ్ఞాన సంపన్నత్వముచే విలసిల్లునట్టియు కామ క్రోధాది యరిషడ్వర్గ దూరుండైనట్టియు, ప్రమాద మెరుగని స్వకీయ ధర్మముగా నెంచునట్టియు, సాధారణ మానవబుద్ధికి కానరాని మంచిమార్గమునందు నడచునట్టి బుద్ధుని ప్రబుద్ధుని యెవరును జెఱుపజాలరు సుమా!

2. విషపూరితంబులును, బంధన యుక్తంబులును నగు విషయవాంఛల నతిక్రమించి కోరిక యను దుష్ట రక్కసిని బంధించిన ధీరుడైనవాడే బుద్ధుడు సుమా! సుజ్ఞానమునె ప్రాణంబుగ భావించి యారాధించు సర్వకాలజ్ఞుడై వెలుగువాడే బుద్ధుడు. అతనిని యెవరును గమ్యమునుండి మరల్చువారుండరు.

3. జీవితాంతము భావమునం దిసుమంతయు, పాపకార్యాచరణ యాలోచన లేనియు, నిరంతరం మానవ సేవాంఛిత భావముతో సత్కార్యా చరణతో, సుజ్ఞానముతో, ధ్యానములో మనసును నిల్పి శుద్ధమైన ధర్మాచరణ లను యాచరించువాడే బుద్ధుడు సుమా!

4. ప్రబుద్ధుడును (జాగ్రదావస్థలో నుండువాడు) అప్రమత్తుడై స్వంత మునకు గాని యుత్తమ ధర్మ ధ్యాన చర్యలను సలుపుచు, ధీమంతుడై, మరియు నిరంతరం యేకాంతముగా నుండగోరువాడై దేవతలకుగూడ యందని వాడె బుద్ధుడై ప్రకాశించును.

5. భువిలో మానవజన్మ బడయుటయే కడుదుర్లభం. మానవోచితంబగు సద్ధర్మ నిర్వహణ సామర్థ్యము సంపాదించుట యంతకన్నా కష్టతరం సుమా! వీని యంతటినిమించి బుద్ధుడై సిద్ధుడగుట యంతకన్న కష్టమని తెలియుడు.

6. ధైర్య స్థయిర్యములతో కష్టములు వచ్చినపుడు యోర్పు గుణము గలిగియుండుటే సర్వోత్తమమైన తప మనబడును. క్షమయే నిర్వాణ పథ మను స్వరూపమై యున్నది. పరుల హింసించునట్టియు, దూషించునట్టివారు నీతిమంతులు కాలేరు. బౌద్ధ మతావలంబు లెల్లపుడును ప్రజాసంఘమున కుపదేశించుచుందురు. ఇట్లు బోధించుచుండుటయే వారి ముఖ్య ధర్మం.

7. మరచియైనా పరనింద చేయకుండుట, ప్రాణికోటిని హింసింప కుండుట, మంచి ధర్మానుకూలంబుగ యింద్రియముల నిగ్రహించి యుండ వలయు. మంచి రుచి లేదా నోటిరుచి కావలెననియెడు యింద్రియముల నిగ్రహించవలయును. తగు యాహారము మాత్రమే తినవలయును. ఏకాంతవాసము మౌనవ్రతము బూను మనోశక్తిని కలిగి యుండవలయును. ఇట్టి జ్ఞానాంచిత చర్యల నాచరించుటే బౌద్ధ ధర్మోపదేశమునందలి ముఖ్య సారాంశములు.

8. మానవుడు పుణ్యముచేత, జ్ఞాన సంపాదనకే పుట్టియున్నాడు. ఐతే యీ మానవుని చెఱచుట కొరకే కోరికలు పలువిధాల, పలు రూపాల నిరంతర ముగా మనుజునికి కల్గించును. ఆ కోర్కెలకు హద్దంటూ లేకయున్నవి. నిరంతరం బంగారు ముద్దల వర్షముగా వచ్చిచేరుట చూచినను మానవునికి తనివితీరదు సుమా! ఆ కోరికలు అశాశ్విత అనిశితంబులనియు, మరి యవి దుఃఖము కల్గించు నవియని తెలిసికొనువాడు స్వర్గమునందలి సౌఖ్యములను కూడ కోరడు సుమా! అట్టి వివేకవంతునికి యీ యలౌకిక పురుషోత్తమునికి అన్నివిధాలైన కోర్కెలను నశింపజేసికొని ఆత్మానంద సాగరమున నోలలాడు శక్తిగల ధీరుడగును.

9. ప్రాపంచిక విషయ వికారములనుండి పుట్టిన చేడు పరిణామాలను చూచి, లౌకికులు భయ భీతులతో, శాంతి నిమిత్తము జనసముదాయానికి దూరంగా పర్వత ప్రాంతాలందు జనులులేని ప్రాంతమందు నివసించ తలంతురు. అట్టి ప్రాపంచిక వ్యసనములు తమ అతితెలివి చేష్టలచే చెడ్డపనులనే చేయుచుందురు. అట్టివారి చెడ్డపనుల ఫలితంగా కాలక్రమంబున కడు దుఃఖితులై సమస్త జనులకు దూరులై నిర్జన భూములే శరణ్యమై యుండే యంత మొందెదరు.

10. కాని అట్టివారికి పర్వతములు, అడవులును పొదరిండ్లు, గొప్ప వృక్షంబులుకాని ఎంతమాత్రం నివాసంబులు కాజాలవు. స్వప్నావస్థయందైన ఇట్టి ఆశ్రయములందు చేరినను వికార దుష్టచేష్టల నుండి విముక్తి పొంద జాలరు. దుఃఖము నుండి దూరము కాజాలరు. జనసమ్మర్దమగు లోకంబున కానని తృప్తి బుద్ధుని యందే పొంద వీలగును. కోరికలున్నవారికి జన మున్న స్థానమందైనా, జనములేని స్థానమందైనా ప్రమాదమే సుమా!

11. సత్యజ్ఞానముతోయున్న బుద్ధుని, అతని ధర్మమును, సంఘమును భక్తి శ్రద్ధలతో ఆశ్రయించి, చిత్తచలనము లేకుండ చేసికొని, సత్య జ్ఞానమును సంపాదించుకొని దానికితోడు ఆర్యచతుష్టయమును గ్రహించి పవిత్ర అష్టాంగ మార్గమును నడచుకొని జీవించుటయే ధర్మవీరుని లక్ష్యము కావలె.

12. అపుడె అట్టివాడు సమస్తదుఃఖముల సమూహము నుండి సంపూర్ణ విముక్తి పొందును. ఆర్య సత్యచతుష్టయము అనగా (1) దుఃఖము (2) దుఃఖ మూలము (3) దుఃఖాంతము (4) దుఃఖోపశమన మార్గము. అష్టాంగ మార్గము:- 1) సమ్యగ్దృష్టి (2) సమ్యత్సంకల్పము (3) సద్భాషణము (4) సత్కర్మ (5) మంచి జీవితము (6) సత్యవ్యాయామము (7) సత్య స్మృతి (8) సత్సమాధి.

13. సుజ్ఞాన నిలయంబగు ధర్మవృక్షము మొదలు నాశ్రయించు వ్యక్తిని సంసారిక భయ విషాదములు తాకజాలవు. అట్టివానిని మృత్యువు కూడ తాకు టకు భయపడును. జన్మరాహిత్యమై యట్టివానికి శాశ్వితానందము దక్కును.

14. భౌతిక ప్రపంచమున కతీతంబగు ప్రకాశవంతుడగు బుద్ధుడు అన్ని ప్రాంతాలందు జన్మించుట దుర్లభం సుమీ! అట్టి మహత్తర జ్ఞానసంపన్న ప్రభాసితుడగు బుద్ధుడు పుట్టిన ప్రదేశము, వంశము శుక్లపక్ష మందలి చంద్రో దయ ప్రకాశమువోలె పెరుగుచు పోవును కూడ.

15. మంచిధర్మము నశించినపుడు, అధర్మము పెరిగినపుడు, అన్యాయ, నిర్దయ, కాఠిన్యముగల సహచరులతో రాజ్యపాలనము సాగు మహాదుర్మార్గ కాలము నందు మానవుల క్షేమము కొఱకు బుద్ధులవతరించు చుందురు. ఆ కాలమందు బుద్ధాగమనం సుఖప్రద శాంతిమయ మగును. అట్టితరి బుద్ధుని మొడ భక్తివిశ్వాస ప్రపత్తులు పెరిగి సంసార సాగరము నుండి తరించగోరువారు అభ్యుదయము చెంది సుఖించి ముక్తిపొందుట వాస్తవము సుమా!

16. బుద్ధుని ధర్మజ్ఞాన జ్యోతిని మనసార కాంచుచూ సంసార బంధ నము నుండి విడిపోయినట్టివాడు నిర్వాణము తప్పక పొందును. అట్టి బౌద్ధు ని ను ఆదరించితీర వలయును. అట్టివారిని సన్మానించు వారికి చిత్తశాంతి తప్పక లభించును.

17. అట్టి బుద్ధుని పుణ్యమునకు హద్దు లేదు. అతడు నిత్యపూజార్హుడు. బుద్ధుని చంద్రబింబప్రకాశ దివ్యతేజ కాంతులు ముల్లోకములందును విరజిమ్మును. అట్టి బుద్ధునారాధించు వాని పుణ్యమునకు హద్దు లేదు.

## 15. సుఖ వర్గము

యవ్వనకాల మందు అతివిచిత్ర విషయ కోరికలుండుట సహజమే. యవ్వనదశ రెండవ భాగములో చాల ముఖ్యమైనదశ అనబడును. అదియే ఎక్కువ సార్థకమగు కాలము. మానవ శరీరమను వృక్షము యవ్వన దశలో మానసిక ఆటుపోటు లధికముగా నుండును. యువకులు ఇద్దరు బౌద్ధభిక్షువులైనా అసూయ ద్వేషంబున తగవులాడి నాటినుండి యిద్దరు మాటలాడకుండిరి. వారి ద్వేషం రానురాను ఎక్కువై ప్రేమ అంతరించి విచారకర పరిస్థితి ఏర్పడెను.

త్వరలోనె శ్రీ బుద్ధభగవానునికి ఆ విషయం తెలిసి అవివేకులగు శిష్యుల మనసులోని మాలిన్యము తొలగించ ఆ ఇరువురిని ఒకచోటకు రమ్మని అచటునే బౌద్ధులనెల్ల నొకసారి సమావేశపఱచెను. వారి హృదయ కమలముల వికసింప చేయ ఇట్లుద్దేశించి బోధించెను.

1. బిడ్డలారా! మనల ద్వేషించు మనుజుల తిరిగి వారిని ద్వేషించరాదు. మానవులమగు మనం ద్వేషముగల మనుజులందు ద్వేషము లేకుండ సంపూర్ణ ప్రేమాదరంబున నిరంతరం జీవించవలయు సుమా!

2. పీడింపబడిన వ్యక్తులలో మనం బాధాశూన్యులమై వుండవలయును. వ్యాధిగ్రస్తులలో వ్యాధిరహితులమై మెలంగుటయే శ్రేయస్కరం. కోర్కెల విషయము లందు ఓర్పునేర్పులతో బుద్ధితో నడువ వలయును. చంచలము లేని స్థిరబుద్ధితో నడచుకొన వలయును. అట్టి విధానమే శ్రేయంబని తెలియుము.

3. సుఖపురుషులై, రాగరహితులై జీవించుట యుక్తము. కోరికలు సాధించు హృదయుల మధ్య కోరికలు లేనివారమై (స్వార్థములేని) నడచుకొనుట శ్రేయము.

4. ఒకరిపై విజయము కోరుట విద్వేషాగ్ని రగులుటకవకాశ మేర్పడును. జయించిన వ్యక్తి దుఃఖితు డగును కదా! ఆ సుఖదుఃఖముల రెంటి మధ్య

పుట్టునదే ద్వేషము. జయాపజయములు స్వభావసిద్ధములని, ఆ వికార ద్వయాన్ని లేకుండ చేసికొనువాడే ధన్యుడు.

5. దుష్టజన సాంగత్యము కోరువాడు చాలకాలము విషాద మనుభవించుచు మూర్ఖుల స్నేహము చేయుచుండును. శత్రువులు మైత్రితో యున్నట్లే మెలగినా వారు విషాదములో తగుల్కొనియే జీవించు చుందురు.

సజ్జన సాంగత్యము పరిశుద్ధమైన ప్రేమాభిమానములతో శాశ్వతంగా హాయిగా జీవింతురు. కాని దుర్జన సాంగత్యము వలన కొద్ది కాలమందే మట్టికుండ మరిమరి పగులునట్లు చిత్తమునకు అనతికాలమందే చింతలు తెచ్చును.

6. కాన బుద్ధిమంతులు, ప్రజ్ఞావంతులు, పండిత ప్రవరులు, ధైర్యవంతులు, కర్తవ్యపరాయణులగు మహాత్ములను అనుసరించుటే కర్తవ్యమైన ధర్మమని ఎరుంగుడు.

7. ఈ భూమియందు సమస్త వ్యాధులలోనికెల్ల తృష్ణయే (కోరిక) మహా ప్రచండ రోగము. దీని కారణముతోనే నిరంతరం శరీరమునకు జననమరణాది దుఃఖములు కల్గుచున్నవి. దుఃఖములలోనికెల్ల దేహమే అసహనీయ దుఃఖ భండారము. నిర్వాణపదమే సమస్తవిధ సౌఖ్యములకంటె సర్వోత్కృష్టసౌఖ్యానంద సందాయకము.

8. ఆరోగ్యమే సర్వోత్తమంబగు సంరక్షణము. నిరంతర నిర్హేతుకానందానుభవమే ధనధాన్య సంపత్తి. విశ్వాసమే ఉత్తమోత్తమ బంధుత్వము; నిర్వాణమే సాటిలేని పరిశుద్ధానంద ప్రదాయకము.

## 16. ఆసక్తవర్గము (ప్రియవర్గం)

శ్రీ బుద్ధదేవుడు ఆజ్ఞాపించగా ముఖ్యశిష్యుడైన ఆనందుడు దేశంలో పర్యటన చేయుచూ స్వస్థానమునువీడి బౌద్ధమత ప్రచారముచేయ బయలుదేరెను. ఆ పర్యటనలోని చిత్రవిచిత్రానుభవములు అతనికి కల్గినవి. కామక్రోధ మదమాత్సర్యతృష్ణాది దుర్గుణభయోత్పాదక దృశ్యములను మనోబాధతో గురుదేవునికా శిష్యుడు వివరించెను. అది గని గురుదేవుడు శిష్యుని విషాద మంతమొంద నిట్లు బోధించెను. కుమారా!

1. స్వంత జీవితాదర్శమును విస్మరించినవాడును, నిరర్థక విషయాను రక్తుడై యుండువాడును. నిరంతరం ధ్యాన రూపుడై మెలంగనివాడును ఇంద్రియాను రక్తుడై నడచువాడును నిజముతో నికృష్ట జీవుడై కాలము గతించి పోయినంతనే పరమ పవిత్ర భావ మేర్పడియున్న సజ్జనునియెడ భేద ద్వేషములు లేవో నడచుకొనుము.

2. కాన ఈ సంసారమున ప్రియాప్రియ వస్తుకాంక్షారహితుడై విషాదోత్పత్తిని కల్గించు కారణముల త్యజించి జీవించ వలయును సుమా!

3. కోర్కెతోడనే శోకము కల్గును. భయము పుట్టుచున్నది. పరిపూర్ణముగ కోర్కెల నాశింపనివాడే భయము నుండి విరక్తుడై ధన్యుడగును సుమా!

4. స్నేహము వలన గూడ భయోత్పత్తి కలుగును. విషాదము కూడ అందుండియే పుట్టుచున్నది. స్నేహమును కాంక్షింపరాదు. అట్టివాడే ధన్యుడు. పరిశుద్ధ హృదయుడై విడివడి అట్టివాడే స్వేచ్ఛ పొందగలడు.

5. కామమే మానవజాతిని యీ భువిలో భయ విషాదములకు గురియగునట్లు చేయుచున్నది. కామ క్రియానురక్తి శూన్యుడైన వ్యక్తియే భయ విషాదములనుండి విడివడి ధన్యుడై నిర్వాణపదము చేరును. అతడే గోసాయి యనబడును.

6. దీర్ఘకాలముదాక స్వగృహమునె బాసి దేశాంతరము పోయి తిరిగి యింటిని చేరవచ్చు వాని బంధుమిత్రాదులను కలసి ఆనందించును.

7. అదే విధమున సత్కర్మాను రక్తియై యిహలోక యాత్రను చాలించి అనగా దేహమును బాసి స్వర్గమున ప్రవేశించ నిర్వాణము పొంత సుకృతము కలవాడగును.

## 17. క్రోధవర్గము

బాలభిక్షువగు రాహులుడు యెల్లపుడును వ్యర్థపు మాటలు మాటలాడుచు యనగా యెపుడెట్లు యెవరితో మాట్లాడ వలయునో తెలియని వాడై యుండెను. మూర్ఖునివలె యుండును వివేకము లేనివాడైయుండెను. మాటలాడు విధము తెలియకుండెను. ఆ విషయము భిక్షువులు తెల్పగా బుద్ధదేవుడు యన్యాయ క్రోధపూరిత మాటలను విని విచారించి నానాదేశ భిక్షువులను సమావేశపరచి వారి యెదుటనే శిక్షాపూరిత భావంబున నిట్లు బోధించెను.

1. మానవుడు విషపూరితమైన పామువంటి క్రోధమును విడనాడవలయును. అహంకారమును జన్మశత్రువుగ నెంచి వీడవలయును. నామరూప వికార మార్గాలకు వశీభూతుడుగాక ప్రపంచ భూమిలోని సర్వవస్తు వాంఛలను వీడవలయును. అట్లు శాంతమూర్తియై సత్యజ్ఞానవర్తియై యుండుటే యుత్తమం.

2. క్రోధావేశమును నిరోధింప గల్గినవాడే యుత్తమ పురుషు డనబడును. ఓర్పుగల్గి యుండువాడే బుద్ధుడు శీఘ్రవేగముగ పోవు రథమును యడ్డుకొని నిరోధించ గలినవాడే నిజ సారధియైనట్లు క్రోధావేశాల నరికట్ట జాలనివాడు మట్టిబొమ్మ లాంటివాడే సుమీ!

3. క్రోధమును ప్రేమవలనను, చెడు తనమును మంచితనముతోడను, లోభమును యౌదార్యము తోడను. యసత్యమును సత్యము తోడను వశము చేసికొనువాడే యుత్తముడై సుఖముగా జీవించును.

4. ఓ మానవుడా నీ వెల్లపుడును సత్యమునే సర్వేశ్వర రూపముగనెంచి యారాధించుము. క్రోధమును నాశనకారిగా మరియు శత్రువుగా నెంచి హింసా పర్యలను చేయకుండుటే మరియు లోభివిగాక పరులకు దానము చేయువాడవై యుండుటే నిర్వాణ మందిరము చేర సమర్థుడ వయ్యెదవు.

5. ఇతర జనుల కపకారముచేయు చిత్తములేని వానిని సర్వావస్థల యందు ధర్మాత్ముడనబడును. అట్టి మానవోత్తముడే, మరణించగనే సమస్త భయ విషాదములులేని స్వేచ్ఛాపరుడగును.

6. మౌనవ్రతధారణంబుననే ముక్తి ప్రాప్తించునని భ్రమించి, మూర్ఖమును, అవివేకమును బహిష్కరింపని మనుజుడు సంసారమును త్యజింపలేడు సుమా! అధికంగా మాట్లాడువానిని వాచాలు డనబడును. మానవు డెటు తిరిగినను లోక నిందలకు పాత్రుడగును. అట్టి లోకనిందనుండి విముక్తిచెందు వ్యక్తి యేయొకరును భువియందు కానరాడు. సంసార స్వభావమే యట్టిది సుమా!

7. నిష్కళంక చరితుండును, ధీమంతుడును, వివేకసంపన్నుడును, సమస్త సద్గుణాలంకారుండగు పురుషోత్తమునే సర్వదా సంసారము సన్మానించును. అట్టి సిద్ధు నెవరు దూషించలేరు. అట్టి వానిని సంసార సాగరము నుండి వెలికి తీయబడిన రత్నమందురు.

8. మానవుడా! కల్పించబడిన యలంకారము లున్నట్లుగాక యెల్లపుడును సద్గుణ భూషణుడవై యప్రమత్తుడవై చరింపుము. మంచి గుణచర్యలచే, మంచి వన్నెల చిన్నెల మాటలచే జీవితనౌక సాగించుము. అదియే యీ సంసార భయానక సాగరమందునుండి దాటించును. అదియే నిర్వాణపథ మనదగును.

9. మానవుడు యింద్రియలోలుడైగాక క్రోధావేశమునుండి నిత్యము జాగ్రత్తగా నడచుకొనుటే యుత్తమం, నోటి దురుసునుగాని నోటి రుచినిగాని నిగ్రహించి తీరవలయును. సమస్త పాప జాలముల విడనాడవలయును. నోటి నుండి సత్యమైన మాటలనే పలుక వలయును. అట్టివానికే మేలు జరుగును.

10. మానవుడా! క్రోధమును వీడు మనసును కల్గియుండుము. మనస్సును సంపూర్ణముగా వశము నందుంచుకొనుము. అంతరంబునయున్న శత్రువులను, చెడ్డ తలంపులను వదలుము. ఇంద్రియాలపై సర్వాధికారము కల్గియుండుము.

11. మానవుడా రాగద్వేషాలను వీడుము. మనోనిగ్రహముతో నుండుము. మానసిక పాపాల పారద్రోలుము. మంచిచేయు సదాశివమూర్తివి కమ్ము!

## 18. అపరిశుద్ధ వర్గము

ఒకానొక వ్యక్తి మధుమాంస భక్షకుడై యుండి మరియు పరస్త్రీ వ్యామోహితుడై యుండి తానట్టి నీచ ప్రవర్తనలోనున్న విషయాన్ని మనసునందు తలంచి నది నీచమైన దుర్వ్యసనమని గ్రహించెను. కాని యా వ్యసనమును వీడలేకుండెను.

కాని యొకనాడు శ్రీ బుద్ధ మహాత్ముని పవిత్ర వదనారవిందమును దర్శించిన యా దుర్గుణములు లేకుండా పావునేమోయని ఆయనను సందర్శింప సమయం కొఱకు సర్వదా నిరీక్షించుచుండెను. ఒకనాడు మహాత్ముని దర్శించ భిక్షుమందిరమునకే పోయెను. కాని యటనున్న భిక్షువులందరు నతని జూచి కోపముతో నతనిని చీదరించి దుర్మార్గుడవని యందు నిలువనీయలేదు. అతడట్లు యానాడు వెనుతిరిగి పోయెను.

ఒక దినమందు దేవుడు తన ముఖ్య శిష్యులందరిని యేకముచేసి యుపదేశించ పోవుచుండెను. ఆ దుర్జనుడు యపుడా దేవుని పాదములపై బడి యేడ్చుచూ తనను రక్షింపుమని వేడెను. దేవుడపుడాతని జూచి దయతో చేత శిరంబు దువ్వి రేపుదమే ప్రాతఃకాలమున భిక్షువులుండు మందిరమునకు రమ్మని తెల్పి వెళ్ళిపోయెను. ఆ మూఢవ్యక్తి శ్రీ బుద్ధదేవుని ఆజ్ఞానుసారం మఠమున కరుదెంచి సుశిక్షణకై భగవానుని రాకకు వేచియుండెను. దేవుడు క్రమానుసారం యందు ప్రవేశించి యతనిని చూచి యుచితాసనమున కూర్చుండెను. భిక్షువులందరు లేచి నమస్కరించిరి. ఆ మూఢునిచూచి యిట్లు తెల్పెను.

1. భ్రష్టుడా! నీవు పరిపక్వమైన తమలపాకువలె వున్నావు. భయంకర రూపముతో యమదూతలు నీ కొరకు వేచియున్నారు. కాని జ్ఞానధూరుడవగు నీవు మరణము ద్వారముచెంతనే నిలిచి యున్నావు. యమపుర ప్రయాణమున కవసరమగు సామగ్రినే సేకరించుకొని యుండలేదేమి వింత?

2. అపార సంసార పారావారమున మునిగి తేలుచున్న నీవు నీ స్వంత రక్షణార్థము శీఘ్రమొక ద్వీపమును నిర్మించుకొనుము. మానవుడు చేయతగిన ప్రయత్న ప్రభావంబున విశేషముగా కష్టపడి శ్రమించి బుద్ధి శక్తిని సంపాదించు

కొనుము. నీ దేహ మందున్న దుర్గుణములనెల్ల త్రెంచిపార వేసికొని దోషముల నుండి విముక్తుడవు కమ్ము. ఈ ప్రయత్నము లన్నియుచేసి నిష్కళంక సంపన్నుడవైననే నీవు ఆర్యజన పవిత్ర మందిరమున ప్రవేశింపగల యర్హుడ వయ్యెదవు సుమా!

3. నీ జీవితము ప్రతిదినము మృత్యు దేవాలయము నందు విషాద భయమూర్తులచే సమీపించు చున్నావు. నీవింత వరకు వివేక శూన్యుడవై యుండి మృత్యువును సమీపించు చున్నావు.

4. నీ విపుడే కాలము గడుపక నీ స్వంత రక్షణకొఱకు ఉన్నతస్థాన మును సిద్ధము చేసికొనుము. అందు పరిశ్రమ చేయుట కష్టమని తలంచిన నీ జీవిత ప్రయాణ సమస్య విషమించి మహాప్రమాదకారి యగును సుమా! త్వరగా బుద్ధిమంతుడవు కమ్ము. నిన్నావరించియున్న చెడ్డపనులచేయు బుద్ధిని సమస్త దుర్గుణములను వెంటనే విడనాడుము. సంపూర్ణముగా అపరిశుద్ధము నుండి విముక్తుడవు కమ్ము. అవుడే నీ జన్మచక్రం సుఖములో పడును. మానవ ప్రయత్నము లేనిదే సర్వేశ్వరకృప, ఫలములు సిద్ధించ నేరవు.

5. స్వర్ణకారు డేరీతి యనుదినము బంగారుపైనున్న మలినమును పోగొట్టు టకై అగ్నిలో కాచునట్లు యా విధంబుగనే బుద్ధిమంతుడు కర్మయోగియునగు వ్యక్తి ప్రతి దినము మనో మాలిన్యమును పోగొట్టుకొనుటకు క్రమంబుగా శ్రమించుచుండ వలయును.

6. లోహమున పుట్టు తుప్పు (చిలుము) లోహమును నశింప జేయును. తుదకు సంపూర్ణంగా లోహమునే తినివేయును. అటులనే సత్య మార్గములో నడువని వానిని వాని దుర్బుద్ధియే దుర్గతిపాలు చేయును సుమా! సత్యమార్గ మున నడువని మూఢుడు తనకు తానే నాశనకారి యగును సుమా!

7. నిరంతరం అభ్యాసము చేయవలయును. అట్టి సాధన లేకున్న కళంకము వచ్చును. సోమరితనమే దేహమునకు కళంకము (కీడు) సాధ్వీ లోకమునకు కళంకము వ్యభిచారమే సుమా! సమస్త పాపములకు మూలం వ్యభిచారమే! అది అన్ని లోకములందు గర్హింపబడును.

8. పూర్వము చేసియున్న పాపము కంటె అధిక పాపనిలయం 'అవిద్య' (జ్ఞానం లేని విద్య)యే సుమా! నీచము లందన్నింటికన్నా యవిద్యయే గొప్పది! ఈ యవిద్య నుండి దేహమును విద్యచే శుభ్రపరచుకొని సంపన్న చరిత్రను పొందుడు.

9. సహజ వినయ విధేయులును, నిష్కళంక చరితులును, బుద్ధిమంతులును, సుస్థిరచిత్తులును, నిర్మల హృదయులును, శాంత మనస్కులును, నిపుణులగు పురుషులు జీవితయాత్ర కష్టతరమైనను, మహాసులభమై మరియు హర్షదాయక మగును.

10, 11. ప్రాణికోటిని వివేకశూన్యుడై హింసించు వాడును, నిరంతర మసత్యమాడువాడును, ఇతరుల అనుమతి లేకనే వస్తువులను తీసికొనువాడును, పరస్త్రీ వ్యామోహపరుడైన వాడును, మద్యపానము (మాదకాది) చేయువాడును ఈ లోకమునందే తన జీవితాన్ని స్వహస్తములతో తానున్న వృక్షమును నఱుకుకొనునట్లు తానే చెఱచుకొనును.

12. ఓ పతితుడా (అపవిత్రుడా)! తనపై తన కధికారము లేనివాని స్థితి కడు చిత్రము కాదా? దుర్మార్గ మార్గము నందున్నవాడు తన ఇంద్రియములకు దాసుడైవిశ్వప్రయత్నం చేసినను, విషయ వాసనల నుండి విముక్తుడగుట కడు దుర్లభం సుమా! అట్టివానికి లోభత్వ గుణముచే నిరంతరం క్షోభ కల్గును. కాన పేరాశ (అతిఆశ) లేక యుండవలయును. దుష్కార్యముల చేయకుండుటే నీ కర్తవ్యము అదియే నీకు శరణ్యం సుమా!

13. సంసారులు తమకుండు శ్రద్ధామోదముల ననుసరించియే దానము చేయుదురు. అట్లు దానముచేయు వానినిజూచి మత్సరం జెందువాడు మూర్ఖుడై రాత్రింబవళ్ళు మనసు శాంతిలేక సహనము కోల్పోయి దుఃఖ మనుభవించుచుండును.

14. మత్సరము, దుర్భావముల సమూలముగ నాశనము చేసికొనువాడు నిరంతరం మిక్కిలి యానందము ననుభవించును. అట్టి వాని చిత్తము సదా ప్రశాంతమైయుండి విషాద, భయ రహితుడైయుండు కారణంగా సౌఖ్యము ననుభవించును. తత్శాంతియే మోక్షమునకు మూలమగును.

15. సహజముగనే మానవుడు పరుల దోషముల లెక్కించును. కాని తనయందు వేరువలె పాదుకొనియున్న దోషములను గుర్తింపలేడు. మనుజుడు యెదుటివాని కంటిలోయున్న నలుసును గుర్తించగలడు గాని తనయందున్న పర్వతములాంటి దోషము లుండినా గుర్తించలేడు. అందుకే యితరుల తప్పుల నెంచునేగాని మనిషి తన తప్పులను గ్రహించలేడు.

16. సర్వదా పరుల దోషముల వెదకుచుండువాడును, పరుల యజ్ఞాన వశంబున తనకు గావించు యవమానమునకు కోపము తెచ్చుకొనువాడును, నిరంతరం క్రోధాగ్ని కాహుతి యగువాడును, దినదినము విషయ వికారములు యభివృద్ధి జెందు దుఃఖము పాలగును. అట్టివాని దుర్గుణములు తొలగుటకు మారుగా రోజురోజుకు పెరిగి వాని ఆత్మ వినాశనమునకు దారితీయును సుమీ!

17. ఆకాశంలో బాటలేదు. అట్టులనే వేషముతో మానవుడు సాధువు కాజాలడు. బుద్ధుడు సర్వదా ప్రపంచమున కతీతముగా యుండును. కాన ప్రాపంచిక ధర్మమున కతీతంగా యుండువాడే బుద్ధుడగును.

18. బాహ్యాకారంబగు కాషాయ వస్త్రధారణలతోను, తల బోడి చేయించు కున్నను సాధు మనుజుడు కాజాలడు. ప్రాణికోటి శాశ్వతమైనది కాదు. కాని బుద్ధుడు సంసారబంధన విహీనుడై, సుస్థిరుడై అచంద్రతారార్కంగా ప్రకాశించును.

## 19. ధర్మట్ట వర్గము (న్యాయ వర్గము)

సోమదత్తుడను రాకుమారుడు సహజముగా బుద్ధభగవానుని దర్శించుటకు ప్రతిదినము బౌద్ధ విహారమునకు బోవుచుండెను. అతడు మహా కోపిష్ఠి. అత డెప్పుడు తన సహచరులందరిని బహు ముప్పతిప్పలు పెట్టుచుండెను. అతని స్నేహితుడొకడు బుద్ధ మహాత్ముని బోధలు నీవు వినలేదా? దేవుడు న్యాయ సత్యములనే యెల్లప్పుడును బోధించుచున్నాడు. భయ దుఃఖముల నివారణ కా బోధ యుపయోగపడును. ఆయన సృష్టి, స్థితి, లయ కారుండు నగు, పరబ్రహ్మ మూర్తి. ఆయన బోధ నాయందు నిరంతరం మొదలుచునే యున్నది. కాన నీ వాయన బోధను శ్రద్ధగా పోయి వినుము.

ఆ స్నేహితుని మాటలు విని సోమదత్తుడు చివాలున లేచి బౌద్ధ విహారము చేరగ పోయెను. మహాత్ము డపుడే జనసమూహమును చేరియున్న కారణాన బోధ ప్రారంభించియుండెను. శ్రద్ధాసక్తుడై కేంద్రీకృతమనసుతో ఆ దేవుని బోధ ఆతడు విన నారంభించెను.

1. బిడ్డలారా! హితాహితముల (మంచిచెడ్డల) తెలియక వెంటనే తనకు తోచిన రీతిగా కర్తవ్యమును నిర్ణయించు వ్యక్తి ధర్మాత్ముడు కాజాలడు. చంచలంబున సత్యాసత్యముల గుర్తెఱిగి కార్యములకు పూనుకొనువాడే ధర్మశీలుడు.

2. ధర్మతత్త్వ నిర్ణయంబున దూరదృష్టితో న్యాయమును, ధర్మమును, జనమునకు బలాత్కారమునగాక ప్రేమచేతను, శాంతముతోడను బోధించి తనను యనుసరింప చేసికొను ధీమంతుడే బుద్ధిమంతులయందు ధర్మశీలుండై నడచును.

3. వాక్చాతుర్యమున అధిక ప్రసంగముల చేయువాడు పండితుడు కాజాలడు. సహన గుణము గలవాడును, పరుల తిరస్కారముచేసి విస్మరించని వాడే భయ విషాద శూన్యుడై యథార్థమగు పండితుడగును.

4. తలమీది వెంట్రుకలు నల్లనివి తెల్లగా మారినంత మాత్రాన మనుజుడు వృద్ధుడు కాడు. అధికప్రాయము గతించినంతనే యమూల్యమగు ప్రాయమును వ్యర్థముగా గడుపువ్యక్తి వాస్తవంగా వృద్ధుడు కాజాలడు.

5. సత్యధర్మ పరాయణుడు, సద్గుణ సంపన్నుడు, ప్రేమభావము గలవాడు, అహింసాపరుడు, నియమము గలవాడు నగు యుత్తమ గుణాలతో నుండు భూషణుడే నిజములో అన్నివిధాలుగ వృద్ధుడనబడును సుమా!

6. అసత్య మాడుటలో యిష్టముగా నుండువాడును, ఓర్పులేనివాడును, చంచల చిత్తుడును, శరీరము బోడి చేసుకొని బాహ్య వేషధారి యైనంత మాత్రాన శ్రమణుడు (భిక్షువు) కాజాలడు.

7. మానవ జీవితమందలి సమస్త పాప సమూహముల నిర్మూలింప చేసికొనినవానినే శ్రమణుడని యనబడును సుమీ!

8. అన్యుల్లచెంత భిక్షను యాచించినంత మాత్రాన మనుజుడు భిక్షువని యనరాదు. సాంగోపాంగముగ బౌద్ధ ధర్మ రహస్య సిద్ధాంతమును గ్రహించ కల్గిన పురుషోత్తముడే భిక్షువనబడును.

పుణ్యాపాపములనుండి దూరముగనుండి బ్రహ్మచర్యము నాచరించు వాడై జ్ఞానముచే యీ లోకమున పవిత్రమగు సత్యజీవయాత్రను సాగించు వ్యక్తియే వాస్తవ భిక్షువుగా నొప్పును.

9. ప్రాణికోటి నేవిధముగ నైనను హింసించువాడు ఆర్యుడు కాజాలడు. సమస్త జీవులపట్ల దయతోనుండి వాని క్షేమమునే సదా కోరువాడే యదార్థములో ఆర్యుడు యగును.

10. మనుజునకు హృదయములో దుర్మార్గ భావము సంపూర్ణంగా నశించిపోయినపుడును, విషయవాసనాబీజము లేమాత్రము లేకుండ పోయినపుడును, సాధారణ ప్రజల కతీత గుణ జీవన విధానమందుండు వాడును, దుఃఖము, భయములు లేనివానికి మాత్రమే యపూర్వానందములు ప్రాప్తించును.

11. భౌతిక ప్రపంచమున కతీత జ్ఞానము పొందుటకు నియమపాలనంబునగాని సమస్త వేదవేదాంగ పురాణేతిహాసాధ్యయన వలనగాని విజ్ఞానంబున గాని యౌగిక క్రియాచరణంబునగాని నిరంతరం, యేకాంతవాసము చేయుచుండినగాని మనుజునకు భౌతిక ప్రపంచాతీతంబగు నిర్వాణపద సౌఖ్యము లభింపజాలదు. ఐహిక విషయ వాసనా బంధనము త్రెంచుకున్ననే మానవుని కీ భూమిమీద నిష్కామకర్మ సౌఖ్య శాంతులు వశమగును. ఆశా పాశములందున్న మనుజునికి యనిర్వచనీయానందము ప్రాప్తింపజాలదు.

## 20. ధర్మపథ వర్గము

సిద్ధార్థ భగవానుడు జపతపాది ధ్యానముల పూర్తి చేసికొని నిరంతరం గయ పుణ్యక్షేత్రమందు అశ్వర్థ వృక్షముక్రింద కూర్చొనియున్న సమయమందే జ్ఞానబోధ చేయుచుండెను. ప్రపంచాభ్యుదయమునకై ప్రేమ కరుణాంతరంగుడై పర్యటన చేయుచూ బోధింప తలచెను. బౌద్ధ ధర్మ ప్రచారముచేసి సంసారుల ఆదిమధ్యాంత రహితమైన నిర్వాణపథ మార్గంబు తెలుప బయలుదేరెను.

1. సంసారులారా! సంసారమున ధర్మబోధకులచే నుపదేశింపబడు సమస్త మార్గములలోనికెల్ల యష్టాంగ మార్గమే శ్రేష్ఠతరము. సర్వప్రపంచములో సత్యములలోనికెల్ల ఆర్యసత్య చతుష్టయమే సంపూర్ణము, సత్వరాచరణీయం

సమస్తవిధ సద్గుణరాసి యందు వైరాగ్యమే సర్వోత్తమమైనది. సర్వమానవులను, సర్వజీవులను ప్రేమించువాడే ఉత్తమోత్తముడు.

2. మానవుని దృష్టిని వివేకజ్యోతివైపు యీ యష్టాంగమార్గమే మరల్చును. వేరొక మార్గం లేదు. ఆ మార్గమందే మానవుని కల్మష చిత్తము పరిశుద్ధ మగును. కామక్రోధాది దుర్వ్యసనములకు లోనుగాక యుద్ధరింపబడెదరు.

3. మానవులారా! వెంటనే యీ మార్గమున నడువుడు. అపుడే సమస్త దుఃఖములు నిర్మూల మగును. నిర్మలానందము కలుగును. భయవిషాద ములు మీ చెంతకే రావు. ఈ మార్గమును నేను గ్రహించియే మీకు తెలుపు చున్నాను.

4. సోదరులారా! భూమిపై మానవునికి మంచి ధర్మము, మంచి పనులు చేయుటయే యని కర్మయోగశాస్త్రము తెలుపుచున్నది. మీరుకూడ ఆ ప్రయత్నం చేయుడు. తథాగతులు ఉపదేశింతురేగాని అట్లు నడచుకొను బాధ్యత మీదే సుమా! యుక్తాయుక్త వివేచనతో స్థిరసంకల్పులై యుండుము.

5. అశాశ్వితంబగు ప్రపంచములో పుట్టు అన్ని సమస్త పదార్థములు అశాశ్వితములే యను రహస్యమును సుజ్ఞానముతో మాత్రమే తెలియ నగును. సుజ్ఞాని సమస్త భయదుఃఖములయెడ సహజ సహనముతో భరించును. అట్టి వాడు సుఖదుఃఖములను సమముగా జూచును. విషయవాసనలు అందువలన వానికి దూరమగును. అపుడు వాడు పరిశుద్ధుడగును.

6. భూమిపై పుట్టిన నశించునట్టి పదార్థము లన్నియు భయదుఃఖము లతో కూడియున్నవి. అట్టి రహస్యమును గ్రహించలేనివాడు దుఃఖభయాదులను ఆనందపూర్వకముగా ననుభవింపజాలడు సుమీ! ఆ రహస్యమును తెలిసినవాడు మాత్రమే ఉత్తమోత్తముడై చిత్తశుద్ధి గలవాడై యుండును.

7. ఆకార రూపముగల పదార్థము లన్నియు అశాశ్వితములే. ఆ తత్త్వ రహస్యమును తెలిసినవాడే సుజ్ఞానియై చిత్తశుద్ధి గలిగి దుఃఖానుభవాలలో సంపూర్ణ సహనంతో మెలగును. తత్కాలికానందము లిచ్చునట్లు కనబడున వన్నియు అశాశ్వితంబులని గ్రహించి దుఃఖమును లెక్కచేయడు.

8. శరీరము మదించిన వాడును, బలముగలవాడును, యవ్వన ప్రాయములో యున్నవాడును, జాగ్రత్తలేని మందుడును, జ్ఞానశూన్యుడై నిరంకుశ చెడుమార్గములో యున్నవాని చిత్తప్రవృత్తితో పిరికిపందలై జ్ఞానమార్గమును గ్రహింపజాలరు. ఎందులకనగా నట్టివాని సంకల్పములు, భావములు నిర్మలముగా నుండక చంచలముగా నుండు భ్రష్టుడై యుండునని గ్రహించుడు.

9. నరులారా! మీరు ఆలసింపక అశాశ్వితంబగు నేటిపై సంపూర్ణాధికారము పొంది, చిత్తముయొక్క చపలత్వమును తెలిసికొని స్వతంత్రులై మెలగుడు. చెడుపనులను చేయకుడు. త్రికరణంబుగా (మనసా, వాచ, కర్మ) నీ ధర్మత్రయంబు నాచరించు వ్యక్తియే మునిపుంగవు లాచరించు మంచిమార్గమై యున్నది.

10. చలించని ధ్యానము చేసిన లోకాతీత సుజ్ఞానము కలుగును. ధ్యానములో లేని మనసు సుజ్ఞానమునకు దూరమగును. అటుల క్రమంగా జరుగును. కాన జ్ఞానము నశించి పతనావస్థకు చేరును. కాన జ్ఞాన వృద్ధి, క్షయములకు మూలమైన పై రెండు మెళకువలను గ్రహించుడు.

11. చిన్న, పెద్ద కోరికలవీడి పూర్తిగా కోర్కెలను నడవిని పూర్ణంగా దాటిననే సమర్థులైన భిక్షువు లగుదురు. విషయ వికారాటవిని వేగిరమే దాటి భయంకర అంధకార యడవి మధ్యము నుండి వెలుపలకు రండు. సంపూర్ణ స్వేచ్ఛాయుత ముక్తిపదవిని తెలియుడు.

12. వనితా సహచర్యము కొద్దిగానైన మదిలో కోరుట మూఢుడై భ్రాంతిలో యున్నట్లేనని తెలియుము. వనితా సంపర్క వాంఛకూడ విషయాంధకార యడవి యనియే తెలిసికొనుము.

13. మనుజులారా! శరదృతువు నందలి కమలముల త్రుంచుకొను చేతులవలె శుభ్రముగా నుండు మీ హృదయములలో స్వార్థపర చింతనల పిమాత్రము లేకుండ త్రుంచివేసికొనుము. శాశ్వితాభివృద్ధికర సత్యమైన శాంతి మార్గము నవలంభించి శీఘ్రమే నిర్వాణసౌఖ్యమార్గములో పయనించుడు.

14. మూఢుండును, జ్ఞానము లేనివాడును నగు నరపశువు కేవలం నిమీలిత నేత్రుండై ముకుళిత హస్తుడై, పద్మాసనాసీనుడైనంత మాత్రంచేత, మౌనవ్రతం ధరించినంత మాత్రాన మునిచంద్రుడుగా పరిగణింప నర్హుడు కాజాలడు సుమా!

15. మూర్ఖుడు, వర్షాకాలము, శీతాకాలముల చూచి ఇతరఋతువులను చూచెదనని యనుకొనును. కాని భయంకరమైన ప్రాణముపోవుట మెపుడన్నది తెలియకున్నాడు.

16. మంచి ధీమంతుడు, మానవోత్తముడు యీ నిగూఢ రహస్యమును తెలిసి ఓర్పు నేర్పులతో జ్ఞానాన్ని వెంటనే యాలసింపక తెలియవలసి యున్నది. భయంకర చావు వడిలో చేరకముందె బాహాబాహి పోరాటము చేసి ధర్మ సంగ్రామము గెలిచి నిర్వాణ సామ్రాజ్యము ప్రవేశించును.

17. మహావేగముతో ప్రవహించు నీటి వరదలో గ్రామము మునిగిపోయి కొట్టుకుపోయినట్లు ధనము, ధాన్యము చరాచర సంపదలను, పుత్ర మిత్ర కళత్రాది బంధువర్గమునువీడి యకస్మాత్తుగా మరణములో మనుజులు మునిగి పోవుదురు సుమా!

## 21. వివిధ వర్గము (ప్రకీర్ణ వర్గము)

శ్రీ బుద్ధదేవుని ప్రియశిష్యుడగు సారీపుత్రుడు అతిభయంకర చంపారణ్యము లందు తిరుగుచుండెను. అప్పటి కాయన వయసు నలుబది లేక ఏబది వత్సరాల వయసులో నుండెను. సారీపుత్రుడు రేయింబవళ్ళు బుద్ధమహాత్ముని దివ్య బోధను వాడవాడల గ్రామ గ్రామాన ప్రచారము చేయుచుండెను. అట్లు దేశ దేశము లందు ప్రయాణించు చుండెను.

గండకీ నదీతీరమున నొక ఉషోదయములో ఒక బాలభాస్కరునివలె యుండి ప్రకృతి దృశ్యములను ఆశ్చర్యముతో చూచుచుండెను. ఆ నదీప్రాంత ప్రజలు యచటికి వచ్చి తమరు బుద్ధభగవానుని ప్రియశిష్యులై యున్నారనియు, ఆ మహాత్ముని ముఖ్య బోధనలను మాకు బోధించి మమ్ము తరింప జేయుము మహాత్మా యని వేడిరి. అట్లు పరమ వినయశీల మాటలు విని యీ సారీపుత్ర మహాత్ము డిట్లు బోధించెను.

1. అయ్యలారా! బౌద్ధ బోధనలనెల్ల విని మదిలో సంతృప్తి చెందుటే చాలదు సుమా! అట్లే యాచరింతుమని ఉత్తర ప్రతిజ్ఞనలు పలుకుట కూడదు సుమీ! ఆచరణ లేకున్న ప్రయోజన ముండదు. ఆచరణమే మానవకోటిని ఉద్ధరించును. అందుకు దృఢసంకల్ప ముండవలయు సుమా! అట్లాచరించుట యందే యభ్యుదయ ముండును.

2. తత్కాలిక స్వల్పసుఖమును కోరకుము. శాశ్వితమైన సుఖము కొరకై వివేకముతో మానవుడు తత్కాలిక సుఖములుగల కోరికలను విడనాడవలయు సుమీ!

3. నరులకు దుఃఖము కల్గించి స్వంత లాభాపేక్షతో మానవుడు కడు ఘోర దృఢతర ద్వేషపాశములందు బంధింప బడరాదు. అది విముక్తికి యాటంకమై సుఖమునకు దూరము చేయును.

4. చేయతగు ధర్మమునుండి విడిపోవువాడు స్వలాభమునకై యధర్మ యన్యాయ భావముల కల్గియుండును. అట్టివాడు నీతి నియమాలులేని కోరికలచే భ్రష్టుడై పోవును.

5. మంచికార్యముల నభిలషించువాడు చెడుపనులందు విరక్తిగలవాడు ధీమంతుడు, కర్మవీరుడును నగు పురాణ పురుషు డగును.

6. జననీ జనకులపై దయలేక వధించువాడును మహా పరాక్రమ భూపాలుర జంపువానిని ప్రజల రాజ్యమునందు విధ్వంసమొనర్చు బ్రాహ్మణు డైన దండించరాదు.*

7. రాజులను చంపినను, హత్యలు చేసినను, ఉత్తములను చంపినను సద్బ్రాహ్మణుడని శిక్షార్హుడు కాజాలడు.*

పై 6, 7 సందేశములను యాసారీపుత్రుడు వినిపించి వెంటనే, మహోద్వేగముతో, నవి ఘోరమైన అన్యాయములని శ్రీ బుద్ధదేవుడు యానాటి యా బ్రాహ్మణులు చేయుచున్న యన్యాయములను తీవ్రంగా ఖండించి వారి దుశ్చర్యలను విశదంగా జనపదములో బహిరంగముగా చాటెనని తెల్పెను. బ్రాహ్మణులు యేమి చేసినను చెల్లించుకొను చుండెడివారని యానాడున్న దుస్థితిని సారీ పుత్రుడు వివరించి తెల్పెను.

---

*భారతీయ ప్రసముదాయ ఆచారములో బుద్ధ భగవానుని కాలమందు పై విధంగా బ్రాహ్మణులకు దండన లేకుండెను.

8. భ్రాతలారా! బుద్ధదేవుని శిష్యులహోరాత్రములు జాగ్రదవస్థలోనుండి యాదేవుని యుపదేశములను ధ్యానించుచూ కాలము గడుపుచున్నాము అట్లు తిరిగి బోధించుచున్నామనెను.

9. శ్రీ గౌతమ బుద్ధుని శిష్యులందరు అప్రమత్తులై చైతన్యంతో పరిపూర్ణ హృదయులై ధర్మము నాచరించుచూ. ధర్మమే వారి లక్ష్యమై యుండెనుసుమీ!

10. ఆ దేవుని శిష్యులెల్లపుడును జాగ్రత్తతో నుండి దయాదాక్షిణ్యముల గలిగి భూతదయతో నుండిరి.

11. రాత్రింబవళ్ళు బుద్ధదేవుని శిష్యులు చైతన్యులై మంచి బావముతో మంచి యాచరణతో నిరంతరం యా ధ్యానమునందే మనసు నిల్పి జీవించు చుండిరి.

12. సంసార వ్యామోహ బంధనముల నెడబాసి సాధువగుట కష్టతరము. సంసార యాత్రను చింతలులేక గడపుటయు కష్టమే. మూర్ఖులగు సహచరులతో యింటియందు నివసించుటకూడ కష్టమే సుమా! కాన మనుజుడు భిక్షువై మెలంగుటయే మంచిది.

13. ధనవంతుడు, సద్గుణవంతుడు, కీర్తివంతుడునగు వ్యక్తి కేవలం తానున్న స్థానము నందున్న జనులచే మాత్రమే ఆదరించబడును.

14. కాని సత్యమారాధించు సజ్జనుడు బహుదూర ప్రాంతము వరకు ఆరాధించ కీర్తింప బడును.

15. ఏకాంత వాసియు, నీచమైన చంచల మనసును వీడిన వాడును, విషయ వాసనల విడనాడిన వాడును స్థిరజ్ఞానముతోనున్న వాడును. స్థాన, కాల భేదంబులేక సర్వత్రా సుస్థిరానందముతో యుండి అంతటనూ కీర్తించబడును.

## 22. నరక వర్గము (అధోగతి వర్గము)

ఒకానొక దినమందు శ్రీ బుద్ధ భగవానుడు యాత్మీయ సారీ పుత్రునితో భాగీరథీ నదీ తీరంబున నాశీనుడై యుండెను. ఆ శీతల జలములయు మారుతమున యానందించుచు సంధ్యాసమయం గడపుచుండెను. సారీ పుత్రుడును

గంభీర వదనముతో గురుదేవుని అమృత పలుకులకై జాగ్రత్తగా యెదురు చూచుచుండెను. ఆ దేవుడు నిమీలిత నేత్రుడై యాధ్యాత్మిక చింతనమును గురించి మదిలో విచారించుచుండెను. కొంత సేపటికి దేవుడాలోచన విముక్తుడై నరక వర్గమును గురించి యిట్లు తెల్పెను.

1. అసత్య సంభాషణకు యలవడిన వాడును, తాను చెడు కార్యము చేసియు దానిని చేయలేదని యెవరు యెన్నిమార్లు ప్రశ్నించినను తాను చెడు పనిని చేయలేదని బొంకువాడు నరకము చెందుచున్నాడు. పరలోకమునందా యిరువురు వారి చెడునకు కష్టము లనుభవించెదరు.

2. కాషాయంబరధారు లందును, శిరోముండనాది (బోడితలలు చేయించు కున్నవారు) సంస్కృత వేషధారులందును, సహనము లేకను, విషయలంపటు లైన వారును, పాపకార్యాసక్తులును, సాధువులవలె కేవలం కనబడువారు నరకము పొందెదరు.

3. దుర్మార్గుడై, బుద్ధిహీనుడై పాపకార్యాది విషయములందు మునిగి తేలుచున్నవాడు, కష్టించక యితరులనుండి యాహారము పొందుచు బ్రతుకుట కన్న బాగుగా కాగిన లోహమును మ్రింగి మరణించుట మేలు.

4. ధర్మాధర్మ వివేకములేక జీవించుచు చంచలమగు చిత్తవృత్తులకు వశుడై పరుల భార్యల పొందకోరువాడు నాల్గువిధాలైన దండనల కర్హుడు సుమా! (1. అపకీర్తి 2. సుఖనిద్రాభంగము 3. అసహనీయ దండనం 4. అంత్యకాలములో నరకమనుభవించుట).

5. స్థిర నడవడికలేక పౌరుషాన దర్భను అరచేత గిరి కోసుకున్నట్లు సన్యసించినవాడు సహన జ్ఞాన సౌశీల్యము లేనివాడు నరక మనుభవించును.

6. ప్రమాదవస్థయందుకాని నొకడు దుఃఖ సమయమందుకాని, నియమములేని బ్రహ్మచర్యమునకాని మంచి జరుగకోరుట దుర్లభమై నరకము పొందును.

7, మానవుడు చేయతగు ధర్మమగు పనిని యాలసింపక వెంటనే చేయుట శ్రేయస్కరము.

8. దుష్కార్యము చేయకుండుటే యుత్తమ ధర్మం. గతంలో చేసిన చెడుపని వలన దానిని తలంచి పశ్చాత్తాపము చెందుట యుత్తమమై వాడు నరకమునుండి విముక్తి చెందును.

9. మానవుడు మంచిధర్మమని భావించిన కార్యమును యాలసింపక చేయుటయే శ్రేయస్కరమై సుఖము నిచ్చును. అట్లు చేయకుండుట నరకమునకు మూలమగును.

10. సత్కార్యాచరణముయొక్క సత్పరిణామము మానవుని యావరించియున్న దుఃఖభావములను దూరముచేసి తెల్పరాని యానందము నిచ్చును. దుష్కార్యాచరణము వలన మనోవికారముచెంది నరకయాతనము కలుగును.

11. పాలకులు వారి రాజ్యమందు శత్రువులను లేకుండ చేసికొని రక్షించుకొనునట్లు మానవులు నిరంతరం జాగరూకులై తమయందున్న విషయ వికారములను తొలగించుకొనుచుండవలయును. అట్లు చేయనియడల మూఢులై నరకమున పడెదరు.

12. సిగ్గుచేటుగాయున్న పదార్థములనుగాని దృశ్యములనుగాని చూచినంతనే సిగ్గుచెందని మనుజుడు సిగ్గులేనివాడై దుర్గతికి జిక్కి కడు కష్టముల పాలగును సుమా!

13. భయోత్పాతక పదార్థములజూచి భయభీతుండుకాని మనుజుడు దుష్ప్రవర్తనుడై, అసత్యమాడువాడై దుర్గతి చెంది నశించును.

14. బహిష్కరింపగూడని మనుజునికాని పదార్థమునుగాని నిషేధింపని వారు మూఢులై నిస్సందేహముగా అధోగతిలో నరకము బడయుదురు.

15. నిషేధించదగు లేక నిషేధించని యుక్తాయుక్తముల గ్రహించగల ధీమంతులు సన్మార్గులై త్వరితగతిలో మంచిగతిని తప్పక బడసి నరకమునకు దూరమయ్యెదరు.

## 23. నాగవర్గము (దంతావళ వర్గము)

బౌద్ధ ప్రచారక ధర్మ సంఘము చతుర్మాస విశ్రాంత సమయమును పూర్తి చేసి తిరిగి ప్రచారముచేయ స్వస్థానమును విడచి ఆరామడలు వెడలి మహారణ్య మార్గంబున నొక నదీతీరంబున విడిది చేసిరి. అందు బుద్ధదేవుడు నాయకుడై యుండెను.

ఆ నది యావలి యొడ్డున ఒక జమీందారు బుద్ధదేవుని బోధనలను విన తన మందిమార్బలము ఎదురుచూచు చుండెను. ఆ జమీందారుకున్న ఏనుగు లచే బుద్ధదేవుడు తన శిష్యగణముతో ఆ నది యావలియొడ్డును చేరిరి. తరువాత యా నదికి కొద్దిదూరములో నొక ఉద్యానవనమున్నదని తెలిసి అందరును ఆ వనము చేరి పుష్పపొదరిండ్ల సోయగమును తిలకించుచూ యందు విడిది చేసిరి. అపుడు బుద్ధదేవుడు యటచేరినవారి నుద్దేశించి యిట్లు ప్రబోధించెను.

1. యుద్ధభూమిలో యుద్ధవీరులచే ప్రయోగింపబడిన వాడి వేడి బాణ ములచే దెబ్బలు తిని ఏనుగులు ఓర్చుకొని యెట్లుండునో అటులనే చంచల సంసార దుష్ట స్వభావాల వలన బాధచెందక ఓర్పుతో, నేర్పుగా వానిని తప్పించుకొని జీవించువాడే శ్రేష్టుడగును సుమీ!

2. చాలకాలము వరకు పోషింపబడిన ఏనుగు నెక్కియే రాజు యుద్ధ మునకు బయలుదేరును. అన్నివిధాలైన మచ్చిక యున్ననే రాజు ఏనుగు నెక్కి నిర్భయుడై యుండును. అటులనే శాంత హృదయుడైనవాడు నిందా వాక్యము లను సహించియే సంసారి యుండుటే మానవకోటిలో శ్రేష్టుడనబడును.

3. యుద్ధరంగమున యెట్లు ఏనుగులును, గొప్ప సింధూదేశ గుఱ్ఱములే ఉపయోగపడునట్లు మానవ జీవిత యుద్ధ రంగములో ఆత్మ నిగ్రహము కల్గి యుండువాడే పురుషోత్తము డగును. ఏనుగుల, గుఱ్ఱముల పోషించుటకన్న ఆత్మేంద్రియముల జయించి సాధించుటయే శ్రేయస్కరము.

4. పశువులయట్లు పోషించుటకన్న అత్యంత కష్టతరమైన మార్గము నిర్వాణమై యున్నది. ఓర్పుతో యుండు సహజత్వమును సాధించుటయే ఉత్తమం. అట్టి ఇంద్రియ నిగ్రహముచే బాహ్య ప్రపంచ విషయ యుద్ధమున విజయం సాధించుటే ఉత్తమ నిర్వాణ మార్గము చేయుట.

5. నిరంతర గండములచేయుండు ఏనుగువలె మదమనే గర్వమును, ధనపాలనా గర్వముండువాడు స్త్రీయాది ఇంద్రియ నిగ్రహముతో జీవిత గజమును (సంసారమను ఏనుగును) నిగ్రహించి బంధించినదె నిర్వాణ మార్గమునకు యుత్తమమగును.

6. పరమ లోభియు, స్థూలకాయుడును, కుంభకర్ణునివలె నిద్రాసక్తుడును మందబుద్ధి గలవాడునగు మూర్ఖుడు మలమాది నీచములతిని జీవించు పందివలె యుండి చీటికి మాటికి చావుపుట్టుకలలో బాధలు పడక తప్పదు.

7. ఒకప్పుడీ నా మనసుకూడ స్వేచ్ఛా విహారములో యుండినది. ప్రధానేంద్రియము మనస్సు. దాని ననుసరించియే మిగతా యింద్రియములు మెలగుచుండును మావటీడు వాడియైన యంకుశముచే మదగజమును అదుపు చెయునట్లు నేను సహితం నిర్దాక్షిణ్యముగా, ఓర్పుతో మనసును అణచి వశము చేసికున్నాను.

8. మానవుడా! జాగ్రత్తగా నుండుము. మనసును ఎపుడును స్వేచ్ఛగా నుండ వదలకుము. వశము నందుంచుకొనుము. అగాధమునందు ఏనుగు పడిన బయటికి ఎట్లు రాజాలదో తెలియుము. ఆ ఏనుగు విధమున నిన్ను నీవే చెడుమార్గము నుండి రక్షించుకొనుము.

9. బుద్ధిమంతుడును, గ్రంథ జ్ఞానము గలవాడును, మంచి చెడులను బాగుగా తెలిసిన వాడును, సదాచార సంపన్నుడును, సమస్తవిధ కష్టముల ఓర్పుగా దాటిన వానిని, దొఱకిన యట్టివానిని వెంబడించుము.

10. సత్యవంతుడును, మంచి నడవడికగల మిత్రుడు దొరకనియడల మదగజ మరణ్యమంత తిరుగునట్లుగాక ఏకాంతమైన ఓర్పు సహనములతో ఒంటరిగానైనగాని జీవించ తగును.

11. మూఢజనమైత్రి మోసమును కలుగజేయును సుమా! అట్టి స్థితిని కోరకుము. మానవుడు దురాచారములేక సద్బుద్ధితో ఒంటరిగానైన యడవియందున్న ఏనుగుఒకటే యుండి జీవించునట్లు జీవించ తెలియుము.

12. మాటలతో గాక బాధలందు సహాయము చేయు సహృదయులే శ్రేష్ఠులు సుమా! అంతిమావస్థయందు సత్కర్మలాచరించుట సౌఖ్యదాయకం. మనోవికార త్యాగమే మహదానందప్రాప్తికి మూలం.

13. మాతృధర్మము మంచిది. పితృధర్మం ఆనంద ప్రదము. సన్యాస స్వీకారము లోకాతీత ఆనందమయుం. అదే బ్రాహ్మణధర్మ పరిగ్రహణ సహితం.

14. మానవుడు బాల్యమాదిగ ముసలితనం వరకు మంచి నడత కలిగి యుండుట శుభప్రదం. నిష్ఠతో నుండుట ఆనందకరము. సుజ్ఞాన సంసారం కూడ ఆనందమయమే. దుష్కార్యాచరణ లేకుండుటే మానవుని కతిముఖ్య మార్గం సుమా!

## 24 తృష్ణావర్గం (కోర్కెల వర్గం)

ఒకనాడు శ్రీ బుద్ధ భగవానుడు ధర్మతత్త్వ ప్రచారము చేయుటకై వైశాలి నగరమునకు వచ్చుచున్నాడని యా నగర మందాబాలగోపాల ముప్పొంగి అతిశయ యానందములతో కలకలములో నుండెను. ఆ నగర మెలుపలయున్న యతిసుందర ప్రకృతి రమణీయముగా నుండెను. అచట పెద్దపర్ణశాల నిర్మింప బడెను. అందుండ దేవుని కోరబడి యుండెను. అందే సభ జరుగ నుండెను.

అనుకున్నట్లు సూర్యుడు పశ్చిమాన మునుగు సమయాన బుద్ధ దేవుడు శిష్య బృందముచే వచ్చెను. దేవుని కుడిచేతిలో భిక్షాపాత్ర ముండెను. పాదములు ధూళితమై యుండెను. ముఖమునందు గంభీరముగ తేజోవంతమై వెలుగుచుండెను. విశాల కనులనుండి అపురూప కాంతిరేఖలు వెలుగుచుండెను. సమస్త సంసార ప్రాణికోటి దుఃఖభారమును తన తలపై వేసికొని మోయు చున్నట్లు శ్రీ బుద్ధభగవానుడు దయార్ద్ర హృదయుడై ఆనందముతో వైశాలి నగర ప్రజావళి స్వీయప్రేమాంచితుడై చూచి యిట్లు బోధింపసాగెను.

"బౌద్ధ ధర్మోపదేశములలోకెల్ల తృష్ణ విసర్జనమే ప్రధానము. తృష్ణ (కోర్కె) బహిష్కారమే ముక్తికన్యను వరించినట్లగును. తృష్ణ యనునదే హలాహలముకన్న మిన్న. కోర్కెల విడుటే మానవుని సర్వోత్తమ ధర్మము. అట్లు చేసిన మానవుడు చేయదలచినదెల్ల చేసినట్లగును సుమా! ఆ మార్గమునే బోధించెద వినుడు" అనెను.

1. వివేకశూన్యుడై, మందుడై యున్నవానికి కోర్కెలు వసంతఋతువు నందు పెరుగుచున్న కోమల తీగవలె పెరుగుచుండును. కోతి యొకచెట్టుకొమ్మ నుండి మరొక కొమ్మకు ఎగురుచూ, ఒక చెట్టునుండి మరొక చెట్టును ఎగ్రబాకు చున్నట్లు అనేక కోర్కెలతో జన్మలు యెత్తుచూ తిరుగు చుండును.

2. మానవుడా! నీవు విషపూరిత, దుష్ఫలదాయకమగు తృష్ణ (కోర్కె) కు బద్ధుడవు కాకుము. కోర్కెలు కోరుటకు బద్ధుడవైయున్న దుఃఖసముదాయము అతిశీఘ్రంగా గడ్డివలె పెరుగును.

3. కోర్కెలు లేకుండ చేసికొనుట భయంకరమైన మహాకష్టమే. కాని యట్టి విషయ తృష్ణ (కోర్కె) ను తన వశము చేసికొనుటయే వివేక సంపన్నుని లక్ష్యం కావలెను. అట్లు కానిచో విషాదములంబడి వారు నశింతురు.

4. ఇచట సమావేశమైయున్న మీ యందరి హితము కోరియే యిటు తెల్పుచున్నాడను. నా యీ మాటల వినుడు సుమా! మీ యందున్న నీచకోర్కె బీజముల హృదయాల నుండి నా మాటవిని వానికి దూరంకండి! ఏలననగా వట్టి వేరుల సుగంధం కావలయునన్న యా గడ్డిని కూకటివేళ్ళవరకు పెఱకవలయు సుమా! అట్లు మీ యందున్న కోర్కెలను నామరూపాలు లేకుండ మీ నుండి పూర్తిగా తొలగించుకొనుడు. అట్లు చేసికున్న మీాదట భయంకర రూపధారిణి యగు మృత్యు (చావు) దేవత మిమ్ముల బాధింప జాలదు.

5. వృక్షమును నరికినంత మాత్రాన యవి శుష్కించి నశించి పోదు సుమీ! భూమి యందున్న వ్రేళ్ళతోయున్న మొదలు నుండి త్వరగా అది చిగుళ్ళు తొడిగి పెరుగ నారంభించును. తిరిగి మొదటి యాకారమునకు రాగలదు. కాన కోర్కెలున్న తిరిగి జన్మ తప్పదు.

6. కోర్కె మనసుతోయున్న మనుజునికి (36) ముప్పదియారు ప్రవాహ ములు లౌకిక సౌఖ్యము వైపునకు యాకర్షించు చుండును. విషయవికార భరితంబగు నా ప్రవాహముల తేలియాడు వ్యక్తి నందలి చంచలముతో కూడిన

వట్టివేర్లు = సువాసనతో యుండు గడ్డి వేర్లు

కోరికలు వరుసగా నొకదానివెంట నొకటి తాకి వానిని ముంచివేయుట వాస్తవం సుమా! 36 ప్రవాహము లేవనగా :- 1) కన్ను 2) చెవి 3) ముక్కు 4) నోరు 5) మనస్సు 6) శరీరము 7) రూపము 8) శబ్దము 9) వాసన (గంధము) 10) రసము 11) స్పర్శము 12) ధర్మము ఈ పండ్రెండును ఇంద్రియ ప్రవాహములు. ఈ పండ్రెండును కామతృష్ణ భవతృష్ణ వైభవతృష్ణ లను మూడు విధముల యున్నది.

పై వానిలో ఒక్కొక్కటి మూడు విధములు కాన అట్లు $12 \times 3 = 36$ ప్రవాహము లగును.

7. అట్లు కోర్కెయొక్క శాఖలు నీలో నలుదిశల వ్యాపించును. ఆ ప్రవాహము లందు విషయవాసనలు దిన దినము తీగవలె వేగముగ పెరుగ నారంభించును. వెంటనే నీ వపుడు సుజ్ఞానమనే గొడ్డలి చేబట్టి వానిని నామ మాత్రంగానైనా లేకుండ ఖండించితీర వలయును.

8. నరుని విషయ సుఖాభిలాషలు విలాసమయంబులై ఎల్లకాలం వీడక నుండును. అవ్వానియందే సౌఖ్యమున్నదని భ్రమించి వానికి వశీభూతుడై తిరుగు నరుడు వెంటనే జనన మరణ చక్రంబునబడి తిరుగును.

9. పిల్లి కంట బడిన కుందేలు తప్పించుకొన నిటునటు పరుగులిడుచు భయముతో నున్న కుందేలు విధమున కోర్కెయను త్రాడుచే బంధింపబడునట్లు దుఃఖ పరంపరలకు గురియై దుఃఖించును.

10. వదలరాని తృష్ణాపాశములచే బంధితుడైన వ్యక్తి వలలో జిక్కి తనకలాడు కుందేలువలె నటు నిటు పరుగులిడినా దానినుండి బయట పడలేక యేడ్చుచుండును. ఆశాపాశ బంధములనుండి సంపూర్ణ విముక్తి నొందగోరువారు తమ శక్తికొలది విషయ వాసనలను నాశనము తమకుతామే చేసికొనవలయును.

11. విషయ వికార కూడికలతొ (కోర్కెల గుంపుతో) యున్న యరణ్య మున చిక్కుపడిన వ్యక్తి ప్రయత్నంబున విముక్తినొంది, మూర్ఖుడై తిరిగి విషయ వాసనలలో ప్రవేశించిన శాశ్వతంగా బహు కోర్కెలతో పలు దుఃఖముల శాశ్వితంగా పొంది తప్పించుకొనలేక నశించును.

12. వివేకవంతులు యీ కోర్కెలను కఠిన పాశములుగా భావించక సులభంగానే త్రెంచుకొనియుదరు. కామినీ, కాంచన, సంతానైశ్వర్యాది సంసారిక వాంఛలే గట్టిగా బంధించివేయును. వివేకులు వాని జయింతురు.

13. విషయ వాసనా శృంఖముల బంధనమును త్రెంచివేయు నరుడు కోర్కెలను, సుఖభోగములను సంపూర్ణముగ త్యజించి సమస్త విషాద సంకట ముల నుండి విముక్తుడగును.

14. సాలీడు తానల్లిన గూటి దారముయొక్క సహాయముననే భూమిపై పడిపోవునట్లు, కోర్కెలున్నవారు యీ ప్రవాహంబుననే పడి కొట్టుకొని పోయెదరు. కోర్కెల బంధనమును త్రెంచుకున్నవారు వైరాగ్యము నవలంభించి సంసారము నుండి సంపూర్ణంగా తరించిపోయెదరు.

15 ఓ మానవుడా! సంసార సాగర తరంగంబులనుండి దాటి యావలి యొడ్డు చేర ప్రయత్నించవలయును. నీకు ముందు వెనుకయున్న కోర్కెల (తష్ణల) వీడి దాటుము. అనగా భూత భవిష్యత్తులలోనున్న కోర్కెలనెల్ల వదలుము. అట్లు నీ మనస్సు సంపూర్ణంగా సంసారమునుండి విముక్తిపొందును.

16. చిత్తమున వ్యాపించియున్న సందేహ (అనుమానాలు) సముదాయము లేకుండ చేసికొని సర్వదా పవిత్రంబగు యానందముతోనుండి శరీరముయొక్క మలవాసనాదుల దుఃఖమయంబుగ భావించి గ్రహించు వ్యక్తి సత్తముడు. కామాంధుడు కాజాలడు. అట్టివానికి దుఃఖాది మనోసంకటము లుండవు.

17. పూర్ణావస్థ (నిర్వాణదశ) కు సమీపించి నిర్భయుండును, రాగ రహితుండును, దోష శూన్యుండును నగు పరిశుద్ధ హృదయుడు సమస్త విధ సంసారిక కంటక దూరుండై యీ జన్మతోడనే ముక్తి లభించును.

18. నేను సమస్తమును జయించినాడను. నేను సర్వజ్ఞుడను. జీవిత ప్రాయు యొక్క సర్వ యవస్థలయొక్క దశలను జయించినాడను. నేను సమస్తమును త్యజించినాడను. విషయవాసన లన్నింటిని నిర్మూలించితిని. కాన నేను విముక్తుడ నైతిని నేను స్వయంగా శిక్షణ పొందినాడను. కాన నే నెవరిని శిక్షింతును?

19. సమస్త దానములందును ధర్మ దానమే సర్వోత్తమమైనది. అదియే కల్యాణకరమైనది. సమస్త మాధుర్యములలోకెల్ల ధర్మరస మాధుర్యమే మిన్న సుమీ! సర్వ విధమగు యానందములలోకెల్ల ధర్మముచే వచ్చు యానందమే యుత్తమం శ్రేష్ఠమైనది. విషయ వాసనల సమూలంగా నాశనము చేసికొనుటయే సమస్త భయ దుఃఖనివారిణి యగును. తృష్ణా విసర్జనమే మానవుని కర్తవ్యం సుమా!

20. గడ్డి గాదములచే భూమియందలి పైరు వ్యర్థమగును కదా! కామ్యముచే (కోర్కెచే) మానవుడు భ్రష్టుడై పోవుచున్నాడు. కాన నిష్కామ్యములున్ను, దయార్ద్ర హృదయులున్ను నగు సత్పురుషులకు ప్రసాదించిన దానము శ్రేష్ఠ ఫలదాయక మగును.

21. తుంగ మొదలగు గడ్డిచే పొలము చెడిపోవుచున్నది. గర్వముచే మానవజాతి పతనమగుచున్నది. కాన గర్వములేని వారి కర్పించిన దానముత్కృత్తమ శుభ ఫలంబిచ్చును సుమీ!

22 గడ్డి వలన పైరు భూమి చెడిపోవుచున్నది. అట్లు కోర్కెల (తృష్ణల) చేత మానవలోకం పతనమగుచున్నది. కాన కాంక్షాశూన్యుల కిచ్చిన దానము శుభదాయక ఫలము నిచ్చును సుమీ!

## 21. భిక్షు వర్గము (శ్రమణ వర్గము)

ఒకానొక దినమందు శ్రీ బుద్ధ భగవానుని చెంతకు యిక్ష్వాకు వంశ రాజకుమారులు యిరువురు బౌద్ధమత దీక్షా బద్ధులగుటకు వచ్చిరి. వారు వారి నివాసముల నెడబాసి నేరుగా బౌద్ధ విహార మందిరమునకు వచ్చి చేరిరి. ఆ సమయంలోనె బౌద్ధమత దీక్ష నవలంభింప వచ్చిన జనుల కెల్లరకు భిక్షు ధర్మ తత్త్వమును గూర్చి మృదుమధురంబుగ యెల్లరికి యర్థమగు రీతిగా యిట్లుపదేశించెను.

1. ఓర్పుతో చూచుట (దృష్టి) సుఖకరము, నిదానముగ వాసన చూచుట సుఖవంతమైనది. వినుటలో తొందర పడకుండుట సౌఖ్యదాయకమగును. నిదానముగ రుచి చూచుట భవ్య మార్గము. ఈ చతుర్విధ (నాలుగు విధాలైన) యింద్రియములను వశపరచుకొనుట మహత్తర సౌఖ్యమునకు మూలము.

2. దేహమును, వాక్కును (మాటను) మానసమును వశీభూతము గావించుకొనుటయే మంగళప్రద కార్యమగును. సమస్త విధముల ఆత్మ ఓర్పును కల్గియుండుటయే మానవునకు శ్రేయమగును. అన్ని విధముల ఓర్పుకొను జీవించు భిక్షువే సకల దుఃఖములనుండి విముక్తుడై సుఖించును.

3. సమస్త విధములందును ఓర్పు గలిగియుండి సమస్త యింద్రియము లపై పూర్ణాధికారమును వహించియున్నవాడును, స్థిరచిత్తుండును, మనోతృప్తి గలవాడును ఏకాంతవాసియు (భార్యా పిల్లలు లేక) సంతృప్తిగా జీవించువాడే భిక్షువనబడును.

4. మాట్లాడుట వశము నందుంచుకొని శాంతబుద్ధి తోడను, మేధాశక్తితో మాటలాడుచు, జనుల మనసుల నాకర్షించుచు, ధర్మతత్త్వ హితోపదేశముల చేయుచు, మెలగు భిక్షువే భావాతీత మధురముగా భాషించువాడై యుండును.

5. ధర్మవివేచనా పరుండును, ధర్మచింతనయందే హర్షము నందు వాడును, ధర్మతత్త్వ తార్కికుడును, ధర్మ సిద్ధాంతమున కనుకూలముగా నడచుకొనువాడు, బౌద్ధ పరివ్రాజకుడు సత్యధర్మ స్థానమునుండి భ్రష్టుడు కాజాలడు.

6. ప్రాప్తించిన కొద్ది (చిన్న) పదార్థమైనను భిక్షువైనవాడు యద్దానిని నిరసన భావముతో చూడరాదు. పరులకున్న దానిని జూచి వ్యసన పడరాదు. పరులను చూచి ద్వేషించరాదు. అట్టివాడే భిక్షువు.

7. తనకు లభించిన కొద్ది (చిన్న) పదార్థమునైనను నిరసన భావముతో జూడక నదియే మహాప్రసాదంబని భావించి మహదానందముతో స్వీకరించ వలయును. పరిశుద్ధాచరణుడై యుండవలెను. నిరంతరం ఏదోనొక పనిలో నిమగ్నుడై యుండవలెను. అట్టి భిక్షువును దేవతా బృందములుకూడ స్వాగతింతురు.

8. అశాశ్వతమైన భ్రమాన్వితమైన నామరూపాది వికారంబుల యొప్పు కొనక పరిశుద్ధ హృదయుడై యుండవలయును. గతించిన కాలమును గురించి దుఃఖించని భవిష్యత్తును గురించి సంతసించని ధీరుడైన వ్యక్తియే ఉత్తమ భిక్షువగును.

9. సహజ దయార్ద్ర హృదయుడును సర్వకాల సర్వావస్థల బుద్ధోపదేశ ముల సుస్థిరచిత్తుడై వర్తించునట్టి వానికి సమస్త దుర్వాసనా సముదాయము నశించును. అట్టివానికి ఇహమున అమిత సౌఖ్యము లభించి మరియు శాంతి లభించి నిర్వాణ మతి సులభంగా లభించును.

10. ఓ భిక్షువా! సంసారసాగరమున ప్రయాణించుచున్న నీ జీవన నౌకను రాగద్వేషాది కల్మషభావముల నుండి దాటించుము. అతివేగముగా నీ జీవిత నౌకను నిర్మాణ మార్గంలో నడిపించుము. సంసార సాగరమును దాటి నిర్వాణము పొందుము.

11. ఓ శ్రమణుడా! ఆనందచిత్తుడవై ధ్యానము సలుపుము. స్వేచ్ఛాచారివి (మందుడుగా నుండక) కాకుము. క్షణభంగురమైన తుచ్ఛ కామాది సౌఖ్యపదార్థంబులపై ప్రీతిగా దృష్టిని ప్రసరింప జేయకుము. నిరంకుశుడును, అజాగ్రత్త గలవాడును మరుగులోహద్రవమును మ్రింగినట్టిబాధ ననుభవించును. ఓ భిక్షువా! యీ దుర్గతికి చేరకుసుమా!

12. ఓ శ్రమణుడా! పంచేంద్రియముల నణచివేయుము. ఐదు రకముల పాశముల ఖండించి వేయుము. పంచేంద్రియములపై ఓర్పు సహనములనే యధికారము కల్గి అన్ని యింద్రియ బంధముల నుండి విముక్తి చెందిన భిక్షువే సంసారసాగరమును జయించ గలడు సుమా!

13. జ్ఞానము లేనివానికి ధ్యానము లభింపదు సుమా! ధ్యానము లేనిదే జ్ఞానము రాదు. ధ్యాన, జ్ఞాన సంపన్నుడగు భిక్షువు అతిసులభముగ నిర్వాణమును సమీపించును.

14. శాశ్విత నిర్వాణ పదమును బడయు వ్యక్తి పొందు సౌఖ్యానందములను పంచభౌతికంబగు శరీరోత్పత్తిని గూర్చియు శరీర నాశనము గూర్చియు జ్ఞానము కల్గిన భిక్షువు అతిత్వరలో నిర్వాణము చేరును.

15. నిరంతర పరోపకారము నందును, నిరంతరం ధర్మకార్యాచరణము నందును ప్రేమమయ జీవిత నిర్వహణమున యీ భూమిపై భిక్షువునకు ప్రాప్తించిన లౌకికంబగు మహదానందమే వానికి కలుగు చుండును. దుఃకాదిభయ రోగాదులు నశించును.

16. ఓ భిక్షువులారా! వసంత కాలము ముగియగానే పువ్వులు వాడి పోవును. కాన వానిని వదలునటులనే వేగముగ కోరికాది వైరములను వదలి వేయుడు.

17. ప్రశాంత త్రికరణములగల్గి సుస్థిర చిత్తముకల్గి సంసారిక విషయములకు దూరమైనవారే భిక్షువులై శాంతిదాంతితో వర్ధిల్లుదురు.

18. శ్రవణుడా! నిన్ను నీవే స్వయంగా జాగరూకుడవై రక్షించుకొనుము. కారణమేదైనా మానవుడు తనకు తానే అధిపతిగా నున్నాడు. తన్నునానే తరింప జేసికొనుటకు బాధ్యుడైయున్నాడు. స్వయం యాధిపత్యమే శరణ్యాం సుమా!

19. స్వయంగా ఆనందచిత్తుడై బుద్ధోపదేశముల నిశ్చల హృదయంతో ఆచరించు భిక్షువే సంసారమును పటాపంచలు చేసికొనును. శాశ్వతముగాను, ఆదిమధ్యాంత రహితంగాను, నిర్వికారముగాను సుస్థిరానంద శాంతి నిలయంబు నగు నిర్వాణమును ప్రాప్తింప జేసికొనును.

20. పరమపవిత్రంబగు బుద్ధుని ఉపదేశములను, ధర్మములను సంపూర్ణానందచిత్తుడై యాచరించు భిక్షువే అల్పప్రాయుడై యున్నను క్రొత్త నల్లని మేఘాల చీల్చుకొని యగుపడు చంద్రుని ప్రకాశమువలె సంసార మత్యంత తేజోవంతముగా జయించి ప్రకాశించును.

## 26, బ్రాహ్మణవర్గము

జడలుగట్టిన వెంట్రుకల జుట్టుతోయున్న విష్ణుమిత్రుడను నొక ముని బాలకుడు తండ్రి యాజ్ఞచే హోమాగ్ని సమిధలకై ఒక వనమున ప్రవేశించెను. ఒక చెట్టుక్రింద యుచట ఒక బౌద్ధ సన్యాసి బోడితలతో కాషాయ వస్త్రధారియై సాక్షాత్తు శంకరునివలె కండ్లు మూసికొని ధ్యాన ముద్రతోయున్న నొక బౌద్ధ సన్యాసిని యా బాలుడు చూచెను. ఆ విష్ణుమిత్రుడంతకు మునుపెన్నడూ బౌద్ధసన్యాసుల చూడనివాడుకాన మిక్కిలి యాశ్చర్యపడెను. ఆ బాలుడు యా సన్యాసిచెంతన చేరి కూర్చుండెను. తన తండ్రివలన భూమి నలుదిశలా బుద్ధ దేవుని పేరుప్రతిష్ఠలు వ్యాపించినవని వినియుండెను కాని ఆయనను చూడలేదు. ఆయనే బుద్ధదేవుడేమో యని అనుమానించెను.

అంతలో యా సన్యాసి కండ్లు దెఱచి చూచెను. ఆ బాలుడాయనకు నమస్కరించెను. మరియు 'స్వామీ మీరెవర'ని ప్రశ్నించెను. ఆ సన్యాసి తాను శ్రీ బుద్ధదేవుని శిష్యుడనని తెల్పెను. మరుదినముదయకాలమందే విష్ణుమిత్రుడు తన తండ్రి యనుమతి పొంది తిరిగి యా సన్యాసి దగ్గఱకు వచ్చి బౌద్ధ విహారమునకు పోవు యా సన్యాసిని వెంబడించెను. సాయంకాలమునకు బుద్ధదేవుడున్న విహారమునకు యా సన్యాసితో చేరెను. అచట చేరిన జనులకు మృదుమధుర పదజాలముతో బ్రాహ్మణుడన నెవరో యిట్లు శ్రీ బుద్ధదేవుడుపదేశించ ప్రారంభించెను.

1. ఓ బ్రాహ్మణుడా! విషయవాసనలకు లోనుగాక ధైర్య స్థైర్యములతో యెదిరించుము. సమస్త వాంచల నిర్మూలింపుము. సంసార మార్గమున పుట్టిన లేక లభించిన సమస్త పదార్థములను యశాశ్వితములని నీవు తెలిసికున్నప్పుడే నిర్మించరాని శాశ్వితంబగు నిర్వాణమును తెలిసికొనెదవు సుమా!

2. ఆత్మనిగ్రహముతోడను, ధ్యానముతో ధర్మతత్త్వముల సంపూర్ణముగ తెలిసి జ్ఞాన సంపన్నుడవైననే బ్రాహ్మణునియొక్క సమస్త విధ సంసార మోహ పాశంబులు తునాతునకలై నశించును.

3. ఏ పురుషున కీవలి యావలి తీరముల భేదము నశించినదో అట్టి నిర్వికార చిత్తుడగు ముఖ్యపురుషోత్తముని నేను యదార్థమగు బ్రాహ్మణుండగునని నేను నొక్కి చెప్పుచున్నాను.

(ఈవలి యావలి తీరమనగా లోనున్న మరియు బాహ్య ఇంద్రియములని అర్థము) సంసారమున జన్మచేతనే బ్రాహ్మణులమని విఱ్ఱవీగు వారు తమ్ముతామే అల్పులుగా భావించు చండాలు (కడజాతి) కన్న నింద్యులు, కల్పిత వేషధారి బ్రాహ్మణుడు కాజాలడు

4. విచారశీలుండును, నిష్కళంక చరితుండును, సుస్థిర చిత్తుండును, సహజ దయార్ద్ర హృదయుండును, కర్తవ్య పరాయణుండును, విషయవికార బంధన విముక్తుండును, ఉన్నత ఆదర్శప్రాయుడును నగు పురుషవరేణ్యునే నేను వాస్తవంగా బ్రాహ్మణుడని రూఢిగ సిద్ధాంతరీకరింతు ననెను.

5. సూర్యభగవానుడు పగటివేళనే ప్రకాశించును. అటులనే చంద్రుడు రాత్రివేళలందే వెలుగునిచ్చును. కవచము ధరించుట వలననే వీరుని ముఖార విందములో వీరరస మొలకించును. బ్రాహ్మణుడు నిరంతర ధ్యాన భక్తిచే ప్రకాశించును. కాని బుద్ధుడు సర్వకాల సర్వావస్థలయందు యఖండ దివ్య జ్యోతివలె వెలుగుచుండును.

6. పాపజాలమునుండి సంపూర్ణముగ విముక్తి చెందినవాడు బ్రాహ్మణుడు, శాంత స్వభావ విరాజితుడే శ్రమణుడు. మనసులో మాలిన్యము లేనివాడే పరి వ్రాజకుడు యని యనబడును.

7. బ్రాహ్మణుని హింసింపకూడదు. మూఢుడెవడైనను తన్ను హింసించిన బ్రాహ్మణుడైనవాడు హింసించిన వానిపై క్రోధము వహింపరాదు. బ్రాహ్మణుని హింసించినవాని జీవితమహంకారముచే యెదిరించబడును. తన్ను హింసించిన మూఢుని తిరిగి హింసింప తలంచరాదు. అట్లు హింసింప బూనువాడు యవ మాన పాలగును.

8. సంసార సుఖభోగ పరిత్యాగము గావించి మెలగు బ్రాహ్మణుడు నిశ్చలా నందము పొందును ఇతరుల కపకారము చేయకూడదని తెలిసి యట్లాచరించు వానికి దుఃఖములు వదలి పోవుచుండును. పరుల దుఃఖింపజేయు చిత్తప్రవృత్తి నిర్మూలింప బడినంతనే మానవునికి వచ్చు దుఃఖబాధలు సహజముగనే దూరమగును.

9. మనోవాక్కాయంబుల యందును కోపముజెందక శాంత చిత్తుడై సమస్త విధముల యాత్రికరణంబుల యందును ఓర్చుకొనునట్లుండు వ్యక్తినే నేను బ్రాహ్మణుండని నొక్కి వక్కాణింతును.

10. హోమాగ్ని జ్వాలలజూచి పరమానంద మొందు పూర్ణ హృదయుడై బ్రాహ్మణుడు నమస్కరించు విధముగనే జ్ఞాన ప్రబోధముతో ధర్మతత్త్వజ్ఞానము కల్గించునట్టి పురుషోత్తముని జూచినంతనే యెల్లరు పూజింతురు.

11. మానవుడున్నతకులమందు పుట్టినా, జడధారియైనా బ్రాహ్మణుడు కాజాలడు, సత్యధర్మ శౌచమాది సద్గుణంబుల చేతనే పూజ్యుడు కాగల్గును. అట్లు కాని బ్రాహ్మణుడు నింద్యుడే సుమీ! చిత్తశుద్ధి యన్నసేమో యెఱుగని

జటాజూటముతో చర్మ కౌపీనము ధరించినను నీకు కలుగు లాభమేమిటి? అట్టివానిలో కోర్కెలు వృక్షమువలె పెరిగి మనసు క్షోభ జెందువానికి మనసు యల్లకల్లోలమైయుండి యభిమానము పెరిగియుండ బాహ్యావేషాడంబరము కీడు కల్గించును సుమా!

12. చినిగిన లేక మాసిన వస్త్రముల ధరించినను రూపురేఖలందు బాగుగా లేనివాడైన యేకాంతముగ నొక ప్రదేశమున నిశ్చల ధ్యానము నందుండు స్థిత ప్రజ్ఞునే నేను తిరిగి బ్రాహ్మణుడన నెవరో తెల్పుచున్నాను.

13. జన్మవలనగాని ధనిక కుటుంబములో జన్మించినవాడుగాని బ్రాహ్మణుడు కాజాలడు. అట్టివాడు నిజం తెలిసిన శ్రీమంతుడుగనే యుండును. గర్భ దరిద్రుడైనా సర్వసంగ పరిత్యాగ హృదయుడై యున్నవాడే యదార్థ బ్రాహ్మణ శ్రేష్ఠుడనబడును.

14. సమస్త బంధనముల త్రెంచుకున్నట్టియు, నిర్భయంగా నిస్సంగుడై యున్నట్టి సర్వవిధ తృష్ణలను ఖండించి వేసికొనియుండు బ్రాహ్మణుడే భూసురుడని నేను సిద్ధాంతీకరించుచున్నాను.

15. ద్వేషమనెడు రజోగుణమును, రాగమనెడి బంధనమును, యశ్రద్ధ యనుబంధనమును మరియు వానితో సంబంధమున్న సమస్త బంధములను యజ్ఞాన మనెడి యాటంకమును కోర్కెలనెడి యాపదలను విడనాడి జాగ రూకుడై నిరంతరం మనో స్వాధీనుడై యుండువానినే నేను బ్రాహ్మణుడని చెప్పెదను.

16. ఒకడెట్టి యపరాధము చేయబోయినను, తనపై దుర్మార్గులు నిష్ఠూరమైన నిందా వాక్యములను బాణములవలె కురిపించినను మహదానందముతో సహించు నట్టి సహనము ప్రవాహమువలె యుండునట్టి క్షమాన్విత ధైర్య స్థైర్యగలవారినే బ్రాహ్మణ పురుషోత్తము డనబడును.

17. శత్రుత్వము లేనివాడును, కర్తవ్య బాధ్యతలు గలవాడైనట్టియు, సదాచార సహితుండును, కోర్కెలు లేనివాడును, నిదానము ఓర్పుగలవాడును పత్యమగు బ్రాహ్మణుండని తెల్పుచున్నాను.

18. కమలదళముపై నుండు మంచుకణమువలె సూదిమొనపై ఆవగింజవలె యున్నట్టియు నల్పమైన విషాద ప్రమాదకరంబగు విషయ సుఖంబులకోరని, ధీరవరునే నేను యదార్థ బ్రాహ్మణుడగునని తెల్పుచున్నాను.

19. ఇహలోకమందే, శరీరముండగనే దుఃఖమును త్యజించి విషయ వాసనా భారము నెదిరించి యన్నిబంధనములనుండి విముక్తిచెందిన వానినే నేను బ్రాహ్మణుండని విశదపరచుచున్నాను.

20. గృహస్థులందును భిక్షువులందును, భేదభావము లేక యెల్లెడ యెడ సమానముగ మెలగుచు యందరివలెగాక యెల్లపుడును యాచింపక కోర్కెల్ని విడి పరులనుండి యల్పమునే స్వీకరించుచు తృప్తిచెందుచున్నట్టి మనుజుడే బ్రాహ్మణుండని నేను ప్రకటించుచున్నాను.

21. చిన్న ప్రాణినిగాని, పెద్దప్రాణులగాని యే విధంబుగా నైన బాధింపక స్వయముగా హింసించి జీవించునట్లుగాక హింసను విసర్జించి యేహత్యగాని చేయు భావములుండక, యట్టికర్మలు చేయక సత్వగుణ సంపన్నుడైయుండు నతడే నిజ బ్రాహ్మణుడని తెల్పుచున్నాను సుమీ!

22. కోర్కెలులేని సత్యపురుషుడై యే సందేహము లేని నిర్మలానంద నిర్వాణపద మార్గము చేకొనువాడు నగు ధీరవరుడే నేను బ్రాహ్మణుండగునని తెల్పుచున్నాను.

23. ఈ లోకమునందే పాపపుణ్య బంధనముల విడనాడి, దుఃఖవిషాద మలినంబుల రూపుమాపునట్టి వానినే బ్రాహ్మణుడని యందును.

24. సర్వావస్థల యందును, సర్వ కోర్కెలను విసర్జించి సంసార బంధనములవీడి బంధుమిత్ర కళత్రాదుల త్యజించి సన్యాసమునే సర్వస్వమని యెంచి మోహాంధకారమును దివ్యజ్ఞానముచే నశింప జేసికొని ప్రకాశించు వానినే నేను బ్రాహ్మణుండని ప్రకటించుచున్నాను.

25. దేవ గంధర్వ మానవులకు తెలియునట్టి సూక్ష్మోత్తమ మార్గమును పొందియు, యే యితర వాసనా రహితుడైన సహృదయునే యే మనో వికార చిత్తములు లేని మనుజునే ధీరుడైన బ్రాహ్మణుడని నే తెల్పుచున్నాను.

26. భూత, భవిష్య ద్వర్తమాన విషయంబుల మమకార పరిత్యాగముచేసి, యే పదార్థమును తనదిగా భావించిక సమగ్ర సంసార వైరాగ్యము నందున్న వాడె బ్రాహ్మణుడగునని నేను తెలియచేయుచున్నానుసుమా!

27. పూర్వజన్మ జ్ఞానము సంపాదించినట్టియు, స్వర్గనరక వివేచనా శక్తి సంపన్నుడైనట్టియు జనన మరణ బంధనమున పడక సంపూర్ణతేజోవంతముగా భాసిల్లునట్టి సిద్ధుని సర్వాం పరిపూర్ణుడైనట్టి పూజ్య మహర్షి చంద్రునే నేను బ్రాహ్మణుండని నొక్కి వక్కాణించుచున్నాను.

28. సంసారములో సర్వత్రా ప్రాణికోటి పుట్టియు గిట్టు స్థితుల గ్రహించి నట్టియు, సమస్త విధ చిత్తవికారముల అసహ్యించు నట్టియు, సన్మార్గానురక్తుడై జాగ్రత్తతో సద్గతికై దివ్యంబైన అంతర్దృష్టి బొంది బుద్ధుడై యున్నట్టి వ్యక్తి సత్తమునే నేను బ్రాహ్మణుడని నేనుత్తముండగు బ్రాహ్మణుండని నొక్కి ఓ భిక్షులారా వక్కాణింపుచున్నాను.

సంపూర్ణం.



# శ్రీ బుద్ధగీత అనుబంధము

## బౌద్ధతత్త్వ ముఖ్య పదమంజరి (అర్థములతో)

| | | |
|---|---|---|
| శ్రమణుడు | = | భిక్షువు, పరివ్రాజకుడు |
| భిక్షువు | = | సాధువు లేక బౌద్ధ సన్యాసి |
| జిజ్ఞాసువు | = | సత్యాసత్యముల తెలియగోరువాడు |
| పిపాసువు | = | ధర్మజ్ఞానము తెలిసినవాడు |
| ముముక్షువు | = | మోక్షము పొందగోరువాడు |
| నిర్వాణము | = | మోక్షము, కైవల్యము, జన్మరాహిత్యం, సచ్చిదానంద స్వరూపం |
| జీవన్ముక్తి | = | శరీరముతోయున్నను మాయకుదూరమైవున్నవాడు |
| మహాబోధి, బోధి | = | ఆత్మసాక్షాత్కారము బ్రహ్మానందప్రాప్తి |
| స్వర్గము | = | ఆనందనిలయము |
| నరకము | = | భయవిషాదస్థానము |
| ఈశ్వరుడు | = | సమష్టి శక్తి, విధాత విశ్వసత్త |
| ప్రకృతి | = | స్వభావము, సృష్టిధర్మము, మాయ, మిథ్య |
| ముని | = | విజేత, యతి గోపాలుడు |
| కామపాలుడు | = | కామక్రోధాదులను అణచినవాడు |
| వేదము | = | విశదపఱచునది. మాయోపాధుల నుండి జీవకోటికి విశ్వసత్తను తెలుపునది |
| శాస్త్రము | = | శాసించునది |
| మలము | = | కల్మషము, అవిద్య, అజ్ఞానము |
| ఓదేవా | = | ఓ విశ్వసత్తా |
| సత్తు | = | సత్యమైనది |
| బ్రాహ్మణుడు | = | బ్రహ్మజ్ఞాని, నిర్వాణపథము తెలిసినవాడు |
| సోమరి | = | మూఢుడు |
| సాధనము | = | జ్ఞానకృషి |

| | | |
|---|---|---|
| వేదాంతి | = | సాధకుడు |
| జీవాత్మ | = | ఖండచలన శక్తి గలది |
| పరమాత్మ | = | విశ్వసత్త, బ్రహ్మము |
| తృష్ణ | = | కోర్కె |
| బుద్ధుడు | = | సిద్ధుడు, భావాతీతుడు, శుద్ధుడు |
| సూనశరుడు | = | మారుడు, కామక్రోధాదుల యధిపతి, క్రీస్తు దీనినే సైతాను అని అన్నాడు, జీవుల సతాయించువాడు |
| వృద్ధుడు | = | జ్ఞాన పరిపక్వత కల్గినవాడు |
| బాలుడు | = | మూర్ఖుడు |
| పండితుడు | = | ఉత్తముడు, పూజ్యుడు |
| యజ్ఞము | = | త్యాగము, బలిదానము |
| ఆర్యుడు | = | శ్రేష్ఠ మానవుడు, ధర్మశీలుడు |
| యోగము | = | భక్తిజ్ఞాన కర్మల సాధనము |
| యజ్ఞము | = | మూఢులహింసాత్మక క్రతువు దేహదండనాత్మకంబగు దుస్సహ తపశ్చర్య తపస్సు. |
| రాక్షసుడు | = | క్రూరుడు, చండాలుడు |
| గోయజ్ఞము | = | ఇంద్రియముల వృత్తుల బహిష్కారం |
| గోస్వామి | = | గోసాయి, ఇంద్రియముల జయించినవాడు. |



## గృహిణిని గురించి పురుషులకు బోధ

మీకు సహధర్మచారిణి మీతో యుండి సకల చర్యలకు సహకరిస్తూ ఆదరము కలిగియున్న సహ భోగినిని, ప్రేమతో చూడుము. ఆమెకు నమ్మక ద్రోహము చేయకుము. మీరు మంచి పనులనే చేయుచుండుడు. వారి యవసరముల తీర్చి వారి మన్ననలను పొందుడు. మీ పుత్ర మరియు పుత్రిక లను పాపమయ కార్యములను చేయకుండ యుండునట్లు చేయుడు. మీ ఆడ వారికి, పిల్లలకు ధర్మ విజ్ఞాన విధముల తెల్పుడు. మీ సంపదలకు వారలను (ఆడవారిని) మీ తర్వాత మీ సంపదపై యధికారము పొందునట్లు చేయుడు. ఇట్లాచరించిన మీ గృహముయొక్క కల్యాణము చెంది సురక్షితమగును.

## స్వజనుల ఆత్మీయుల గురించి

మీ ఆత్మీయులను, స్వజనులును మిత్రులును నగు జనులపై వాత్సల్య మును కలిగియుండుడు. మంచి మాటలచే వారి నానంద పరచుడు, వారికి సమయానుకూలంబుగ యల్పాహారములనిచ్చి యాదరింపుచుండుము. మీ స్వకుటుంబము వారివలెనే వారికి సహాయపడుచు ప్రేమతో చూడుము. మీ ధనమందలి కొంతయైనా వారికిచ్చి వారు చెడుమార్గములను వారిని వదలు నట్లు చేయుము. వారు దరిద్రమందున్న చివరకు ధనమొసంగికూడ గౌరవింపుము. అపుడే మీ కుటుంబం క్షేమంబుగా భద్రమగును సుమా!

## తల్లిదండ్రుల గురించిన బోధ

ఓ గృహస్థులారా! మీ తల్లిదండ్రులకు సేవా శుశ్రూషలు శ్రద్ధాభక్తులతో చేయుడు. వారి ధనధాన్య విశేషముల సంరక్షింపుడు. సమస్త విధములుగ వారి తర్వాతనే మీరు యధికారము పొందుటకు వారినుండి యుత్తర్వులు పొందుడు. లేక హక్కులుండునట్లు సంతతి మెలగవలెను.

జననీ జనకులు శరీరములు వదలినంతనే శ్రాద్ధ పిండ ప్రదానాది బాహ్య కర్మానుష్ఠానములకొద్ది త్యాగమునచేసి తృప్తిచెందక శ్రద్ధతో వారల స్మరించుచ వారి చిత్త శాంతికై క్రొత్తక్రొత్త పుణ్యముల చేయుడు. ఇట్లాచరించుట వల మీ యిల్లు సంసారము సురక్షితమగును.

## మీ గురుభక్తిని పెంచుకొనుడు

ఏ పుణ్య గురువర్యుని వలన మీ జ్ఞానము పెంచబడినదో, లేదా నేర్వ బడినదో ఆయన కనబడి నంతనే కూర్చొనియున్న మీరులేచి నిలువబడి వారికి భక్తి పూర్వకముగా వందనము లాచరించి వారికి యథోచిత సేవల చేయుడి. వారి యాజ్ఞలకై యెదురు చూడుడు. శక్తికొలది వారి యాజ్ఞ పాలనమునకై యెదురుచూడుడు. వారి మాటలువిని పాటించుడు. మీ యిల్లు, మీరు సురక్షిత మగును సుమీ!

## శ్రీ బుద్ధదేవుని పంచశీల

1. హింస సలుపరాదు
2. దొంగతనము చేయరాదు
3. వ్యభిచరించుట మహా పాపము
4. అపద్ధమాడరాదు
5. మద్యపానము చేయరాదు.

## బౌద్ధ సాధకుని నాల్గు విషయములు

1. నిర్జన స్థానమునందు ధ్యానము సలిపి చిత్తమును సమస్త పాపలాలస ముల నుండి విముక్తి చేసికొనుము.
2. ధ్యానముచే చిత్తము ఏకాగ్రత మొనరించి పూర్ణానంద మొందుట.
3. ఆధ్యాత్మిక జ్ఞానముచే చిత్తమును స్వాధీనపరచుకొనుట.
4. సంసార సుఖ దుఃఖములనుండి వదలించుకొని పరిశుద్ధ శాంతి మధ్యన మనసు నిల్పుట.

## శ్రీ బుద్ధదేవుడు గృహస్థాశ్రమవాసుల గురించి తెల్పిన విధము

బౌద్ధధర్మము సంసారమందలి సకల జనులను, స్త్రీ పురుష భేదములు లేక సన్యాస వ్రతము స్వీకరించమని శాసించి యుండలేదు. బౌద్ధ ధర్మమును సన్యాసమును హృదయపూర్వకముగా నాహ్వానించియుండి యున్నను, గృహస్థాశ్రమము కూడ సన్మానించబడినది. శ్రీ బుద్ధ భగవానుడు బౌద్ధ పరివ్రాజకుల సంబోధించి, ప్రత్యేకముగా బోధించియున్నను, గృహస్థులకు గృహిణుల నుద్దేశించికూడ పలుమారు వారెట్లుండవలెనో బోధించెను.

## స్త్రీలను గురించి దేవుడిట్లు బోధించినాడు గమనించుడు

"ఓ గృహిణులారా! మీ ఆత్మలందు ప్రకాశవంతమైన ప్రేమానురాగాల వెలిగించుడు! ఇండ్ల నాల్గుదిక్కులనుండి, మంచియగు దానినే పెంచి పోషించుడు. మంచిగాలేని మీ పనులచే మీ నివాసము లెంతమాత్రము రక్షింపబడజాలవు."

## గృహస్థులగు పురుషునికిట్లు యాదేవుడు బోధించినాడు

"నాయనలారా! నిజపాదములపై నాధారపడి యుండుండి, సాధనము చేయుడి. స్వావలంబనవీడి పరావలంబనము నారాధింపక మెలగుడు. మానవుడా నీ భాగ్యమునకు నీవే కర్తవు."

పరోపకార నిమిత్తం వారి స్వంత సుఖ భోగముల త్యజించు నట్టియు, వారి స్వార్థమే కోరక సకల జీవుల క్షేమమును కోరుచుండునట్టి సాధువుల యొక్కయు, సజ్జనుల కెల్లప్పుడు సేవా శుశ్రూషలు త్రికరణ శుద్ధిగా చేయుచుండుడు. వారి నాహ్వానించి యాతిథ్యమిచ్చి గౌరవింపుడు.

త్రికరణ శుద్ధిగా మీకు సేవలు చేయునట్టి దాసదాసీ జనముల సర్వదా పోషింపుడు. ప్రేమతో మీ సేవకుల విశ్రాంతి నిమిత్తం కొంతకాలాన్ని కేటయించుము. వారు వ్యాధిగ్రస్తులగుచో వారి చికిత్సకు పథ్యపానాహారములకు తగు సౌకర్యములను చేయుడు. అపుడే మీ గృహము మంగళమై యభివృ చెందును.

ఓ గృహస్థ అన్నలారా! గృహధర్మ పాలన యందు సాధువులను గౌరవించి యాదరింపుడు ఏ ప్రాణిని హింసింపకుడు. మరియు హింసచేయు నటుల ప్రోత్స హింపకుడు. అహింసయే మీ పరమ ధర్మం. ఏదియుగాని అడగనిదే యెచటి నుండైనా తీసికొనవలదు. పరులకు సహాయపడుడు. చెడ్డపనులను చేయకుడు. మీ స్థితిపై మీరు సంపూర్ణ అధికారము కలిగియుండుము. అనగా స్వేచ్ఛతో నుండుము. వ్యభిచారము చేయవలదు. అపద్ధము లాడకుము. మద్యపానము చేయకుడు. అట్టి ప్రోత్సాహము నీయవలదు సుమా! సమస్త పాపాలకు మద్య పానమే కారణమగును సుమా! మద్యపానముచే మత్తెక్కినచో రజోగుణ సమే తుడై యుద్రేకము (కోపము) జెంది మత్తులో పాపకార్యాదులు చేయబడును.

గృహస్త అన్నలారా! కామ గుణమును పురికొల్పు చందన, కర్పూరముల తీసికొనవలదు. అట్టి పుష్పమాలలను, సుగంధ వస్తువుల కిష్టపడకుడు. మృదు మధుర పాన్పులపై పరుండవలదు. భోగవిలాస వస్తువుల ననుభవించకుడు. సప్తవ్యసనములను వీడుడు.

మీరు శుభాశీస్సులు పొందవలయునన్న ముసలివారి నాదరింపుడు. గౌరవింపుడు. అనగా శక్తిలేని మరియు పేదవారి నాదరించుము. పై ధర్మము నందే మీ మనస్సు నుంచుకొనుము. ధర్మము లేనివాడు పశువుతో సమానమే సుమీ! సత్యభాషణము చేయుము. గురువులచెంత కేగుచు అపుడపుడు వారి జ్ఞాన బోధను వినుచుండుము. అహంకారములేక అపుడపుడు ధ్యానమునందు చిత్తము నుంచుము.

ఆస్తికులమని దేవదేవా! యని పలుకుచూ నీచ కార్యములు చేయుచూ, మరియు ఈశ్వరా! ఓ సర్వేశ్వరాయని ఆలాపించుచూ నీచ మనసుతో యుండుట కన్న సాటి జన సంక్షేమము కోరుచూ సద్గుణములచే నుండు నిర్మల గృహస్థులే (నాస్తికులవలె) పూజ్యులు. మరియు పవిత్రులై యుందురు సుమీ!

శ్రీ బుద్ధగీతా భావానుసారం హిందూమత శాస్త్రాలందేగాక ప్రపంచ వ్యాపితంగాయున్న ప్రముఖుల భావాలు కూడ వెలుగుచున్నవి. అటు క్రింది విధంగా యున్నవి గమనించుడు. అట్లెన్నియోయున్నను కేవలం కొన్ని మాత్రమే తెల్పసాధ్యమైనది.

శ్రీ బుద్ధగీతలోని మొదటున్న యమకవర్గ మొదటి వాక్యార్థమువలె శ్రీ భగవద్గీత "యాదృశీ భావనా యస్యసిద్ధిర్భవతి తాదృశీ' యద్భావం తద్భవతి యని తెల్పుచున్నది.

"కీడు కీడువలన నభివృద్ధి చెందు; నశించుట దుస్సాధ్యం' లియోటాల్ స్టాయ్‌యను రష్యా తాత్త్వికుడు తెల్పియున్నాడు.

అమేధ్య పూర్ణక్రిజాల సఙ్కులే
స్వభావ దుర్గన్ధ వినిష్ఠి తాన్తరే
కళేబరే మూత్ర పురీష పూరితే
రమన్తిమూఢా విరమన్తి పండితాః' (యోగోపనిషత్తు)

అదేవిధంగా యోగవాసిష్ఠము నందిట్లు శ్రీరామచంద్రుడు తెల్పియున్నాడు.

శ్లో॥ ఇతోమాంసమితో రక్తమితోఽస్థీనీతి వాసరైః
బ్రహ్మన్ కతిపయైరేవ యాతస్త్రీగతచారుతా॥

శ్రీ బుద్ధగీతలోని బాలవర్గములో సాహారశముపలె శ్రీ భగవద్గీత యిట్లు తెల్పుచున్నది.

' నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే
సర్వం జ్ఞాన ప్లవేనైవ వృజినం సన్తరిష్యసి"

భజగోవిందంలో నీ క్రింది శ్లోకమదే భావం తెల్పుచున్నది.

శ్లో॥ సత్సఙ్గత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చల తత్వే జీవన్ముక్తిః॥

అదే భావాన్ని క్రీస్తు భగవానుడు యిట్లు తెల్పుచున్నాడు.

"సమస్త ప్రపంచ విభవాదులనుండియు విముఖులైన వారి (దీనుల) చెంత యీశ్వరరాజ్య రమాదేవి సాష్టాంగ పడునన్నమాట సత్యము"

శ్రీ బుద్ధగీత పండిత వర్గములోని భావాలనే శ్రీ భగవద్గీత యిట్లు తెల్పుచున్నది.

'విద్యావినయ సంపన్నే బ్రాహ్మణేగవిహస్తిని।
శుని చైవశ్వపాకేచ పండితాః సమదర్శినః

అదేభావాన్నే కిరాతార్జునీయం తెల్పుచున్నది.

శ్లో॥ స్పృహణీయ గుణైర్మహాత్మభిశ్చరితం వర్త్మయచ్ఛతాం మనః
విధరహితురహితు రాగసాం వినిపాతోఽపిసమః సమున్నతేః

శ్రీ బుద్ధగీతలోని అర్హతవర్గము ( పూజ్య వర్గము ) లోని సందేశ భావాలే భగవద్గీతలో యిట్లున్నవి.

శ్లో॥ యేహి సంస్పర్శజా భోగా దుఃఖయో నయ యేవతే।
అద్యంత వన్తః కౌన్తేయ వతేషు రమతే బుధః ॥

శ్రీ బుద్ధగీతలోని సహస్ర వర్గములోని సందేశమువలె శ్రీ భగవద్గీతలో యిట్లున్నది.

తే॥ గీ॥ శ్రద్ధచే జ్ఞానసిద్ధి సంభవించు
నపుడె యింద్రియ సంచార మణగిపోవు
జ్ఞాన సంప్రాప్తి చేతను శాంతి బొందు
శీఘ్రకాలంబున చిర యశోర్ధి.

తే॥ గీ॥ అజ్ఞునకు శ్రద్ధ లేనట్టి యధమునకును
సంశయాత్మకునకు హాని సంభవింప
వీరిలోపల మిక్కిలి దూరమగును
సంశయాత్మకు యిహపర సౌఖ్యమనఘ.

శ్రీ బుద్ధభగవానుని అఘువర్గము (పాపవర్గము) లోని సందేశ బావాలే బైబిలునందు 16, 17, 18 అధ్యాయాలందున్నవి. మరియు ఆంధ్ర మహా భారతము నందిట్లున్నది.

చ॥ పుడమి జొచ్చిన న్విపిని భూమిని దాగిన మింటికేగినన్
గడలిని జొచ్చినన్ దుదకు గాదని దానినె కావవేడినన్
విడువదు మృత్యువెవ్వరిని వేళకువచ్చి వధించు దానికై
యడలిన నేమికద్దు మనసా హరిపాదము లాశ్రయింపవే॥

చ॥ గజతురగాది సంపదలు గాతలతోడ విహారలీలలుం
బ్రజ కనురాగ మొద బరిపాలనసేయు క్రమంబు బోరులన్
విజయము బొంది పేర్చుటయు విస్ఫురితా భరణానులేప వ
స్త్ర జనిత వైభవంబు గల రాజులు బోయిరిగాక నిల్చిరే!॥

శ్రీ బుద్ధగీత దండన వర్గములోని సందేశ భావముల వలెనే వేమన శతకంలో యిట్లు తెల్పబడినది.

ఆ॥ జీవి జీవిని జంపి జీవికి వేయగా
జీవివలన యేమి జిక్కియుండు
జీవహింసలకు జిక్కినా మోక్షంబు
విశ్వదాభిరామ వినురవేమ.

ఆంధ్ర మహా బారతంలోకూడ యదే భావ మిట్లున్నది.

దంతి యడుగులోన తక్కిన జంతు చ
యంబు నడుగులెల్ల నడగియుండు
నట్ల ధర్మ కోటులన్నియు లోనగు
నిద్ధ గుణ యహింస కెంత నిజము.

శ్రుతులలో కూడ యిట్లున్నది.

"అహింసా పరమో ధర్మః అహింసా పరమ తపః
అహింసా పరమం దానం ఇత్యూచుర్మున యస్తథా॥"

వేదాది గ్రంథముల సారముగా యిట్లు అహింస శ్రేష్టత్వమును గూర్చి తెల్పబడినది.

''కర్మణా మనసా వాచా సర్వ భూతేషు సర్వదా
అక్లేశం జననం ప్రోక్తా త్వహింసా పరిమర్షిభిః ॥''

మహా భారతంలోని 'ఒరులేమని యన్నను' అను పద్యభాగ మదే భావము తెల్పుచున్నది. మరియు

ఆ॥ చెల్లియుండియును సైరణ సేయు నతడు
బేదపడియున్న నర్థికి బ్రియముతోడ
దనకుగల భంగి నిచ్చు నతడు బుణ్య
పురుషులని చెప్పరార్యు కురుపతేణ్య!

జానపద తత్త్వ మిట్లు తెల్పుచున్నది.

చిల్లర రాళ్ళకు మ్రొక్కుతువుంటె
చిత్తము చెడుతా వొరేవొరే
చిత్తమునందున చిన్మయరూపుని
చూచుచుండుటె పరేసరే
వొక్క పొద్దుల యుండుతువుంటె
వొనరుగ చెడుదువు వొరేవొరే
వొక్కడైన యా వైభవమూర్తిని
చూచుచుండుట సరేసరే॥

ఆ భావమునే స్వామి వివేకానంద యిట్లు తెల్పెను.

''వాదములు, రాద్ధాంతములు, కర్మకాండలు, మత గ్రంథములు, దేవాలయములు, బాహ్యాచార పద్ధతులు మొదలగునవన్నియు అప్రధానములే?

ఆ భావమునే వేమన యోగి యిట్లు తెల్పెను.

'ఆత్మశుద్ధి గలిగి చేసిన పుణ్యంబు
కొంచమైన నదియు గొదువకాదు.

శ్రీ బుద్ధగీతనందున్న జరావర్గము నందున్న సందేశ భావముల నిట్లు భర్తృహరి మునివర్యుండిట్లు తెల్పియున్నాడు.

చ॥ తనువుముడుంగు బాదగతి దప్పును దంతము లూడు జీకటుల్
కనుగవ వర్తిలుం జెవుడు గ్రమ్మును జొంగలుగాఱు మోమునన్
జనములు మాట చేకొనరు సన్నిధి జేరదు భార్య పుత్రుడున్
గొనికొని శత్రునట్లు తిరుగుం గడు గష్టము వృద్ధ దేహికిన్॥

శ్రీ బుద్ధగీత ఆత్మవర్గంలోని సందేశ భావముల వలె యిట్లు మనుస్మృతి తెల్పుచున్నది.

శ్లో॥ సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖం
శ్రీ భగవద్గీత కర్మయోగంలో యిట్లు తెల్పబడినది.

తే॥గీ॥ ఆత్మబుద్ధికి గడుయెక్కుడని యెఱింగి
మనము యింద్రియములతోడ మగుడ బిట్టి
కామమనెడు దురాస్పద కష్టరిపుని
గెలువుమర్జున బుద్ధిచే గేవలముగ

అట్లు ఆంగ్ల ఆర్యోక్తి యిట్లు తెల్పుచున్నది. " God helps those who help themselves " గరుడ పురాణమందలి క్రింది శ్లోకము యిట్లు తెల్పుచున్నది.

శ్లో॥ "కురంగ మాతంగ పతంగ భృంగ
మీనాహతాః పంచభిరేవ పంచ
ఏకప్రమాది నకథం నహన్యతే
యః సేవతే పంచభిరేవ పంచ॥"

అదే భావం తెల్పు గీతా శ్లోకం 'శ్రేయాన్ స్వధర్మో విగుణః
మహాభారతంలో పై వర్గ సందేశ భావమిట్లున్నది.

ఉ॥ కాలము వాతజిక్కి చెడుగానని మేషములో సమస్తమీ
వాలిని బిడ్డలన్ ధనము యవనముంగని పొంగబోకుమీ
యాలలిత ప్రపంచమున నాస వహింపక తత్త్వవేత్తవై
క్రాలగ జాలినన్ సుఖము గల్గు హరిన్ భజియింపు మూఢుడా!

గీ॥ పాపములకెల్ల నెక్కుడు పాతకములు
సుమ్మెక్రోధ లోభంబులు సువ్రతాత్మ
వానిరెంటి జయించిన వాడుగాని
యెందు బరమ ధార్మికుఁడని యెన్నబడు''

శ్రీ బుద్ధగీత బుద్ధవర్గంలోని భావములవలె శ్రీ భగవద్గీత యిట్లు తెల్పుచున్నది.

శ్లో॥ అమానిత్వ మందభిత్వ మహింసాక్షాంతిరార్జవం
ఆచార్యో పాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః
ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార మేపచ
జన్మ మృత్యుజరావ్యాధి దుఃఖో దోషాను దర్శనం

అధ్యాత్మజ్ఞానం నిత్యత్వం తత్వజ్ఞానార్థ దర్శనం
ఏతద్ జ్ఞానమితిప్రోక్త మజ్ఞానం యదతో ఽన్యథా॥"

శ్రీ బుద్ధగీతనందలి సుఖవర్గములో తెల్పిన సందేశమువలె ఆంగ్లతత్త్వవేత్త పాల్ రిచర్డ్ యిట్లు తెల్పెను.

'To Love your enemy is to conquer him"
అనగా ద్వేషిని ప్రేమించుటయన్న శత్రువును జయించుటయే" అని అర్థం.

అట్టి జ్ఞానమునే శుకయోగి తన సందేశములో ఇట్లు తెల్పియున్నాడు.

'' నజాతు కామః కామనాముప భాగే నశామ్యతి।
హ విషా కృష్ణ వర్త్మేవ భూయ ఏ వాహి వర్థతే॥''

శ్రీ బుద్ధగీతలోని ప్రియవర్గము (అసక్తవర్గము) తెల్పు సందేశం వలననే లియోటాల్‌స్టాయ్ (రష్యా తాత్వికుడు) యిట్లు తెల్పెను.

"మానవాభిలాష సముదాయ విమోచనమే యాత్మ వశీకరణ మనబడును. వాంఛల మితత్వం సహితం దానికే చెందును"

అట్లు భగవద్గీతలోని సాంఖ్యయోగములో యిట్లు తెల్పుచున్నది.

"శ్లో॥ అపూర్వమాణమచల ప్రతిష్ఠం
సముద్రమాపః ప్రవిశన్తి యద్వత్
తద్వాత్కామాయం ప్రవిశన్తి సర్వే
నశాన్తి మాప్నోతి నకామ కామి॥"

యోగవాసిష్ఠం యిట్లు తెల్పుచున్నది.

"శ్లో॥ అన్తః సన్త్యక్త సర్వాశో వీతరాగో వివాసనః।
బహిః సర్వ సమాచారో లోకే విహర రాఘవ॥"

శ్రీ బుద్ధగీతలో క్రోధవర్గములో తెల్పినట్లు మనుస్మృతికూడ యిట్లు తెల్పుచున్నది.

"శ్లో॥ ధృతిః క్షమాదమాస్తేయం శౌచమిన్ద్రియ నిగ్రహః।
ధీర్విదాసత్య మక్రోధా దశకం ధర్మలక్షణం॥"

"Anger is like a full hot horse who being allowed his way, self mettle tires him"

క్రోధము స్వేచ్ఛగా విహరించు ఒక వేడి గుఱ్ఱము వంటిది. ఆత్మతేజ మద్దాని నోడింపగలదు. క్రోధ మగ్నిగోళమువలె స్పృశించిన వస్తువునెల్ల దహించునని భావము. ఆంగ్ల తాత్త్వికుడు బేకన్ అట్లు తెల్పెను.

దానినే మహా భారత మిట్లు తెల్పుచున్నది.

కం॥ కోపము నుబ్బును గర్వము
నాపోవని యునికియును దుఃఖాభిమానము ని
ర్వ్యాపారత్వము ననునవి
కా పురుష గుణంబులండ్రు కౌరవనాథా॥

తే॥గీ॥ కోపమునను ఘనత కొంచమైపోవును
కోపమునను మిగుల గోడుచెందు
గోపమడచెనేని గోరిక లీడేరు
విశ్వదాభిరామ వినురవేమ. యని యున్నది.

శ్రీ బుద్ధగీతలోని అవిద్యావర్గములో తెల్పినటులనే భర్తృహరి యిట్లుతెల్పెను.

" ఉ॥ విద్యనిగూఢమగు విత్తము రూపము పూరుషాలికిన "

స్వామి వివేకానంద విద్యనుగూర్చి యిట్లు తెల్పియున్నాడు.

"బాహ్యాభ్యంతరిక దుర్గుణములనెల్ల రూపుమాపివేసి హృదయాంతరాళమున వెలయు పరతత్త్వమును వెలువఱచుటయే మానవుడు ఆశించతగు విద్య" యనెను.

"సద్వర్తనా సంశోభితులగువారు తమ సంఘమునకు హృదయమువంటి వారు విద్యావంతులని ఆంగ్లకవి 'ఎమర్సన్' యనెను.

శ్రీ బుద్ధగీతలో అవిద్య వర్గములో తెల్పిన విధంగా విద్య గొప్పతనంగూర్చి మహా భారతం యిట్లు తెల్పుచున్నది.

గీ॥ నియత తపమును నింద్రియ నిగ్రహంబు
భూరి విద్యయు శాంతికి కారణములు
వాని యన్నింటికంటె మేలైన శాంతి
కారణము లోభముడుగుట కౌరవేంద్ర!

శ్రీ బుద్ధదేవుడు వదలమని తెల్పిన దుర్గుణముల గురించి ఆంధ్ర మహా భారతము గూడ యిట్లు తెల్పియున్నది.

గీ॥ వెలది జూదంబు పానంబు వేట పలుకు
ప్రల్లదంబును దండంబు పరుసధనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేత
యనెడు సప్తవ్యసనముల జనదు తగుల

ఇట్లే శ్రీ బుద్ధగీతలోని శ్రీ బుద్ధ మహాత్ముడు బోధించిన ధర్మము నీతిమార్గములనే మన పురాణేతిహాసములు. వేదవేదాంగములు, సర్వశాస్త్రములు తెల్పుచున్నవి. అంతేగాక ప్రపంచ పాశ్చాత్య తత్త్వవేత్తలుగూడ ఆయన జ్ఞాన వెలుగునే తెల్పుచున్నారని పై విధంగా తెల్పబడుచున్నవి.

పై విధంగా గీతయుందలి అన్నివర్గాలను వివరించుట వ్యయ[ప్రయాసలతో కూడియున్నది. కొన్ని దృష్టాంతములుగా పై విధములో తెల్పియున్నాను. మన్నించ పాఠకులను [ప్రార్థించుచున్నాను.

కాన శ్రీ బుద్ధ మహాత్ముని బోధనలు సందేశములు సర్వకాలములయందును ముఖ్యముగా నేటి [ప్రపంచ వ్యాప్తంగా సర్వ మానవులు తెలిసి ఆచరించ తగినదని [ప్రత్యేకంగా తెల్ప పనిలేదని బావించుచున్నాను. [ప్రస్తుత కాలమాన స్థితియందు ఆ మహాత్ముని బోధనా సందేశముల పాటించుటే శరణ్యం. మన ఆర్యులు స్థాపించిన అర్థమత ఆచార సాం[ప్రదాయాలనే సంస్కృతినే మాసిపోయి మరుగున పడిపోయి అనర్థకర పాశ్చాత్య విదేశీ సంస్కృతీ సాం[ప్రదాయాలలో పడి మన విద్య సంస్కృతిని మరచిపోయి మిక్కిలి యనర్థ యజ్ఞానంలోయున్న నేటి మన భారతీయులకు సుఖ జీవన సమైక్య సౌఖ్యములతో జీవించుటకు నేడు శ్రీ బుద్ధదేవుడు తెల్పిన బోధనలే శరణ్యమని వేరుగా తెల్పపనిలేదని శ్రీ బుద్ధ గీత చదివిన పాఠకులు [గహింతురని నమ్ముచున్నాను.

శ్రీ బుద్ధ గీతను చదివి తరింతురనియు, నిర్వాణపథమునందు పయనింతు రనియు, కోరుచూ పాఠకులకు నా [పేమపూర్వక వందనము లర్పించుకొను చున్నాను.

బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి

నా [ప్రియమిత్రుడు శ్రీ పి. రంగయ్య రిటైర్డ్ లైబ్రేరియన్ గారు శ్రీ బుద్ధ గీతను అచ్చు వేయించుటలో నాకు సహాయపడినందులకు కృతజ్ఞతాభి వందనలు.

గ్రంథకర్త

# విజ్ఞప్తి.

సుమారు అరు లేక ఏడువేల సంవత్సరములనుండి మన భారత దేశములో వేదములు స్థాపించబడినవి. అందున్న జ్ఞాన సముదాయముతో సత్యధర్మములతో సామాజిక జీవన విధానాలు రూపొందించబడినవి. అట్లు త్రీవకృషిచేసి. అనుభవ సిద్ధాంతములను పలుఋషులు అనుభవించి యా సత్య ధర్మాలను నిర్దేశించిరి అవియే మన పురాణేతిహాసములాదిగా ప్రబోధించుచున్నవి. దానిని మరచిపోయి నపుడెల్ల మన దేశంలో తిరిగి ఆ ధర్మముల పునఃస్థాపనకై అవతారములని,మహాత్ములని పుట్టుచూ మానవ సంఘానికి నూతనంగా తిరిగి బోధించి మనుజులను సుసంపన్నం చేయబడెను. అవియే అర్య సత్య ధర్మము లనబడెను.

క్రీస్తుపూర్వం 662 సంవత్సరాల క్రిందట వెనుకటి అర్య సత్యధర్మములు మనుజులలో మాయమయ్యెను. అనగా జ్ఞానమునశించెను. మనుజులలో ప్రేమ, దయ. దాన,ధర్మ గుణాలు నశించెను. అంతేగాక అసూయ, ద్వేషం, హింసా ప్రవృత్తులు మనుజులలో విజృంభించి అనేక యుత్పాతములకు సంక్షోభములకు మూలమయ్యెను. హత్యలు, దోపిడీలు, స్త్రీమానభంగాలు, జంతు హింసలు ప్రబలి పోయివిపరీతంగా భరత ఖండములోనేగాక ప్రపంచ వ్యాపితంగా మిక్కిలి క్షోభ ఏర్పడిఅశాంతి అల్లకల్లోలము లేర్పడెను. రాజుల రారాజుల యుద్ధాలు, తండ్రి కొడుకులుకూడ రాజ్యాలకై చంపుకొనుట సాధారణమైనది. మత పోరాటములు, అగ్ర కులాలఅన్యాయ అక్రమాలతో కుల ద్వేషాలు విచ్చలవిడిగా సాగినవి. సాధుజనులకుబ్రతుకే కష్టమైనది. మొదటికి మానవత్వమే మంట కలిసినట్లు జార, చోర, రోగాది, భయానక స్థితి దశదిశల వ్యాపించి, గతేమిటి, కర్తవ్య మేమిటి దిక్కెవ్వరు యను రోదనలమయ మయ్యెను.

అట్టి స్థితిలో శ్రీబుద్ధమహాత్ముడు సిద్ధార్థుడుగా జన్మించినది చరిత్రాత్మకమై యున్నది. ఆ భయానక స్థితులను బాపి ప్రపంచంలో భయానక దుస్థితిని మాయంచేసి నూతన ధర్మసంస్థాపనచేయ భగవంతుడే అవతరించ యీ మన భరత ఖండము నోచుకొన్నది జగద్విదితమే! అట్లు అన్యాయం భువిలో వినాశన కరంగా ప్రబలినపుడు దేవుడుద్భవించి నశించిపోయిన మానవ ధర్మాన్ని తిరిగి స్థాపించుటకు మానవునిగా జన్మింతునని శ్రీ బుద్ధ గీతలో తెల్పబడియున్నదానిని ప్రియపాఠకులు గమనించ కోరుచున్నాను.

అటులనే శ్రీభగవద్గీతా వాక్యం 'యదా యదాహి' అని తెల్పుచున్నది గదా! అటులనే మానవుడుగా సిద్ధార్థుడై జన్మించి ధ్యాన జ్ఞానార్జనకై సంసారము త్యజించి ప్రపంచ ప్రాణికోటి పుట్టుచు, గిట్టుచు ఎట్లు ఎందుకు బంధింపబడు చున్నదో ఆమాయా బంధనమునుండి విముక్తిచెంద శాశ్వితానంద శాంతితోజీవించ మరియు ఈ కష్టసుఖాలే లేకుండ చేసికొను నిర్వాణపథ మవలంభించెను. అందుకెట్టి జీవన విధానం మానవుడు అనుసరించ తగిన అష్టాంగ మార్గమును రూపొందించి తన నూతన సత్యధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ప్రపంచానికి చాటుటకై బుద్ధుడయ్యెను. అట్టి సర్వత్యాగాలుచేసి మహాబుద్ధిని సాధించెను. అందుకే బుద్ధ డయ్యెను.

అశాంతి అల్లకల్లోల అన్యాయ ప్రపంచ మానవులకు శాంతి సత్యధర్మాల తిరిగి బోధించ ప్రబోధముల సంహితమే యీ శ్రీ బుద్ధగీతయని మనవి చేయు చున్నాను. దీనిని ఎన్నిసార్లు చదివిన అంత బుద్ధి జ్ఞానము లెవరికైనా అంత ఎక్కువగా తప్పకవృద్ధి చెందునని దృఢముగా తెల్పుచున్నాను పఠింతురు గాక.

నాచే రచింపబడిన శాంతి చక్రవర్తి గ్రంథంలో ఆయన చేసిన త్యాగము, అడవులలో చేసిన ధ్యానాలు విపులంగా చరిత్ర యున్నది.

ఈనాటి జగతిలోని మానవులకు తిరిగి యీ మహాత్ముని బోధనలు బోధింపు సమయ మాసన్నమైనదని తలంచవలెను. ఎట్లనగా నేడు ఎటుచూచినా హింసా వాదం, అసూయ, ద్వేషాలు మరియు స్వార్థ చింతన ( కోర్కెలు ) మితిమీరి పోవుచున్నవి. శాంతిలేదు, సుఖంలేదు. రోగ భోగాలతో అశాంతి, అనారోగ్యాలతో సతమతమగు చున్నారు. కాన సర్వులీ ప్రమాదావస్తను గుర్తించి ఈ దేవుడు తెల్పిన ప్రబోధ ధర్మాన్ని పాటించిననే భవిష్యత్తు సర్వమానవులకేగాక సర్వ ప్రాణులకు దివ్య జీవన మబ్బును. లేకున్న యమపాశా బంధన కీలాగ్నులలో చిక్కి ఆ వేడికి క్రుంగి కృశించి మసియైపోవు కాలమాసన్నమైనదని గ్రహించ యెల్లరికి వందనము లర్పించుచున్నాను.

# అమరసింహుని ప్రార్థన

క్రీ. శ. 2, 3వ శతాబ్దాలలోయున్న ప్రసిద్ధ సంస్కృత పండితుడు బౌద్ధ తత్త్వవేత్తయైన అమరసింహుడు లోకోపకారమునకై నామ, లింగానుశాసనంగా యుండ అమరకోశమును రచించెను. అందు ప్రప్రథమంగానే శ్రీ బుద్ధదేవు నిట్లు ప్రార్థించెను.

శ్లో॥ యస్యజ్ఞానదయాసింధో రగాధ స్యానఘాగుణాః ।
సేవ్యతా మక్షయోధీరాః సశ్రియై చా మృతాయచ ॥

అనగా ఏ దేవుడు విజ్ఞానమునకును, దయకును అంతులేని యనగా లోతు తెలియని సముద్రము వంటివాడైనట్టియు, ఏ దేవుడు రాగాది పాపములు లేని నాశనములేనివాడో మరణలేని మోక్షము కొఱకు యా దేవుని సేవింతురు గాక! అని తన గ్రంథమును అంతా ఆ బుద్ధ దేవుని ప్రథమ కాండములోనే ఇట్లు స్తుతించి సది గ్రహింతురు గాక!

శ్లో॥ సర్వజ్ఞః సుగతో బుద్ధో ధర్మరాజస్తథాగతః
సమంత భద్రో భగవాన్ మార జిల్లోక జిజ్జనః
షడభిజ్ఞో దశబలో ద్వయవాదీ వినాయకః
మునీంద్రః శ్రీఘనః శాస్త్రామునిః శాక్యమునిస్తుయః
సశాక్యసింహః సర్వార్థసిద్ధశ్శౌద్ధోద్ధనశ్చసః
గౌతమాశ్చార్క బంధుశ్చ మాయాదేవి సుతశ్చసః

అట్లు శ్రీ బుద్ధ దేవుని పదునెనిమిది పేర్లున్నట్లు తెల్పుచూ స్తుతించెమీ. అనగా సర్వజ్ఞుడు, సుగతుడు, బుద్ధుడు, ధర్మరాజు తథాగతుడు, సమస్త భద్రుడు, భగవానుడు, మారజితుడు, అద్వయవాది, వినాయకుడు, మునీంద్రుడు, శ్రీఘనుడు, శాస్త్రుడు, ముని, శాక్యముని యని యా పండిత 'అమరసింహుడు' తన జ్ఞానముతో ప్రపంచానికి శ్రీ బుద్ధ దేవుడు తెలియునట్లు చేసెను. లోకజిత్తుడు, జినుడు, షడభిజ్ఞుడు, దశబలుడు అని ఆ బౌద్ధతత్త్వ పండితుడు మనకు తెల్పెను.



# అభినవ బుద్ధుడు శ్రీ అనగారిక ధర్మపాలుడు

శ్రీ బుద్ధ దేవుడు జన్మించినది 2600 సంవత్సరములు. మన భారత దేశంలో జన్మించి బౌద్ధ ధర్మాన్ని చాటి, ఆ కాలమందున్న అశాంతి, అరాజక. మతవైషమ్యాధ కులతత్వాది అల్లకల్లోల దుస్థితిని తొలగించెను. ఆయన ఆనాటి యనర్థకరమైన మానవ సంఘాన్ని తన బోధనలచే సంస్కరించి ద్వేషం, అసూయ, హింసలతో కొట్టుమిట్టాడుతున్న సమాజాన్ని ఆదరించి, ప్రేమించి, కరుణించి తన బోధచే దయా, అహింసల నెలకొల్పి ప్రపంచంలో ఆదర్శ దేశంగా భారత భూమి యగునట్లు చేసినది జగద్విదితమే. తర్వాత యీ దేశం నుండియే ఆసియా ఖండ దేశాలన్నియు మరియు యూరప్ ఖండమందు కూడ శ్రీ బుద్ధదేవుని బోధనల గ్రహించి యాయన బోధనల తత్వాన్ని పాటించినది జగద్విదితమే.

ఈ మన భారత దేశంలోనే రానురాను మన దేశమందే ఆయన బోధనల పాటించుట లేనందుకు మిక్కిలి విచారకరము. శ్రీ బుద్ధదేవుని ధర్మతత్వానికి మూలం అష్టాంగ మార్గం. ఆ ధర్మాన్ని మరచినపుడే యరాజక జగతియై ఘోర హింసావాదం సాగుతుంది. ఆ దేవుడు అప్పటికే అంతరించిన వేద కాల ధర్మ, సత్యాలను తిరిగి పునస్థాపన చేసెను. అధర్మ అసత్యాలు రాజ్యమేలు సమయమందు ఆయన తననూ సత్యధర్మాల ప్రబోధంచేసి జగతిలో అశాం

ప్రబలియున్న కాలంలో శాంతిని నెలకొల్పి ధర్మపాలనము జరుగునట్లు చేసెను. కాని రానురాను ఆయన బోధనలను మన దేశంలోని ప్రజలు పూర్తిగా మరచి పోయిరి. బౌద్ధధర్మం పుట్టిన దేశంలోనే యా ధర్మం నశించుచుండుట క్రమంగా జరిగినది.

అట్టి కాలంలో శ్రీలంకలో జన్మించిన బౌద్ధ యువకుడైన భిక్షువు పూజ నీయ 'శ్రీయుత అనగారిక ధర్మపాలుడు' శ్రీ బుద్ధదేవుని గురించి మొత్తం ప్రపంచ మానవులకెల్ల తెలియజేసెను. ఎట్లన ఈ భారత దేశానికి మొత్తం ప్రపంచానికి తిరిగి బౌద్ధధర్మతత్త్వాన్ని చాటితెల్ప నెంచెను. శ్రీ దేవుని గురించి 1893 సంవత్సరములో అమెరికాలో జరిగిన ప్రపంచ సర్వమత మొదటి సమ్మే ళనంలో పాల్గొని చాటనెంచెను. అనగా ప్రపంచ మానవ జాతిని తట్టి లేపుటకు ఆ సభలో పాల్గొన ఆయన అమెరికా ప్రయాణము కట్టెను.

1893వ సంవత్సరం సెప్టంబరు నెల 11వ తేదీన ప్రపంచ సర్వమత సమ్మేళనం అమెరికా దేశంలోని చికాగో నగరంలో జరుపబడుచుండెను. ఆ సభకు బ్రిటిష్ ఇండియా నుండి అనగా భారత దేశం నుండి పై పూజనీయుడు పాల్గొన నెంచెను. ఆయన పుట్టినది సిలోనైనా (నేటి శ్రీలంక) అనాడా దేశం మన ఇండియాలో భాగంగానే బ్రిటిష్ ఇండియగా నున్నదనుట జగమెరిగిన సత్యమే.

ఆనాటి చికాగో నగరానికి మన దేశం నుండి పోయి సర్వమత సమ్మేళ నంలో పాల్గొన్నది శ్రీ వివేకానందుడనే యింతవరకు మనం విన్నాం. ఐతే శ్రీ అనగారిక ధర్మపాలుడు అందు పాల్గొన్నాడని చరిత్రకారులెందుకు వ్రాయలేదో విచారించతగ్గ విషయం. ముమ్ముందీ విషయం ప్రస్తావించెద.

అట్లా పూజనీయ అనగారిక ధర్మపాలుడు 27సంవత్సరాల నవవయస్కుడై యుండికూడ ఆ సర్వమత సమ్మేళనంలో బౌద్ధధర్మ శంఖారావం చేయుటకు పయనమై ప్రయాణానికి డబ్బులులేక కష్టపడుచూ 1893 ఆగస్టు 2న ఇంగ్లాండు చేరెను. అచట ఆయన రాకకై యెదురు చూచుచూ Sir Edwin Arnold అను ఆంగ్ల పండితుడు (Light of Asia అను శ్రీ బుద్ధదేవుని గురించి వ్రాసిన గ్రంథకర్త) మరియు Annie Besent అను ఆంగ్లవనిత మన దేశస్వాతంత్రోద్యమ నాయకురాలు మరియు దివ్యజ్ఞాన సమాజము (Theosophical Society) మన

దేశంలో స్థాపించి ఎంతో మనకెంతో జ్ఞానసహాయంచేసిన వనిత అయనకు స్వాగతం పలికి అయన చికాగో పయనానికి డబ్బు సమకూర్చియిచ్చిరి. దానితో అయన ఆ సభాస్థలిని చేరగల్గెను. అయన 1893 సెప్టంబరు 2న న్యూయార్కు నగరం చేరెను. ఓకాగో యా సభా ప్రాంగణమంతా క్రిక్కిరిసి నిండిపోయి ప్రజలు నిలుచుకొని వేలాదిమంది యుండిరి. (Every inch of space was occupied) ఆ మన ధర్మపాలుడు 45 ఏండ్లు వున్నవాడుగా కనబడును. కాని అయన వయస్సు 27 ఏండ్లు అని ముందే తెలిసికున్నాము. భిక్షువువలె అయన పసుపు పచ్చ శిల్కు మెడిమెలకుపైగా నుండు గౌను తొడుగుకొని యుండి ఆ సభలో చేరెను. అపుడచటయున్న ఆ సభలో సాయంత్రం 7గంటల 45నిముషములకు "Man's Mission on Earth" గూర్చి డా. ధర్మపాలుడుపన్యసించు చున్నాడని ప్రకటింపబడెను. దేశదేశాల నుండి పండితులు, కవులు, తత్త్వవేత్తలు, గురువులు మఠాధిపతులేగాక ప్రజా సమూహము ఇసుకవేస్తే నేలరాలనంత సందోహంగా నుండెను. అట్లాయన బ్రిటిష్ ఇండియా నుండి యనగా మన భారత దేశం నుండి పాల్గొనుచున్నాడనునది మరువరాదు.

అనాడు సర్వమత సమ్మేళనంలో పూజనీయ ధర్మపాలుడు యా సభను సంబోధించి "అ సర్వ రక్షకుడైన శ్రీ బుద్ధునికి యావత్ప్రపంచమంతా ఋణపడి యున్నది సుమా!" అని ప్రసంగవ్యాసము ప్రారంభించెను. అట్లు బౌద్ధధర్మ శంఖారావం అనర్గళ అనన్య ఔత్సాహి కంఠధ్వనితో శ్రీ బుద్ధదేవుని జన్మాదిగా జీవిత, ధ్యానం, జ్ఞానం, శ్రీ బుద్ధధర్మ తత్త్వసారాన్ని గురించి ఘణఘణమను ఘంటానాదంవలె విపులీకరించెను.

ఆ సభనందలి ప్రపంచ పండితులు తత్త్వవేత్తలు మిక్కిలి ఆశ్చర్యం పొంది ఆనందములతో ఆ ధర్మపాల ఘనుని వేనోళ్ళ కొనియాడిరి. ఆ సభానంతరం వారు మా దేశం రండి, మా దేశం వచ్చి మాకీ బౌద్ధధర్మాన్ని బోధించమని బ్రహ్మరథం పట్టిరి. మన శ్రీ ధర్మపాలుడు శ్రీ బుద్ధ దేవుడు భారతదేశంలో జన్మించెనని తెల్పకున్న అయా దేశాల పండితులు ఈజిప్టులో జన్మించెనని కొందరు, నార్వే స్వీడన్ (స్కాండినేవియా) దేశాలందని మరి కొందరు, మరియు గ్రీసు ప్రష్యా దేశాలందు అయన జన్మించెనని మరికొందరు ప్రపంచ పండితులు నమ్మియుండిరి. మన శ్రీ ధర్మపాలుడు వారికి సత్యమైన స్థితిని తెల్పి వారెల్లరకు, మొత్తం ప్రపంచానికంతటికి సందేహనివృత్తి గావించె

ననుట నిర్వివాదాంశమైనది. ఈ విషయమైనా కడకు యీ దేశ చరిత్రకారులు గుర్తించినారా? అట్లయిన గుర్తించిన దాఖలాలు కనబడుటలేదు. ఆనాటి ప్రపంచ పత్రికలు ప్రకటించిన బౌద్ధ శంఖారావం వీరికి కనబడలేదా? వినపడలేదా?

బౌద్ధాన్ని భారతదేశంనుండి వెలిచేయుట కుద్దేశించిన పథకంలో యిదొక భాగమా?

ఎందరాహ్వానించినా ఆయన విదేశాలకు పోకుండ శ్రీ ధర్మపాలుడు ఇండియాలోనే జన్మించినట్లు తాను మాతృభూమిని ప్రేమించి యీ దేశంలో బౌద్ధ తత్వాన్ని బాగా పదిలపరచనెంచి పథకానుగతంగా నిర్విరామంగా ఇండియాలో కృషి చేసెను.

అట్లే ఆ సభానంతరం భారతదేశం వచ్చి నశించిపోయియున్న బౌద్ధ ధర్మాన్ని పునఃస్థాపన గావించ తన సర్వశక్తుల నుపయోగించి తుదకు తన ప్రాణాన్ని సహితం ఫణంగా వొడ్డి నిలిచి పోరాడిన ధీరవీరుడనియు శ్రీ బుద్ధ దేవుని అంశమే యీయనని క్రింద తెల్పుచున్నది. ఆ మహనీయునికి సర్వ భారతీయులమెంతో ఋణపడియున్నామనుట అతిశయోక్తి కాదని విజ్ఞప్తి. పూజ నీయ డా. అనగారిక ధర్మపాలుడే లేకున్న దురదృష్టవశాత్తు శ్రీ బుద్ధదేవుడు భారతదేశంలోనే జన్మించియున్నాడని చెప్ప నాథుడు లేక ఆ దేవుని బోధనలు తెల్పువారేలేక శ్రీ బుద్ధుని గురించి యీ దేశంలో ధర్మప్రబోధ పీఠమేలేక యంతరించియుండును. బౌద్ధధర్మాన్ని యీ దేశంలో నేగాక ప్రపంచానికి తిరిగి ఆయన దీక్షతో పట్టుదలతో కృషిచేసెను. మనం గర్వించతగును.

పూజనీయ అనగారిక ధర్మపాలుడు బౌద్ధ శాస్త్రాలను పాలీ బాషలనుండి నేపాల్, సిలోన్ దేవాళయాలందున్న వానినుండి ఇంగ్లీషులోని కనువదింప చేసెను. 1891 మే నెలలో ప్రపంచ మహాబోధి సంఘమును బుద్ధగయలో స్థాపించియుండెను. గయలో అశోక చక్రవర్తి నిర్మించిన బౌద్ధ దేవాలయాన్ని హిందూమహంతుయైన యొక జమీం స్వాధీనమందుంచుకొనెను. అందులోనికి బౌద్ధభిక్షువు లెవరిని రాకుండ చేసెను.

శ్రీ బుద్ధ భగవానుడు ధ్యానించుచూ నివసించిన స్థలమందున్న గుడిసెను, బోధి వృక్షానికై నిరంతరం భిక్షువులను పోరాటం వైపు ఆ మహాత్ముడు శాంతి యుతంగా నడిపించెను. అందు యెందరో బౌద్ధ భిక్షువులు బలియైనది మరువరానిది కాదా?

ఈ వీరుడు కూడ ప్రాణాలను లెక్కచేయకా యీ మహంతుపై ఉద్యమాలు పోరాటాలు పలుమారు జరిపెను. తుదకు శ్రీ దేవుని గుడిసె, బోధి వృక్షము భిక్షువుల వశంకాక తప్పలేదు-నేడు బౌద్ధులు పూజలు ప్రార్థనలందు చేయుచూ ప్రపంచ బౌద్ధ సంఘాల దృష్టిని కేంద్రీకరింపచేసినది ఆ మహాత్ముని భాగ్యమేయని తెలియండి. ప్రపంచ వ్యాప్త దేశాలనుండి ధన సహాయం తీసికొని బౌద్ధవిహారాలు దేవాళయాలు గయలో నిర్మింప ఆయనే కారణమని మరవకుడి. అట్లునేడు ప్రపంచ భిక్షువు లెల్లరు స్వేచ్ఛగా ఆ విహారాలకు దేవాళయాలకు వచ్చి బుద్ధదేవుని దర్శించి, ధ్యానించుటకు తగు పలు సౌకర్యములందు కల్పింపబడినవని తెల్పుటకెంతో సంతోషంగా యున్నదికదా!

అట్లా మహాత్మ దర్మపాల దర్మాత్ముడు 40 సంవత్సరాలు యీ మన దేశంలోనే జీవించి బౌద్ధ ధర్మాన్ని పునః ప్రతిష్ఠింప చేయ పై విధంగా ఆయన పడిన శ్రమ, బౌద్ధధర్మమే కాని వేరుకాదు.

ఆయన 29-4-1933లో సారనాథ్‌లో నిర్వాణము (బుద్ధుని) చేరేను. అమెరికాలోని చికాగో నగర సభలో "శ్రీ బుద్ధదేవునికి యావత్తు ప్రపంచము ఋణపడి యున్నదని చాటిన ఘనునికి నేడు భారతదేశమేగాక సర్వ ప్రపంచం ఋణపడి యున్నదనుట పరమ సత్యం సుమా. (ఆయన విగ్రహం సారనాథ్‌లో ఆవిష్కరింపబడి యున్నదని మనవి.)

బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి

పై శ్రీ బుద్ధగీతలో పై చరణాతో మొత్తం ఆయన తత్త్వసారనికి ప్రతిసారి మన మనవి చేయుచున్నాను.

1) బుద్ధం శరణం గచ్ఛామి

ఎట్లనగా మొదటిచరణ ప్రకారం "మన బుద్ధియే మనకు (సర్వజనులకు) శరణ్యమైనది. మన బుద్ధియే నడిపించుచూ సర్వం చేయించుచున్నదని గమనించమనవి.

ఇంకొక అర్థంగా తీసికున్న శ్రీ బుద్ధ దేవునినే సేవింపుము. ఆయనే నిన్ను నడిపించును.''

2) సంఘం శరణం గచ్ఛామి

అనగా మనం జీవించాలంటే యిరుగు పొరుగు జనులకు దయా, ధర్మం, పరోపకారం, సత్య, ధర్మాల మనం పాటించుచూ సంఘానికి తెలియచేయ తగును ఇక.

3. ధర్మం శరణం గచ్ఛామి.

ఈ పాదం అనన్య సాటిలేని యర్థం కలిగియున్నది. ధర్మంలో సత్యమొక భాగమే. అహింస యీ ధర్మం లోనిదే. పరోపకారం యీ ధర్మం నుండియే పుట్టినది. కాన పై పదముల కర్థం తెలుప యిది స్థలం చాలదు. పాఠకులు గమనించ విజ్ఞప్తి. నేడు మన ముఖ్య ధర్మం యేమనగా ఆ మహాత్ముడు తెల్పిన మార్గంలో నడచుకొనుటయే మన గమ్యంగా యున్నది, నేటి అరాచక అన్యాయ, అసత్య, హింసా స్వార్థపరచింతలు సమాజంలో (మనలో) ముందెన్నడూ లేని విధంగా ప్రబలియున్నవి. అందుకు విరుగుడు యెవరికివారు శ్రీ బుద్ధ దేవుని మార్గంలో నడువుమని మరి మరి మిమ్ము కోరుచున్నాను.

ఈ సందర్భంగా యెల్లరికి నేను మనవి చేయుట ఏమనగా ఆ మహాత్ముని అనగారిక ధర్మపాలుని మన జాతీయ భారతీయ చరిత్రలో దేశపు చరిత్ర కారులెందుకు చరిత్ర పుటలలో యెందు కెక్కించలేరని ప్రభుత్వాన్ని అందరం తెల్పకోరుచున్నాను. ఆయన గురించిన చరిత్ర యే పుస్తకము లందున్నదో నాకు మాత్రం తెలియుటలేదు. అయితే ఇంతకు మునుపే అట్లు పాఠ్యపుస్త కాలందు యెక్కించియుండిన నన్ను క్షమించమని వేడుకొనుచున్నాను. లేదా అట్లెక్కకున్న చిన్న ఉద్యమ పోరాటం అహింసా విధానంలో నడువ సిద్ధము కండని విజ్ఞప్తి.

ఎవరో యెందరో ఈ జాతిలో చరిత్ర పుటల కెక్కినారు. ఇంత త్యాగం, చేసిన భారతదేశం తన మాతృభూమియని భావించియే అట్లాయన ధీరోదాత్తంగా మనజాతిని ప్రపంచ దేశాలందు ప్రజ్వలింప చేసిన ఘనునికి మనమిచ్చు కనీస కృతజ్ఞత ఇదేనా? దయచేసి గౌ॥ శ్రీ యన్. టి. రామారావు గారు మన ముఖ్యమంత్రి శ్రీ బుద్ధదేవుని 60 అడుగుల యెత్తుతో నిర్మించినందుకు నా

ధన్యవాదాలు. పలుమార్లా విగ్రహాన్ని చూశాను. ఐతే రాజకీయ లబ్ధిదారుల చేతిలో ఆవిష్కరణ కార్యం బంధింపబడి ఇంకా ప్రతిష్ఠ జరుగలేదు. నేడు గౌ॥ ముఖ్యమంత్రి త్వరలో హుశేన్ సాగర్‌లో యున్న దాని యావిష్కరణ త్వరలో చేయగలరని కోరుచూ అట్లు ఆశించుచున్నాను. ఎల్లరినీ శ్రీ బుద్ధదేవుడు సర్వరక్షుడు దయామయుడు కరుణామయుడు ఎల్లపు డెల్లరినీ ఆశీర్వదించ ఆ దేవుని ప్రార్థించుచున్నాను.

నేను 1948లో ఈ గ్రంధ రచనకు పూనుకొనుట శ్రీ బుద్ధుని గురించి యున్న Light of Asia అను గ్రంథాన్ని బొంబాయిలో కొని మరి మరి చదివినాను. ఆ కారణంగా ఆయన గురించి జ్ఞానవెలుగు పేరున చిన్న గేయమాల వ్రాసి ప్రకటించితిని. ఆ సందర్భంలో తాడిపత్రిలోయున్న స్వాతంత్ర సమరయోధుడు జ్ఞానియగు కీ॥శే॥ కలచవీడు వెంకటరమణాచార్యులు గారు బుద్ధ పురాణం (తెలుగులోనే) అను మహా పెద్ద దాదాపు 1086 పేజీలతోయున్న గ్రంధాన్ని దయతో చదువుమని నా కొసంగెను. దానిని "అభినవ బౌద్ధవాఙ్మయ కవిబ్రహ్మ" కీర్తిశేషులు స్వతంత్రోద్యమ ఆంధ్ర రాష్ట్రనాయకుడుగా ప్రఖ్యాతి గాంచెను. ఆయన మా తాడిపత్రికి 1947 – 48 లో వచ్చియున్నది నేను గమనించియున్నాను. ఆ మహా పురాణం పలుమారు చదివి గ్రంధంలోని ఆయన బోధనలు 'శ్రీబుద్ధగీత' యనియే రచింపబడియున్నది. దానిని నేనిట్లు సంగ్రహించి 'శ్రీ బుద్ధగీత' యను పేరుననే ఆయా వర్గములతో పాఠకుల కందించుచున్నాను. శ్రీ భగవద్గీత సామాన్యులకర్థంకాదు, అందు విశదంగా మానవుని వివేకవంతుని చేయు ప్రక్రియల మార్గములు బహు తక్కువగా చూపబడినవి. 'శ్రీ బుద్ధగీత' చదివినవారు వివేక మార్గ నడచు దారుల గురించి స్పష్టంగా తెలుపబడినదని తెల్పుటకు మహదానందంగా యున్నదనియు యా శ్రీ బుద్ధదేవుని గ్రంధాన్ని యెల్లరు చదువుటకు యెల్లరి ఆశీర్వదించ మరి మరి వేడుచున్నాను.

1993 లో రచించిన శ్రీ శాంతి చక్రవర్తి గ్రంధంలో ఆ దేవదేవుని జీవితం సంక్షిప్తంగా గేయమాలగా వ్రాసియున్నాను. సులభశైలిలో వ్రాయబడి యున్నదని యెల్లరికి మనవి చేయుచూ నన్ను యనుగ్రహించ పాఠకులను కోరుచున్నాను.

ముఖ్య గమనిక:-

1. ఈ గ్రంథంలో నున్నవన్నియు శ్రీ బుద్ధ పురాణంనుంచి సంగ్రహించ బడినవని మనవి.

2. అమరసింహుని 'అమరం' అను గ్రంధంనుండి ఆయన పేర్లను గ్రహించితిని.

* 3. 'అభినవబుద్ధుడు' యను శీర్షికన తెల్పిన విషయాలన్ని The Worlds Debt to Buddha

* 4. 'The Maha Bodhi' అను జర్నలు నుండి (1993)

* 5. 1893 సంవత్సరం నాటి మహా బోధి జర్నల్స్ నుండి తిరిగి ముద్రించిన భాగాలు నుండి సంగ్రహించబడినవి.

* ఇవి ఇంగ్లీషు నందున్నవి!

నిర్వాణదశకు పాటించతగు ముఖ్యములు

బౌద్ధ సాధకుడు అన్ని ధర్మములకన్న దయకే అధిక ప్రాధాన్యత నీయ వలయును.

1) దాహపీడితులకు దాహము 2) నీడనిచ్చు చెట్లను పెంచుటయు 3) విరామ మందిరముల నిర్మించుటయు 4) అనాథ శరణాలయములు నిర్మించుటయు 5) నిస్సహాయ రోగులకు ఔషధాలయములు ఏర్పరచుటయు 6) అజ్ఞానమందున్న సంసారులకు జ్ఞాన ప్రబోధములుచేయు బోధనాలయము లేర్పరచుట.

నిర్వాణమునకు బుద్ధ దేవుని బోధనల విధముల విధానములు

1) చతుర్విధ ధ్యానములు 2) చతుర్విధ ధర్మచేష్టలు 3) చతుర్విధ బుద్ధి పాదములు 4) పంచవిధమగు నైతిక బలములు నిచ్చు ధ్యానము 5) సప్త విధములగు బోధలు 6) అష్టవిధ మార్గ జీవన విధానము (అదియే అష్టాంగ మార్గము)లో జీవించుట. ఇంకను 1) సాధకులు కపటవ్యూహము లేకుండుట
2) ఏ ప్రాణిని చూచినా అసూయ పడకుండుట
3) ఎవరిమీదగాని క్రోధము (ద్వేషము) లేకుండుట

4) పరులమీద ఆధారపడక జీవించుట (సోమరితనం లేక) ఇవియే చతుర్విధ ధర్మములు.

1) సాధకులు నిలుచుండినను 2) కూర్చొనియున్నను 3) నడచుచున్నను 4) భుజించుచున్నను 5) నిదురించుచున్నను 6) అవ్వాని యందున్న యన్ని మార్గములను విశుద్ధ ప్రేమతో ఒకే విధంబున నుండుట 7) అన్నింటి యందును ప్రేమ కలిగి యుండుట (అన్ని ప్రాణులమీద ప్రేమ కలిగి యుండుట) సప్తవిధముల బోధలివియే సుమా.

పంచవిధములగు నైతిక బలము లేనివి

1) అవిద్య (అహంకారము) 2) స్వార్థము 3) అసూయ 4) ద్వేషము 5) కోర్కెల చిత్తము కల్గియుండుట.

1) సాధకుడు దుఃఖము చెందడు 2) ముసలితనమునకు 3) రోగమునకు 4) చావులకు భయపడడు 5) దుఃఖించడు

నిర్వాణదశలు మూడు విధములు

1) వాసనా నిర్వాణము 2) సంస్కార నిర్వాణము 3) దుఃఖ నిర్వాణము

నిర్వాణ దశ

కారణ మేదియైనా మానవుడు భ్రాంతి నుండి తప్పక విముక్తి పొందును. సాధనకు ముందుకాలమతడు క్రింది దశలో నుండును. సాధన తర్వాత నతడు ఉన్నత స్థానము చేరును. సాధన లేనపుడతనికేమియు తెలియుదు. పైస్థానమున కతడు యెదిగిన తర్వాత సర్వము నతడు గ్రహించ గలుగును. ఆ సత్యరూప స్థితిని తెలియు సామర్థ్యమునే నిర్వాణ మనబడును.

విముక్తి యనగా :

అహంకారము నశించి, దుఃఖము నశించి (లేక) మమకారము లేకుండా నశించిన వెంటనే సంసార విజయుడై విముక్తి పొందును. అదియే విముక్తి చెందుటనబడును.

శూన్యమైనది, వినాశనము గలది, అసత్యమైనదియు, క్షయము గలది నిర్వాణ మెంతమాత్రము కాదు.

శ్రీ బుద్ధదేవుని నిర్వాణ స్థలము కుశీ నగర మార్గమధ్యమున మల్ల జాతీయులు నివశించు శాల వనమున చివరగా శిష్యులతో ప్రవేశించెను. అందున్న చెట్లనీడన యొక మెత్తని శయ్యను సిద్ధము చేయబడెను.

ఆ శయ్యపై ఉత్తరాభిముఖుడు శ్రీ బుద్ధదేవుడు శయనించెను. ఆనందునితో నేటి రాత్రి తుది ఘడియలో నా నిర్యాణము జరుగుననెను.

శ్రీ బుద్ధదేవుడు 29 సంవత్సరములలో ఇంటిని త్యజించిపోయెను. ఆయన 81 సంవత్సరముల వరకు భువిపై జీవించెను. తాను తెల్పిన అష్టాంగ మార్గమే యందరికి శరణ్యమని అంత్యకాలమందు సుభద్రుడను వానికి బోధించెను.

బౌద్ధ సంఘమునందు కూడిన భిక్షువులను 'భన్తే' లేక 'అయస్మా' అనగా ఆర్యా యని పిలుచుకొనుచుండుడని శ్రీ దేవుడు తెల్పెను.

శిష్యులకు చివరిబోధ :- "నాయనలారా! సంసారమునందు సంయోగముచే జనించు సకల పదార్థ సమూహము తప్పక నశించితీరునని తెలియుడు. మీ రెల్లరు నిశ్చల ధ్యాన కృషిచేసి సచ్చిదానందకమంబగు నిర్వాణ పదవిని బడయుడు. బుద్ధుని మరువవలదు. సంఘమును స్మరించుట మరువకుడు. ధర్మమును వదలకుడు."

దేదీప్యమాన తేజోవదనముతో

"బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి"

అని తెల్పి యా దేవుడు గంభీరమగు అగాధ ధ్యానమందు నిమగ్నుడయ్యెను. అపుడు శిష్యులిట్లు జపించిరి.

"నమో బుద్ధాయ నమో ధర్మాయ
నమస్సంఘాయ నమోనమః"

శ్రీ బుద్ధదేవుడు పావా గ్రామము అంత్యములో చేరెను. చుందుడను (కంసాలి) లోహకారుని నిర్మాణశాలను చేరెను. అతడా దేవుని పాదముల కడిగి మ్రొక్కి పాదధూళిని తలపై వేసికొనెను. ఆ శిష్యుడు పౌష్టికాహారమును (సూకరకందము) వండి విందు చేయించెను. దేవుడు వృద్ధుడైనందున ఆ యాహారము తిని జీర్ణముగాక కొంత బాధపడెను.

శ్రీ దేవుడు భిక్షువులతో 'కుకుద్దము' అను పేరుగల నదీతీరము చేరెను. అందు ఆమ్ర (మామిడి) చెట్టు నీడన దేవుడు పరుండి ఆనందా నిర్వాణ సమయ మేతెంచినదనెను. చుందుని విందు భోజనము వలన మహాత్ముడు మరణించెనను వాదాన్ని ఖండించుడని దేవుడనియె.

మంచి విందు యాహారములు రెండే దేవుడు తినియుండెను. 1) సుజాతాదేవి భోజనము వలన బ్రహ్మానందము చెందిన అనుభవమయ్యెను. 2) అది యీ చుందుని విందు భోజనమే. దానితో నిర్వాణమే లభించెను.

అచటినుండి కుశీనగరము చేర కష్టముగా నుండెను. ఆ చుందునీ విందు భోజనము సూకరకందములతో వండినది. సూకర కందములనెడి గడ్డలు లేక దుంపలానాడు బహుప్రీతిగా వంటల జేసికొనుచుండునట్లు యానాటి వంటల గురించి తెలియుచున్నది. ఆ దుంపలు బలమైన యాహారమై జీర్ణము త్వరగా కాకుండ యున్నందున వృద్ధాప్యములో యీ దేవునికి కొంత అజీర్తి కల్గించి బాధించినట్లు తెలియుచున్నది.

దీనినే శ్రీ బుద్ధదేవునిపై అసూయ ద్వేషములతో ఆయన మతము వలన యనేక గర్వాంధులైన బ్రాహ్మణులకు పరాభవము కల్గి, గౌరవం లేక సంఘంలో నీచంగా చూడబడెను. అందుకు ఆయనపై చెడుభావము కల్గించి జనులలో ఆయన మతముపై విరక్తి కలుగజేయ కొందరు బ్రాహ్మణులు కాని నీచ బ్రాహ్మణులు క్రింది విధంగా కథ కల్పించి ఆయన తదనంతరం వ్యాప్తి జేసినట్లు స్పష్టంగా తెలియుచున్నది.

అదేమనగా సూకరకందము వండబడె ననుటను పంది మాంసము ఆ విందు భోజనమయ్యెననియు పందిమాంసమును యీ దేవుడు తినియున్నాడని

అందువలనే ఆయనకట్లు యజీర్ణమయ్యెననియు, దానితో మరణించె ననియు కల్పించబడి ప్రచారము చేయబడినది.

ఆ కల్పన గురించి అలోచించిన నది తప్పక కల్పనయనియే తోచును. గానియది సత్యము కాబోదని యాదేవుని గుణగణములు గ్రహించినవారు, ఆయన జీవహింస కన్ని విధముల వ్యతిరేక మనియు మరియు యాయన అహింసా మూర్తియై యున్నాడనియు కలలో కూడ మాంసాహారము కోరని నిష్కామ, నిశ్చల సత్యధర్మ స్వరూపుడై యుండియు మాంసాహారమట్లు తిన్నా డన్న యెట్లు నమ్మవలయునో తెలియకున్నది. మరియు తన యాశిష్యుడు మాంసాహారము అహింసా మూర్తికి పెట్టనగునని తోచియుండునా? ఆ శిష్యుడు మాత్రం జంతువును (పందిని) జంపి యా మాంసమే పెట్టవలయునని తలంచుట సాధ్య మయ్యెడిదా? కాన యది సర్వాసత్యమనక తప్పదు. ఆయన సిద్ధాంతము గాని, ఆయన తత్త్వముగాని ఆ జంతు మాంసము తినుట సహింపనలవికానిదై యుండి యట్టి ఘోరనింద శత్రు పద్ధతిలో కల్పించిబడి ఆయనపై నీలాప నిందలు వేయ యుద్దేశ్య మేయదియని స్పష్టంగా యెంత జ్ఞానహీనునికైనా తెలియగలదు. ఈ మానవులలోయున్న క్రోధ బుద్ధితోయీాసు నసూయలతో పై నింద శ్రీ బుద్ధదేవునిపై కల్పించబడినదని స్పష్టంగా ఋజువగుచున్నదికదా!

అచటినుండి కుశీనగరము చేర కష్టముగా నుండెను. కాన సమీాప మందున్న శాలవనము చేరిరి. అచట మల్లదేశీయులు నివసించిరి. కుశీనగర మచటికి సమీాపమందున్నందున యాదినం చివరిఘడియలో శ్రీ దేవుడు ప్రాణం వదలునని యా జనావళికి తెలిసిపోయెను. అపుడు విశేషంగా జనులు వచ్చి ఆ మహాత్ముని దర్శించుకొనిరి.

చివరగా వచ్చిన నవయువకుడు సుభద్రుడను నతడు వచ్చి జ్ఞానమార్గ మును తెల్పుమనివేడగా కుమారా! నేను తెల్పినయష్టాంగ మార్గమును యనుస రించుమని యుపదేశించెను.

"బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి"

సంపూర్ణం

బౌద్ధుల పవిత్రగంధాలు త్రిపీటకము లనబడినవి. 1. వినయపీటకం 2. మత్తపీటకం 3. అభిదమ్మ పీటకం. బౌద్ధులు రెండు వర్గాలుగా చీలిరి.

1. హీనయాన మరియు మహాయాన

2. హీనయానం యనగా బుద్ధుని మహా బోధకుడుగా నమ్మేవారు. బుద్ధుని భగవంతుడిగా భావించువారు మహా యానమని తెల్పిబడెను. బౌద్ధ మహా సభలను బౌద్ధ సంగీతులనబడినవి. మొదటి బౌద్ధ సంగీతి అజాత శత్రువు కాలంలో రాజగృహంలో జరిగినది. ఆ సంగీతిలో వినయ, మత్తపీటకములు క్రోడీకరించబడినవి.

3. రెండవ బౌద్ధ సంగీతిలో రెండు వర్గాలుగా విడిపోయిరి. మహ సాంఘి కులుగాను మరియు అట్లు మార్పు కోరువారిని పిలువబడిరి. సంఘంలో మార్పు అవసరం లేదన్నవారిని స్థిరవాదులనబడిరి. మూడవ బౌద్ధ సంగీత అశోకుని కాలంలో జరిగినది. బౌద్ధులు నాల్గవ మహాసభలో హీనయానులు, మహా యానులుగా చీలిపోయిరి. బౌద్ధమతం యానాడు క్షత్రియులందు ప్రథములైరి. రెండవవారుగా బ్రాహ్మణులైరి. నాల్గవ బౌద్ధసంగీతికి వసు మిత్రుడు అధ్యక్షుడు గాను ఉపాధ్యక్షుడు అశ్వఘోషుడుగా నుండిరి.

4. అనాడు అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో మన దేశంనుండి పోయి పాల్గొన్నది స్వామి వివేకానందుడేయని తెలిసినది. కాని మరో శ్రేష్ఠుడున్నాడు. దురదృష్టవశాత్తు ఆపేరు ప్రచారమ లోనికి తేలేదు. అయనపేరు 'అనగారిక ధర్మపాలుడు' అని తేలినది. ఆయ శ్రీలంక దేశీయుడు. 1893 సంవత్సరంలో ఆ సభ సెప్టంబర్ 11 తేదీ జరిగినది.

(15-2-94 జనశక్తి పత్రికనుండి 1: 2: 3: 4)

I. 'Man's Mission on Earth'

II. "The World's Debt to Buddha" అను అంశాలపై

1893 సెప్టంబరు 11వ తేదీన అమెరికాలోని 'చికాగో' నగరమందు శ్రీ అనగారిక ధర్మపాలుడు ప్రపంచ సర్వమతసమ్మేళనంలో గంభీర యుపన్యాస మిచ్చి ప్రపంచానికి ముఖ్యంగా పాశ్చాత్య ప్రపంచానికి శ్రీబుద్ధదేవుని జీవితం గురించి మరియు ఆ దేవుని బోధనల గురించి యెల్లరాసభయందు ముగ్ధులై వినునట్లు సమ్మోహనా పదజాలముతో గంభీరముగా యుపన్యసించి భారత దేశాన్ని కీర్తి ప్రతిష్ఠలతో వెలిగింపచేసెను.

కాన ఆ ధర్మపాలునికి భారతదేశం ఋణపడి యున్నది.

Acc. No. 21960

294.3
NAR.

రు. 25-00

